


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

ATTENTION PLEASE

కూడళ్లు.. కష్టాలు..



నగరంలో జంక్షన్ల వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

ఇరుకుగా ఉండటం, ఫ్రీలెఫ్ట్ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు

127 జంక్షన్ల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నా ముందుకు సాగని పనులు

చాలా చోట్ల ఫ్లైఓవర్లు కట్టినా తప్పని తిప్పలు

వాటికి ముందు, వెనక వాహనాల రద్దీతో సమస్య

ఫుట్‌పాత్‌లు సరిగా లేక పాదచారులకు ఇబ్బందులు

బండి తీసి రోడ్డెక్కాం.. ఆ రోడ్డు ఎంత బాగున్నా.. ఫ్లైఓవర్ ఎక్కి ఎంచక్కా దూసుకెళ్లినా.. ఏదైనా జంక్షన్ రాగానే ఉత్సాహం కాస్తా తుస్సుమంటుంది. అడుగులో అడుగేస్తున్నట్టుగా కదులుతున్న వాహనాలతో చిరాకు మొదలవుతుంది. ఎడమ వైపు 'ఫ్రీలెఫ్ట్' ఉంటుందేమో అనుకుంటే.. ఇరుకైన జంక్షన్‌తో అదీ ప్యాక్ అయిపోయి ఉంటుంది. ఎలాగోలా జంక్షన్ దాటేసి, కాస్త దూరంలోని మరో ఫ్లైఓవర్ ఎక్కుదామనుకుంటే.. దానికి ముందే మళ్లీ వాహనాల నత్తనడక మొదలవుతుంది. చిరాకు మరింత పెరిగిపోతుంది. ఎవరైనా వీఐపీ కోసం ట్రాఫిక్ గానీ ఆపి ఉంటే.. ఈ 'మంట' నషాళానికి అంటుతుంది. హైదరాబాద్ మహా నగరంలో కూడళ్ల నిర్వహణ సరిగా లేక జనం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

సాక్షి, హైదరాబాద్

సిగ్నల్ ఫ్రీ సిటీ కోసం చర్యలు చేపట్టినా..

హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ సిగ్నల్ ఫ్రీగా సాగేందుకు గత పదేళ్లలో పలు చర్యలు చేపట్టారు. కొత్తగా కొన్ని ఫ్లై ఓవర్లు నిర్మించారు. అయినా ప్రజలకు రవాణా కష్టాలు తీరలేదు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టకపోవడం, జంక్షన్లను అభివృద్ధి చేయకపోవడమే దీనికి కారణమన్న విమర్శలు వస్తున్నాయి. వాహనాలు జంక్షన్ల వద్ద చాలాసేపు ఆగిపోవాల్సి వస్తోంది. దాంతో ప్రయాణ సమయం, ఇంధన వ్యయంతోపాటు కాలుష్యం కూడా పెరిగిపోతోంది. మరోవైపు జంక్షన్ల వద్ద ఫుట్‌పాత్‌లు సరిగా లేక పాదచారులు నడవడానికి, రోడ్డు దాటడానికి తీవ్రంగా ఇబ్బందిపడాల్సి వస్తోంది.

ఫ్లైఓవర్ దాటితే అంతే..

కొన్ని ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల మీదుగా ప్రయాణం వేగంగా సాగుతున్నప్పటికీ.. ఫ్లైఓవర్ దాటగానే ట్రాఫిక్ చిక్కులు రెట్టింపు అవుతున్నాయి. ఉదాహరణకు ఐటీ కారిడార్‌లోని ప్రాంతాల నుంచి దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, ఎలివేటెడ్ కారిడార్ మీదుగా వేగంగా ఆగకుండా వచ్చే వాహనాలు జూబ్లీహిల్స్‌లో రోడ్ నంబర్ 45 చౌరస్తాలో ఒక్కసారిగా జామ్ అవుతున్నాయి. అక్కడి ఇరుకైన జంక్షన్ దీనికి కారణం. ఫ్లై ఓవర్లపై చూపిన శ్రద్ధ జంక్షన్ల విస్తరణలో చూపకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

→ జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల నుంచి పంజగుట్ట ఫ్లైఓవర్ మీదుగా బేగంపేట, సికింద్రాబాద్‌ల వైపు వెళ్లాల్సిన వాహనాలు, ఫ్లైఓవర్ కింద నుంచి ఖైరతాబాద్ దిశగా వెళ్లాల్సిన వాహనాలు అన్నీ ఫ్లైఓవర్‌కు ముందు, పంజగుట్ట చౌరస్తా వద్ద జామ్ అవుతున్నాయి. నగరంలో చాలా ఫ్లైఓవర్లకు ముందు, చివరల్లో ఇదే పరిస్థితి ఉంది.

భారీగా విస్తరణకు నిర్ణయించినా..

త్రీవేలు, చౌరస్తాలు, పెద్ద జంక్షన్లున్న చోట ట్రాఫిక్ ఇబ్బందులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీనితో జంక్షన్లను విస్తరించి, అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత జోన్‌కు రెండు చొప్పున నగరవ్యాప్తంగా 12 జంక్షన్లను అభివృద్ధి చేయాలనుకున్నారు. తర్వాత వీటిని 60కి పెంచారు. నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను గుర్తించి.. మొత్తం 127 జంక్షన్లకు విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో 13 చోట్ల మాత్రమే పనులు చేపట్టారు. మిగతావీ మొదలై, పనులన్నీ పూర్తయ్యేందుకు ఎంతకాలం పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఆస్తుల సేకరణ, యుటిలిటీస్ షిఫ్టింగ్ వంటివి ఈ పనులకు ఆటంకంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం చేపట్టిన వాటిల్లో పూర్తికానివే కాక ఇంకా పనులే ప్రారంభం కానివీ ఉన్నాయి. జీహెచ్‌ఎంసీలో పనులకు కొంతకాలంగా బిల్లుల చెల్లింపులు ఆలస్యమవుతుండటంతో పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. సగానికిపైగా జంక్షన్లకు ఇంకా డీపీఆర్‌లే పూర్తి కాలేదు.



విశాలంగా ఉన్నా తప్పని తిప్పలు..

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ఆరాంఘర్ జంక్షన్ విశాలంగా ఉన్నప్పటికీ పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడపాదడపా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సులు కూడా ఎక్కడ పడితే అక్కడ ఆగుతుండటంతో ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఇక్కడ అండర్‌పాస్ ఉన్నా గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలో ఈ జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు రూపొందించినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాక నేటికీ పనులు మొదలు కాలేదు.



జంక్షన్లను అభివృద్ధి చేస్తారిలా..

ముఖ్యమైన జంక్షన్ల వద్ద వాహనాలు సులువుగా మలుపు తిరగడంతోపాటు పాదచారులు సులభంగా రోడ్డు దాటేందుకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి చేయనున్నట్లు ఇంజనీర్లు తెలిపారు. అందులో భాగంగా చేపట్టే పనులేంటో వెల్లడించారు.

- వాహనాలు సాఫీగా మలుపు తిరిగేలా రోడ్లను విశాలం చేస్తారు.
- జంక్షన్‌లో అన్నివైపులా పాదచారులు సులభంగా రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్స్ ఏర్పాటు చేస్తారు.
- బస్టాపులున్న జంక్షన్ల వద్ద ఎటువైపు వెళ్లే బస్సు ఎక్కాలనుకుంటే పాదచారులు అటువైపు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తారు. అవసరమైతే పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తారు.
- ఫ్రీ లెఫ్ట్ కోసం ప్రత్యేక మార్కింగ్స్ వేస్తారు.
- రాత్రివేళ జంక్షన్ అందంగా కనిపించేలా ప్రత్యేక లైటింగ్ ఉంటుంది. కూర్చునేందుకు బెంచీలు, ఇతర ఏర్పాట్లు చేస్తారు.
- జంక్షన్ల వద్ద రోడ్డు డివైడర్లలో అందంగా కనిపించేలా, ఆక్సిజన్ అందేలా మొక్కలు పెంచుతారు.
- పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు, వరద నీరు నిలవకుండా కాలువలు నిర్మిస్తారు.

127 జంక్షన్లను ఎంపిక చేసినా.. IIలో



మహ్మద్ జియావుద్దీన్, ఈఎన్సీ, జీహెచ్ఎంసీ

శాస్త్రీయంగా పరిశీలించి పనులు చేయాలి

కేవలం ఫ్లైఓవర్లు, యూటర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరవు. యూటర్న్‌లు ఏర్పాటు చేసేందుకు శాస్త్రీయంగా సిమ్యులేషన్ స్టడీ చేసి, ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేలా వాటి ప్రదేశాన్ని ఎంపిక చేయాలి. కానీ నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇది సరిగా జరుగుతున్నట్టు లేదు. ఏ పనులైనా సైంటిఫిక్ స్టడీతో చేస్తే ప్రయోజనం ఉంటుంది.



'ఫేక్' రికగ్నిషన్!

బల్దియాలో పేరుకే ఐటీ.. నిధులు లూటీ

- వివరాలు 7లో



వావ్ కిచెన్..

పిండి కొద్దీ రొట్టె అన్నారు పెద్దలు.. ఇప్పుడు వంట గది విషయంలోనూ ఇదే తరహా ఒరవడి నడుస్తోంది. అత్యాధునిక కిచెన్ మాడ్యుల్స్ కోసం నగరవాసులు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. లగ్జరీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలో ఇళ్లు, అపార్ట్‌మెంట్, గ్రూప్ హౌస్, ఇండిపెండెంట్ హౌస్.. ఎలాంటి ఇళ్లయినా అందులో ఏర్పాటు చేసే కిచెన్ విషయంలో కొనుగోలుదారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

- వివరాలు 11లో



నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఇది హైదరాబాద్ వాసులకు కాస్త ఉపశమనం కలిగించేది అయినప్పటికీ ఉష్ణోగ్రతలు మాత్రం ఇంకా తగ్గలేదు. ఎండాకాలం లాంటి వాతావరణ పరిస్థితులే ఉన్నాయి. సాధారణ వర్షపాతం కన్నా ఎక్కువ వర్షాలే కురిసినప్పటికీ మళ్లీ రుతుపవనాలకు బ్రేక్ పడింది. అయితే, ఇది సర్వసాధారణమే అని, మరో వారంపాటు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణాలేంటి?

అర్బన్ హీట్

- ప్రతి పదేళ్లకు 0.75 డిగ్రీల మేర ఉష్ణోగ్రత పెరుగుదల
- దేశంలోని టాప్–10 హాట్ మెట్రో నగరాల జాబితాలో భాగ్యనగరం
- అత్యధికంగా అహ్మదాబాద్‌లో 1.06 డిగ్రీల పెరుగుదల
- ఆ తర్వాతి స్థానంలో జైపూర్, పుణే, బెంగళూరు
- కాంక్రీట్ అరణ్యాలు పెరగడం వల్లే అంటున్న నిపుణులు.. ఐఐటీ–భువనేశ్వర్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్‌లో నగరీకరణతో ఏటికేడు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్


దేశంలోని పలు మెట్రో నగరాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగానే ఉండేవి. కానీ ఇటీవల వేడి మరీ ఎక్కువైపోతోంది. హైదరాబాద్‌లో పదేళ్లకోసారి 0.75 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుతోందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. ఇలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న 10 మెట్రో నగరాల్లో హైదరాబాద్ కూడా ఉంది. ఢిల్లీ, పుణే, బెంగళూరు వంటి నగరాల సరసన మన హైదరాబాద్ కూడా చేరింది. ఢిల్లీ, పుణేలో ప్రతి పదేళ్లకోసారి 0.90 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుతుండగా, బెంగళూరులో 0.81 డిగ్రీలు, నాసిక్‌లో 0.78 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుతోంది. అత్యధికంగా అహ్మదాబాద్‌లో ఏకంగా 1.06 డిగ్రీలు పెరుగుతుండగా, 1.02 డిగ్రీల పెరుగుదలతో జైపూర్ రెండో స్థానంలో ఉంది. ఐఐటీ భువనేశ్వర్‌కు చెందిన ప్రొఫెసర్లు సౌమ్య సత్యకాంత సేథీ, వినోద్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ మేరకు తేలింది. దేశంలోని 141 నగరాలపై వాళ్లు అధ్యయనం నిర్వహించారు.

తీవ్ర ఇబ్బందులే...

ఉష్ణోగ్రతలు భారీగా పెరగడం వల్ల అనేక ఇబ్బందులుంటాయి. ముఖ్యంగా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుంది. వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుంది. వేడి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు కూడా పెరిగిపోయి, మరణాలు కూడా సంభవిస్తుంటాయి.

కారణాలివీ..

ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఇందుకు గ్రీన్ హౌజ్‌వాయువులు ముఖ్యకారణమని అందరికీ తెలిసిందే. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఉష్ణోగ్రతలు పెరగడానికి నగరీకరణ ప్రధాన కారణమని సౌమ్య సత్యకాంత చెబుతున్నారు. చెరువులు, కుంటలు ఎక్కువగా ఉంటే ఆ నీరు ఆవిరి కావడం వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గి వాతావరణం చల్లగా ఉంటుంది. పట్టణీకరణతో భూ ఉపరితలంలో మార్పుల వల్ల సూర్యుడి నుంచి వచ్చిన వేడి తిరిగి గగనతలంలోకి వెళ్లకుండా ఆగిపోతోంది. ఈ కారణాల వల్ల అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం వల్ల నగరాల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ ప్రభావం ఎక్కువగా పచ్చిక బయళ్ల స్థానంలో భవనాలు, పరిశ్రమలు నిర్మించడం వల్ల సూర్యుడి నుంచి వచ్చిన వేడి వాతావరణంలోకి తిరిగి వెళ్లకుండా భూమిపైనే ఉంటోందని పట్టణ వాతావరణ పరిశోధకుడు శబరీనాథ్ వివరించారు.



రియల్ ఎస్టేట్ ప్రభావమేనా?

పశ్చిమ హైదరాబాద్ (గచ్చిబౌలి ప్రాంతం)లో ప్రధానంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో దశాబ్ద కాలంగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు విపరీతంగా పెరుగుతున్నాయి. అలాగే వాయవ్య హైదరాబాద్ అయిన పటాన్‌చెరు, బండ్లగూడ, ఆగ్నేయ దిశలోని బీఎన్ రెడ్డి నగర్, హయత్‌నగర్‌లో కూడా ఉష్ణోగ్రతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్లే పెరుగుతున్నాయని శబరీనాథ్ వివరించారు.

కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం వల్లే..

నగరంలో భవన నిర్మాణాలు ఎక్కువ కావడం, భూగర్భ జలాలు భారీగా తగ్గుముఖం పట్టడం, పచ్చదనం తగ్గిపోవడం, చెరువులు, కుంటలు తగ్గిపోవడంతో ఉపరితల ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. దశాబ్దకాలంలో భవన నిర్మాణ కార్యకలాపాలు ఏకంగా 70 నుంచి 80 శాతం పెరిగాయి. ఈ క్రమంలో ఇటీవలి కాలంలో నగరంలో భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అర్బన్‌హీట్ ఐలాండ్ ప్రభావంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. చలికాలంలో కూడా నగర శివార్లతో పోలిస్తే ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటున్నాయి.



నగరంలో భవన విస్తీర్ణం సంవత్సరాల వారీగా పెంపు ఇలా..

(మిలియన్ చదరపు అడుగుల్లో)





అందుకే వరదలు

భవన నిర్మాణాలు పెరగడంతో నీటి ఎద్దడి తీవ్రమైంది. కాంక్రీట్ భవనాలు, సిమెంటు రోడ్ల వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా వరదలు సంభవిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

–బీవీ సుబ్బారావు, ప్రముఖ పర్యావరణవేత్త



భవన నిర్మాణం పెరగడం వల్లే..

నగరంలో భవన నిర్మాణ కార్యకలాపాలు పెరగడం వల్లే ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. సరైన ప్రణాళిక లేకపోవడంతో ఇబ్బడి ముబ్బడిగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. దీంతో నగరాలు కాంక్రీట్ అరణ్యాల మాదిరిగా మారుతున్నాయి. దీంతో సూర్యుడి నుంచి వచ్చే కిరణాలు వాతావరణంలోకి వెళ్లకుండా ఉపరితలంపైనే ఉండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

–వైవీ రామారావు, తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సొసైటీ కన్సల్టెంట్


127 జంక్షన్లను ఎంపిక చేసినా..



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ నగరం పరిధిలో అభివృద్ధి చేసేందుకు 127 జంక్షన్లను ఎంపిక చేశారు. ఇందులో నానల్ నగర్, హబ్సిగూడ, చాదర్‌ఘాట్, మెహదీపట్నం, కర్బలా మైదాన్, పంజగుట్ట, రహ్మత్‌నగర్, నీరూస్ జంక్షన్ (రోడ్ నంబర్ 36), ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, లిబర్టీ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1, రోడ్ నంబర్ 12, నోబుల్‌టాకీస్ (మల్లేపల్లి), టప్పాచబుత్రా, రేతిబౌలి, పురానాపూల్, నల్లగొండ క్రాస్‌రోడ్స్, మిథాని, యూసుఫ్‌గూడ, సీటీఓ జంక్షన్, రసూల్‌పురా, మహరాజా అగ్రసేన్ జంక్షన్, మదీనా, చిలకలగూడ క్రాస్‌రోడ్స్, తిరుమలగిరి క్రాస్‌రోడ్స్, ఆనంద్‌నగర్ టి జంక్షన్ (నాగోల్), చక్రిపురం వై జంక్షన్, యాప్రాల్, ఆనంద్‌బాగ్, ఎన్ఎఫ్‌సీ, రమాదేవి హాస్పిటల్ (కుషాయిగూడ ట్రాఫిక్ పీఎస్), సరూర్‌నగర్ పోస్టాఫీస్, సరూర్‌నగర్ గాంధీ విగ్రహం జంక్షన్, సాగర్ క్రాస్‌రోడ్స్, వనస్థలిపురం రైతుబజార్, ఎన్జీవోస్ కాలనీ, బీఎన్‌రెడ్డి నగర్, ఏఎస్‌రావు నగర్, అశోక్‌నగర్, మల్కాజిగిరి, వినాయక్‌నగర్ (సఫిల్‌గూడ), చిల్కానగర్, బోడుప్పల్, మేడిపల్లి, చెంగిచెర్ల, దమ్మాయిగూడ, మన్సూరాబాద్ వై జంక్షన్, బండ్లగూడ వై జంక్షన్, ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్, ఖానామెట్, విప్రో జంక్షన్, బయో డైవర్సిటీ జంక్షన్ తదితర ముఖ్య జంక్షన్లు ఉన్నాయి.

పాదచారుల బాధలు వర్ణనాతీతం

నగరంలో జంక్షన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. ముఖ్యంగా పాదచారులు రోడ్లు దాటలేక పడుతున్న బాధలు వర్ణనాతీతం. జంక్షన్ల అభివృద్ధిలో భాగంగా పాదచారులు సులభంగా రోడ్డు దాటే ఏర్పాట్లు చేయాలి. పైపై మెరుగులు కాకుండా ట్రాఫిక్ చిక్కులకు శాశ్వత పరిష్కారంగా పనులు చేయాలి.



శ్రవంత్, రిటైర్డ్ సైంటిస్ట్, ఎన్ఎఫ్‌సీ

చేపట్టినచోటా పూర్తవని పనులు

తొలిదశలో రూ.31.16 కోట్ల అంచనా వ్యయంతో 13 జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిలో నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఆ వివరాలివీ..

ఏరియా	అంచనా (రూ.కోట్లలో)	పనుల పూర్తి శాతం
హబ్సిగూడ జంక్షన్	2.02	70%
కొత్తపేట జంక్షన్	3.05	85%
ఐఎస్ సదన్ జంక్షన్	3.20	
(ఈ జంక్షన్ బదులు చాదర్‌ఘాట్‌కు మార్చారు)		
ఆరాంఘర్ క్రాస్‌రోడ్	2.63	ప్రారంభం కాలేదు
సోమాజిగూడ జంక్షన్	2.00	పూర్తి
పంజగుట్ట జంక్షన్	1.98	40%
ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్	2.00	ప్రారంభం కాలేదు
మియాపూర్ క్రాస్‌రోడ్స్	2.00	పూర్తి
గుల్మొహర్ పార్కు జంక్షన్	5.00	ఉప సంహరించారు
కృష్ణకుంజ్ జంక్షన్	1.30	పూర్తి
ఐడీపీఎల్ జంక్షన్	2.00	పూర్తి
నారాయణగూడ జంక్షన్	1.99	75%
సంగీత్ జంక్షన్	1.98	90%

సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 87

మంగళవారం 18-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



గట్టెక్కిన బంగ్లాదేశ్

నేపాల్ జట్టుపై విజయం సాధించి 'సూపర్–8' దశకు అర్హత. - 14లో



బడా ఐపీఓల బొనాంజా!

రూ. 60 వేల కోట్ల సమీకరణకు ప్రణాళిక.. జాబితాలో హ్యుందాయ్, ఆఫ్కన్స్ - 15లో



కశ్మీర్ బీజేపీ ఇన్‌చార్జ్‌గా కిషన్‌రెడ్డి

త్వరలో ఎన్నికలు జరగనున్న జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ రాష్ట్రాలకు బీజేపీ ఇన్‌చార్జ్‌లను నియమించింది.

- వివరాలు 6లో



వయనాడ్ నుంచి ప్రియాంక

వయనాడ్ ఎంపీ సీటును వదులుకుంటున్నట్లు చెప్పిన రాహుల్ గాంధీ అక్కడి నుంచి తన సోదరి పోటీ చేస్తుందన్నారు.

- వివరాలు 6లో



నేడు ఉత్తర కొరియాకు పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లామిదిర్ పుతిన్ రెండు రోజుల పర్యటన కోసం మంగళవారం ఉత్తర కొరియాకు వెళ్లనున్నారు.

- వివరాలు 6లో



ఇజ్రాయెల్ వార్ కేబినెట్ రద్దు

ఇజ్రాయెల్ సైన్యానికి సూచనలు చేసే వార్ కేబినెట్‌ను ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అనూహ్యంగా రద్దుచేశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

రెండ్రోజులు మోస్తరు వర్షాలు



రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రెండ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు చెప్పింది.

- వివరాలు 16లో

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా కేఆర్ సురేశ్‌రెడ్డి



బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎంపీ సురేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన్ను పార్లమెంటరీ పార్టీ నేతగా, రాజ్యసభలో ఫ్లోర్‌లీడర్‌గా నియమిస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు.

- వివరాలు 2లో

పింఛన్ కోసం యాభై కిలోమీటర్లు!



కామారెడ్డి జిల్లాలో 'దేవునిపల్లి' పేరుతో ఉన్న 2 గ్రామాలకు చెందిన ఆసరా లబ్ధిదారులు పింఛన్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. బస్సులో రానూపోను ఏకంగా 100 కి.మీ. ప్రయాణించి పింఛన్ తెచ్చుకుంటున్నారు.

- వివరాలు 3లో

ఆర్టీసీ ఆసుపత్రిలో సీటీ స్కాన్



తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో రోగులకోసం ఎట్టకేలకు సీటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఇంతకాలం ఆసుపత్రికి వచ్చే ఆర్టీసీ ఉద్యోగులకు సీటీ స్కాన్ చేయాలంటే ప్రైవేటు ఆసుపత్రులకో, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకో పంపాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేకుండా, ఆర్టీసీ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది.

- వివరాలు 16లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	Dressed with Skin
₹ 65	139 kg	233 kg
	Retail Live Bird 161 kg	Skin Less 266 kg



పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్సు

9 మంది దుర్మరణం – మరో 41 మందికి గాయాలు

పట్టాలు తప్పిన మూడు 'కాంచనజంగ' కోచ్‌లు

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం: రైల్వేశాఖ

6లో

◀ ప్రమాదస్థలి వద్ద సహాయ చర్యలు చేపడుతున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

28 మంది ఐపీఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ సంఖ్యలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 28 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా యూనిట్స్ అధికారులతో పాటు హైదరాబాద్ సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక భారీ సంఖ్యలో ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడడం ఇదే మొదటి సారి. త్వరలో మరిన్ని ఐపీఎస్‌ల బదిలీలుండే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఎవరు ఎక్కడికి బదిలీ 5లో

బేషరతుగా.. వస్తారా?

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల చేరికపై రాజకీయ వర్గాల్లో చర్చ

ఇప్పటికే టీపీసీసీ నేతలతో టచ్‌లో కొందరు ఎమ్మెల్సీలు!

- శాసన మండలిలో బలం లేకపోవడంతో కాంగ్రెస్‌కూ వారి అవసరం
- అయితే బేషరతుగా వస్తేనే చేర్చుకుంటామంటున్న 'ముఖ్య' నేత
- చేరుదామా, వద్దా అనే ఊగిసలాటలో గులాబీ పార్టీ ఎమ్మెల్సీలు
- మండలి చైర్మన్ విషయంలో ఏం చేద్దామన్న దానిపై ఇరుపక్షాల్లోనూ అస్పష్టత
- బడ్జెట్ సమావేశాల్లో అవిశ్వాస నోటీసు ఇస్తారా, లేదా అన్నదీ డౌటే..
- ఏం జరిగినా ఎదుర్కొనేందుకు సైలెంట్‌గా సిద్ధమవుతున్న అధికార కాంగ్రెస్



సాక్షి, హైదరాబాద్

అసెంబ్లీ పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు జరగాల్సిన నేపథ్యంలో.. శాసన మండలి వ్యవహారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనా.. మండలిలో బీఆర్‌ఎస్‌కే మెజారిటీ ఉంది. అసెంబ్లీ ఆమోదించి, పంపిన బిల్లుల విషయంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అవకాశమూ ఆ పార్టీకి ఉంది. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో కొందరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ఆ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని.. 11 మంది ఇప్పటికే టీపీసీసీ నేతలతో టచ్‌లోకి వెళ్లారనే ప్రచారం జరుగుతోంది. కానీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లోకి బేషరతుగా వస్తేనే చేర్చుకుంటామని 'ముఖ్య' నేత షరతు పెడుతున్నారని అంటున్నారు. దీనితో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని, కాంగ్రెస్‌లోకి వెళ్దామా, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుదామా అన్న విషయంలో ఏమీ తేల్చుకోలేకపోతున్నారని చెబుతున్నారు.

మండలి బలం బీఆర్‌ఎస్‌దే

తెలంగాణ ఏర్పాటైన మొదట్లో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నా, శాసన మండలిలో ఎక్కువ మంది కాంగ్రెస్ సభ్యులు ఉండేవారు. మండలిలో రెండేళ్లకోసారి కొన్ని స్థానాలకు ఎన్నికలు జరుగుతూ.. ఎమ్మెల్సీల పదవీకాలం కొనసాగుతూ ఉండటమే దీనికి కారణం. అదే తరహాలో ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా మండలిలో బీఆర్‌ఎస్ బలం ఎక్కువగా ఉంది. బీఆర్‌ఎస్‌కు 26 మంది ఎమ్మెల్సీలు ఉండగా, కాంగ్రెస్‌కు ఆరుగురు, ఎంఐఎంకు ఇద్దరు, బీజేపీకి ఒకరు, ఇద్దరు టీచర్ ఎమ్మెల్సీలు ఉన్నారు. శాసనసభా సాంప్రదాయాల ప్రకారం అసెంబ్లీలో ఆమోదం పొందిన ప్రతి బిల్లు శాసనమండలికి వస్తుంది. దానిపై మండలి చర్చించి, ఆమోదం పొందాల్సి ఉంటుంది. బిల్లును ఒకసారి తిప్పిపంపేందుకూ అవకాశం ఉంటుంది. ఈ లెక్కన ఇకముందు కీలక బిల్లులు మండలికి వచ్చినప్పుడు అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్‌ఎస్‌కు చాన్స్ ఉంటుంది. ఇటీవల ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపే తీర్మానం విషయంలోనూ మండలిలో అధికార పార్టీకి ఇబ్బందులు ఏర్పడటం గమనార్హం. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి కూడా అవసరమేననే చర్చ జరుగుతోంది. ఇందుకుతగ్గట్టుగానే. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించిన కాంట్రాక్టు బిల్లులు, జిల్లా రాజకీయాల్లో తమకు కావాల్సిన పదవులు, రాష్ట్రస్థాయిలో గుర్తింపు, ఇతర అవసరాల ప్రాతిపదికన 11 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు ఇప్పటికే కాంగ్రెస్‌తో టచ్‌లోకి వచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. కానీ పార్టీ అవసరం ఎలా ఉన్నా ముందే షరతులు పెడుతూ వచ్చే వారిని తీసుకునేది లేదని రాష్ట్ర కాంగ్రెస్ 'ముఖ్య' నేత చెప్తున్నారని

మిగతా 2వ పేజీలో ▶

ఏటా రెండుసార్లు ప్రవేశాలు

సాధ్యమేనా?

అమెరికా తరహాలో భారత్‌లోనూ అమలుకు యూజీసీ కీలక నిర్ణయం

- జూలై–ఆగస్టులో తొలి సెషన్ జనవరి– ఫిబ్రవరిలో మలి సెషన్
- సన్నద్ధత కోరుతూ వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ లేఖ
- బోధన సిబ్బంది కొరత ఉన్న వర్సిటీల్లో అమలు ఎలా?
- అధికార వర్గాల తర్జనభర్జన

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్తగా తీసుకురానున్న ఏటా రెండు సార్లు ప్రవేశాల విధానంపై రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు తర్జన భర్జన పడుతున్నాయి. దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకపోయినా, ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలనే యూజీసీ ఆదేశాలు ఎలా సాధ్యమనే వాదన వినిపిస్తోంది. విశ్వవిద్యాలయాల్లో భారీగా బోధన సిబ్బంది ఖాళీలున్నాయి. ఏడాదికి రెండు బ్యాచ్‌లకు ఒకే అధ్యాపకుడు బోధించడం ఎలా సాధ్యమనే వాదన ఉంది. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్‌లో ప్రవేశాలు ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు చేపట్టాలని ఇటీవల యూజీసీ నిర్ణయించింది. ఇప్పుడు జూలై–ఆగస్టు మధ్య మాత్రమే ప్రవేశాలు

మిగతా 2వ పేజీలో ▶

మెడికల్ సీట్లపై ఉత్తరాది కన్ను!

- ఆలిండియా కోటాతో ఇతర రాష్ట్రాల సీట్లలో చొరబాటు
- పలుచోట్ల 'నీట్'లో అక్రమాలకు ఇదే ప్రధాన కారణమా?



3లో

కాలేజీలు తక్కువున్న రాష్ట్రాలకు వరంగా మారిన 15 శాతం ఆలిండియా కోటా

దేశవ్యాప్తంగా సీట్లను పొందేందుకు అక్రమాలకు పాల్పడుతున్న తీరు

అవకాశం ఉన్నా ఇతర రాష్ట్రాలకు వెళ్లని తెలుగు విద్యార్థులు

పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు



జీవనాడి సాక్షిగా నిజాలు గోదాట్లోకి..

పోలవరంపై పచ్చి అబద్ధాలు వల్లించిన ఏపీ సీఎం చంద్రబాబు

పునాది స్థాయిలో బాబు వదిలేసిన స్పిల్‌వేను 48 గేట్లతో సహా పూర్తిచేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

- స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలట్ చానల్ పూర్తి చేసి 2021 జూన్ 11న వరద మళ్లింపు
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో ఇరువైపులా ఖాళీలు వదిలేసి పనులు ఆపేసిన చంద్రబాబు

12లో

పోల'వరం' మరో నాలుగేళ్లకే – అది కూడా అంతా సవ్యంగా జరిగితేనే పూర్తి: చంద్రబాబు 12లో

కాళ్ల మీద పడినా కనికరించడం లేదు

గ్రూప్ 1 సహా నిరుద్యోగుల డిమాండ్లు అన్నీ నెరవేర్చాలి

'నీట్' లీకేజీపై కిషన్‌రెడ్డి, బండి స్పందించాలి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ గ్రూప్ 1, గ్రూప్ 2 పోటీ పరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులు ప్రజా దర్బార్‌లో కాంగ్రెస్ నేతల కాళ్ల మీద పడుతున్నా కనికరించడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నిరుద్యోగులను

మిగతా 2వ పేజీలో ▶

12 ఏళ్ల తర్వాత గ్రూప్-1 పెట్టింది మేమే

- ఆశ వర్కర్ల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదు
- హరీశ్, కేటీఆర్‌లకు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్

2లో





ముందే చెబుతున్నా.. సార్ దగ్గర ఏ పనైనా 'నీట్'గా ఉండాలి!

అద్భుత భవనాలపై 'అగ్లీ' ఏడుపు

రూ. 700 కోట్లతో నాసిరకంగా ఏపీ తాత్కాలిక సచివాలయం కట్టిన నాటి టీడీపీ సర్కార్

విశాఖలోని రుషికొండలో రూ.400 కోట్లతోనే ఐకానిక్ భవనాలు నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలివి..

శిథిలమైన హరిత రిసార్ట్స్ స్థానంలో నూతన భవనాల నిర్మాణం

- ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పనులు
- 61 ఎకరాల్లో 9.88 ఎకరాల్లోనే నిర్మాణాలు.. 2021లోనే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సమగ్ర వివరాలిచ్చిన ప్రభుత్వం
- విశాఖ ఖ్యాతిని ఇనుమడించేలా, రాష్ట్రానికే తలమానికంగా భవనాలు
- ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఫైవ్ స్టార్ వసతులతో నిర్మాణం
- విశాఖ నుంచి పాలనకు ఈ భవనాలు అనువైనవని తేల్చిన అధికారుల కమిటీ
- దీంతో సీఎం నివాసం, కార్యాలయానికి అనుకూలంగా కొన్ని మార్పులు
- అయినా సొంత భవనాలంటూ టీడీపీ నేతల గగ్గోలు

- వివరాలు 12లో



క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా కేఆర్ సురేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎంపీ కేఆర్.సురేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభలో ఫ్లోర్‌లీడర్‌గా నియమిస్తూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఆయనకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. సోమవారం కేసీఆర్‌ను కేఆర్.సురేశ్‌రెడ్డి, మరో ఎంపీ దామోదర్‌రావు కలిశారు. ప్రస్తుతం ఈ రెండు హోదాల్లో కే.కేశవరావు కొనసాగుతుండగా ఆయన స్థానంలో సురేశ్‌రెడ్డిని నియమిస్తున్నట్టు లోక్‌సభ, రాజ్యసభ సెక్రటరీ జనరల్‌లకు కేసీఆర్ విడివిడిగా లేఖలు రాశారు. సురేష్‌రెడ్డి గతంలో ఉమ్మడి ఏపీ శాసనసభ స్పీకర్‌గా పనిచేశారు.

బీఆర్‌ఎస్‌లా గొంతు నొక్కడం లేదు

విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం ఇస్తున్నాం: బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పాలనలో విద్యార్థి, నిరుద్యోగులకు ఎమ్మెల్యేలు, మంత్రులు అందుబాటులో ఉండేవారు కాదని, సమస్యలపై ప్రశ్నించిన వారిని అక్రమ కేసులు పెట్టి కట్టడి చేయాలని చూసేవారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి వర్గానికి సమస్యలు చెప్పుకునే అవకాశం ఇస్తున్నామని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో మాట్లాడిన వారి గొంతులు నొక్కేవారని, కాంగ్రెస్ హయాంలో అందరితో మాట్లాడి సలహాలు తీసుకుంటున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక జీవో 55ను రద్దు చేశామని, 11 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, జీవో నెం.3 ద్వారా మహిళా రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించామని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒకే రోజు మూడు ఉద్యోగ పరీక్షలు పెట్టేవారని, తాము ప్రతి పరీక్షకు సమయం ఇస్తున్నామని, అయినా లేని సమస్యను ఉన్నట్టు బీఆర్‌ఎస్ నేతలు చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఏదైనా సమస్య ఉంటే తనతో చెప్పినా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, నిరుద్యోగులను గందరగోళ పర్చేలా తప్పుడు ప్రకటనలు మాత్రం చేయవద్దని వెంకట్ విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంలను నమ్ముకునే మోదీ మళ్లీ ప్రధాని అయ్యారు

- వాటి వల్లనే ఓడిపోయినట్లు ఛత్తీస్‌గఢ్‌లో రుజువు కూడా అయింది
- మాజీ మంత్రి పుష్పలీల ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లను నమ్ముకునే నరేంద్రమోదీ మళ్లీ ప్రధానమంత్రి అయ్యారని మాజీమంత్రి పుష్పలీల ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలు అత్యంత ప్రమాదకరమని ఉక్రెయిన్ ప్రధాని అన్నారని, వాటితోనే చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కూడా ఓడిపోయారని తెలిపారు. మోదీకి దమ్ముంటే ఈవీఎంలను తీసేసి ఎన్నికలకు వెళ్లాలని గతంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్న మాటలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ అక్రమాలు చేసిన నాయకులను మాజీ సీఎం కేసీఆర్ విదేశాలలో పెట్టి ఇక్కడికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని, విద్యుత్ కొనుగోళ్ల స్కామ్‌లో అరెస్ట్ చేస్తారని కేసీఆర్‌కు భయం పట్టుకుందని విమర్శించారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు

పోలీసులు, అధికార యంత్రాంగంపై వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: బక్రీద్ సందర్భంగా వేల సంఖ్యలో గోవులను వధిస్తున్నా పోలీసులు, అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడంలేదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ ఆరోపించాయి. మెదక్ పట్టణంలో కత్తిపోట్లు, దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని వీహెచ్‌పీ రాష్ట్ర అధికార ప్రతినిధి పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట దగ్గర గోవులను కాపాడిన యువతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ యువతులను బూతులు తిట్టి, చంపేస్తామని వాహనాలను పైకి తీసుకొచ్చిన వారిపై కూడా కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, దాడులు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏటా రెండుసార్లు ప్రవేశాలు సాధ్యమేనా?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతున్నాయి. ఈ సెషన్ కాకుండా జనవరి–ఫిబ్రవరి మధ్య మరో దఫా అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించింది. 2024–25 విద్యా సంవత్సరంలోనే దీన్ని అమలు చేయాలని భావించడంపై వర్సిటీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి.

అమెరికానే ఆదర్శం...

అమెరికా సహా ప్రపంచంలోని పలు దేశాలు ఏటా రెండుసార్లు ప్రవేశాల విధానాన్ని అమలు చేస్తున్నాయి. దేశ విద్యా విధానంలోనూ మార్పులు తెచ్చారు. మార్కులు కాకుండా క్రెడిట్లు ఇవ్వాలని నూతన విద్యా విధానం పేర్కొంటోంది. విదేశాల్లోనూ ఇదే విధానం ఉండటం వల్ల డిగ్రీ గుర్తింపు తేలికగా ఉంటుందని భావిస్తున్నారు. అడ్మిషన్లు కూడా ఏడాదికి రెండుసార్లు ఉంటే విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందని యూజీసీ చెబుతోంది. వివిధ కారణాలతో తొలి దశలో ప్రవేశం పొందలేని వారికి జనవరి– ఫిబ్రవరిలో తేలికగా అడ్మిషన్ పొందే వీలుంది. ఏడాదిపాటు ఖాళీగా ఉండాల్సిన అవసరం ఉండబోదని యూజీసీ వర్గాలు అంటున్నాయి. పారిశ్రామిక వర్గాలు కూడా ఏడాదికి రెండు దఫాలు క్యాంపస్ సెలెక్షన్ చేసే వీలుందని చెబుతున్నాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశిస్తున్నారు.



మార్గదర్శకాలు రావాల్సి ఉంది



ఏటా రెండుసార్లు ప్రవేశాలపై యూజీసీ కసరత్తు చేస్తోంది. అయితే, ఇది ఎలా నిర్వహించాలనే విషయంలో ఇప్పటివరకూ ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. అవి వచ్చిన తర్వాతే సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాం. అన్ని స్థాయిల్లో చర్చించాల్సి ఉంటుంది.
–ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది



ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల హాజరు పెరుగుతుంది. ఇప్పటికే విదేశాల్లో ఇది నడుస్తోంది. ఇది విద్యార్థులకు ఉపయుక్తంగానే ఉంటుంది. కాకపోతే వనరుల సమీకరణ సవాల్‌గా ఉంటుంది.
– ప్రొఫెసర్ ఎస్‌వీ రమణారావు, నీట్ డైరెక్టర్, రాయపూర్

విద్యార్థులకు ప్రయోజనమే



అమెరికా వంటి దేశాలు అమలు చేస్తున్న తరహాలో భారత్‌లోనూ ఏటా రెండుసార్లు ప్రవేశాలు ఉంటే విద్యార్థులకు ఉపయోగమే. విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడొచ్చు. ఒకసారి ప్రవేశ పరీక్ష పాసైతే రెండోసారి అడ్మిషన్లకూ ఇది అర్హతగానే ఉంటుంది. కాబట్టి సాంకేతికపరమైన సమస్యలు ఉండాకపోవచ్చు.
– ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి

సన్నద్ధత ఎలా?

ఏటా రెండుసార్లు ప్రవేశాలపై సన్నద్ధతను కోరుతూ దేశంలోని అన్ని వర్సిటీలు, ఉన్నత విద్యా మండళ్లకు యూజీసీ లేఖలు రాస్తోంది. దీనిపై ఆయా సంస్థలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. రెండుసార్లు అడ్మిషన్ల వల్ల ఒకే కోర్సును రెండు సెషన్లుగా నిర్వహించాల్సి ఉంటుంది. మొదటి సెషన్ సెప్టెంబర్‌లో మొదలైతే, రెండో సెషన్ మార్చిలో మొదలవుతుంది. అప్పటికే మొదటి సెషన్ విద్యార్థులు ఒక సెమిస్టర్ పూర్తి చేసి ఉంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రెండు సెషన్ల నిర్వహణకు అవసరమైన ఫ్యాకల్టీ, లేబొరేటరీలు, తరగతి గది రూపంలో అవసరమైన వనరులు వర్సిటీలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ వర్సిటీలతో మన దేశంలోని విశ్వవిద్యాలయాలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఈ కారణంగా అదనపు క్లాసుల నిర్వహణ తేలికగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసులకు విదేశీ వర్సిటీలు తోడ్పాటును అందిస్తాయి. అయితే, ఇందుకు తగ్గ వనరులు, ఫ్యాకల్టీ, మౌలిక వసతుల ఏర్పాటుపై రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. అరకొరగా ఉన్న ఫ్యాకల్టీ కారణంగా నిర్వహణ ఏమేర సాధ్యమనే వాదన వినిపిస్తోంది. ఉన్నత విద్యా సంస్థల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడం, స్వయంగా ఆర్థికంగా బలపడే కొన్ని కోర్సులు తెచ్చే ఆలోచన కూడా యూజీసీ చేసే వీలుందని అధికార వర్గాలు అంటున్నాయి.

బేషరతుగా.. వస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

అంటున్నాయి. దీంతో బీఆర్‌ఎస్‌లోనే ఉండి ఎలాగోలా నెట్టుకురావాలా? అధికార పార్టీలోకి వెళ్లి 'పనులు' చక్కబెట్టుకోవాలా అన్నదానిపై కొందరు ఎమ్మెల్సీలు తర్జనభర్జన పడుతున్నట్టు చర్చ జరుగుతోంది.

మండలి చైర్మన్‌పై ఆసక్తికర చర్చ

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యవహారం కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. నల్లగొండ జిల్లా రాజకీయాల నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కుమారుడు అమిత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ లోక్‌సభ టికెట్ ఇవ్వకపోవడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నారని.. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలకు ముందే అమిత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని అంటున్నారు. దీంతో త్వరలో జరిగే అసెంబ్లీ పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాల్లో.. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ అవిశ్వాస తీర్మానం పెడుతుందనే చర్చ కూడా మొదలైంది. కానీ బీఆర్‌ఎస్ వర్గాలు ఈ విషయంలో గుంభనంగా ఉన్నాయి. సుఖేందర్‌రెడ్డి అధికారికంగా బీఆర్‌ఎస్‌లోనే ఉన్న నేపథ్యంలో ఏం చేసినా రాజకీయంగా ఇబ్బంది రాకుండా ఉండాలన్న ధోరణిలో గులాబీ పెద్దలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఉన్నట్టుండి మండలి చైర్మన్‌కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ అవిశ్వాసం నోటీసు ఇస్తే ఏం చేయాలన్న దానిపై కాంగ్రెస్ కూడా సిద్ధమవుతున్నట్టు తెలిసింది. దీంతో ఏం జరుగుతోందో అన్న అంశంపై రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది.

శాంతిభద్రతలు గాడితప్పాయి

- రోజూ నేరాలు జరుగుతున్నా సీఎంకు సమీక్షించే తీరిక లేదు
- బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడెనిమిది నెలల్లో శాంతిభద్రతల పరిస్థితి గాడి తప్పిందని బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలతో పాలన పడకేసిందని, హోం, విద్యాశాఖల వంటి కీలక శాఖలకు కూడా మంత్రులను నియమించుకోలేని దుస్థితిలో ఉన్నారని మండిపడ్డారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీకి డబ్బులు పంపించే పనిలో సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉంటే మంత్రులు తమ సంపాదనలో తామున్నారని ఆరోపించారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా, వీటిపై కనీసం సమీక్ష జరిపే సమయం కూడా సీఎంకు లేదన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఘటన రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బాగుందని అంటున్న కాంగ్రెస్ నేతలకు చెంపపెట్టు వంటిదన్నారు. బాధిత కుటుంబానికి ఇల్లు, రూ.20 లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధితులు, మంచిర్యాలలో మరణించిన ముగ్గురు తన నియోజక వర్గానికి చెందిన వారేనని, ఎండాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగిన తీరును ఇది స్పష్టం చేస్తోందన్నారు. గత 8 నెలల్లో గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని హరీశ్ విమర్శించారు. ఈ అంశాలన్నింటిపై అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో లేవనెత్తుతామని తెలిపారు.

కాళ్ల మీద పడినా కనికరించడం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

రెచ్చగొట్టి, అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాట తప్పుతోందన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు తమ సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్ వద్దకు వచ్చి విన్నవించుకుంటున్నారని పేర్కొన్నారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో సోమవారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులు కొత్త హామీలు కోరుకోవడం లేదని, గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. నిరుద్యోగుల తరఫున ప్రభుత్వం ముందు తాము పెడుతున్న ఐదు డిమాండ్లను నెరవేర్చాలన్నారు. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 చొప్పున అవకాశం ఇవ్వాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 కలిపి మరో ఐదు వేల ఉద్యోగాలు కలుపుతామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. టీజీపీఎస్సీతో పాటు డీఎస్సీ పరీక్షలకు నడుమ కనీసం రెండు నెలల వ్యవధి ఉండేలా చూడాలన్నారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలతో జాబ్ కేలండర్ ఇస్తామనే హామీ నిలబెట్టుకోవాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

'నీట్'పై కేంద్ర మంత్రులు స్పందించాలి

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో 24 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, నీట్ పరీక్ష విధానం, గ్రేస్ మార్కులు ఇవ్వడంపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని హరీశ్ అన్నారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి తెలుగు విద్యార్థులకు అన్యాయం జరగకుండా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీ స్పందించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో మధుసూదనాచారి

బీఆర్‌ఎస్ కార్యకర్తను.. పార్టీ మారను

తాను పార్టీ మారుతున్నట్లు ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నిలిపివేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. వ్యూస్ పెంచుకునేందుకు ఒక నాయకుడి నిబద్ధత, నిజాయతీ దెబ్బతీయొద్దు. నేను బీఆర్‌ఎస్ కార్యకర్తను, పార్టీలోనే కొనసాగుతాను. ఇలాంటి వార్తలు మానుకోకపోతే లీగల్ నోటీసులు పంపిస్తా అని హరీశ్‌రావు హెచ్చరించారు.

12 ఏళ్ల తర్వాత గ్రూప్–1 పరీక్ష నిర్వహించింది మేమే

- ఆశ వర్కర్ల గురించి మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ నేతలకు లేదు
- హరీశ్, కేటీఆర్‌లకు మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్




సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఎదురు చూసే పరిస్థితి ఉండేదన్నారు. 12 ఏళ్ల తర్వాత గ్రూప్–1 పరీక్ష నిర్వహించింది కాంగ్రెస్ పార్టీ హయాంలోనేనని బీఆర్‌ఎస్ నేతలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్‌ల ఆరోపణలను కౌంటర్ చేస్తూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆశ వర్కర్ల గురించి మాట్లాడే అర్హత హరీశ్‌రావుకు లేదు. బీఆర్‌ఎస్ హయాంలో ఆశవర్కర్లను గుర్రాలతో తొక్కించారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత అస్తవ్యస్త ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతున్నాం. మూడునెలల మా పాలన పూర్తయ్యేలోపే ఎన్నికల కోడ్ వచ్చింది. ఇప్పుడే కోడ్ అయిపోయింది. అన్ని హామీలు అమలు చేస్తాం. త్వరలోనే జాబ్ కేలండర్ విడుదల చేస్తాం.' అని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని, మతఘర్షణల వెనుక ఎవరున్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.



ఆలంఖాన్‌కు సీఎం రేవంత్ బక్రీద్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: బక్రీద్ సందర్భంగా అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్ నివాసానికి సోమవారం రేవంత్ రెడ్డి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ వెంట ఆలంఖాన్‌ను కలసిన వారిలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీమంత్రి జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బాల్య స్నేహితుడు జహంగీర్



సాక్షి, హైదరాబాద్: బక్రీద్ పండుగ సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తన బాల్య స్నేహితుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మహమ్మద్ జహంగీర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి కేసీఆర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.


మర్రికి కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ సోమవారం తన జన్మదినం సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మర్రికి కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు

ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌తో నష్టం!



- కొనుగోళ్లతో రూ.6 వేల కోట్ల వరకు భారమన్న ప్రభుత్వ వర్గాలు
- ఆ కరెంటు ధర, ట్రాన్స్‌మిషన్ చార్జీలు కలిపి అధిక ధర..
- సరిగా సరఫరాగాక బయటి నుంచి కొనుగోళ్లు
- అదనపు కారిడార్ బుకింగ్‌తోనూ అనవసరపు ఖర్చు అనే వాదన
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన బకాయిలపై వివాదం

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ సర్కారు శాసనసభలో విద్యుత్ రంగంపై శ్వేతపత్రం ప్రకటించడం, ఆ తర్వాత ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌తో సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో.. ప్రభుత్వం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అధ్యక్షతన విచారణ కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వ వర్గాలు పలు గణాంకాలు చెప్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం వల్ల దాదాపు రూ.6 వేల కోట్ల వరకు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని అంటున్నాయి. అనవసరంగా ట్రాన్స్‌మిషన్ కారిడార్లను బుక్ చేసుకోవడం, ఒప్పందం మేరకు విద్యుత్ తీసుకోకపోవడం, అర్ధంతరంగా కొనుగోళ్లు ఆపేయడం, బకాయిలు చెల్లింపుపై వివాదాలు వంటివన్నీ కలసి సమస్యగా మారాయని పేర్కొంటున్నాయి.

అదనపు ఖర్చులతో రేటు పెరిగి..

2017 చివరి నుంచి ఛత్తీస్‌గఢ్ విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని.. 2022 ఏప్రిల్ వరకు సరఫరా జరిగిందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలతో యూనిట్‌కు రూ.3.90 ధరతో 1000 మెగావాట్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నా.. ఏనాడూ పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా కాలేదని తెలిపాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్ర విద్యుత్ సంస్థలు కొనుగోలు చేసిన మొత్తం విద్యుత్ 17,996 మిలియన్ యూనిట్లని.. ఇప్పటివరకు రూ.7,719 కోట్లు చెల్లించారని, ఇంకా రూ.1,081 కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించాయి. ట్రాన్స్‌మిషన్ లైన్ల కోసం రూ.1,362 కోట్లు చార్జీలు చెల్లించారని తెలిపాయి. అన్ని ఖర్చులు కలిపి లెక్కిస్తే ఒక్కో యూనిట్ సగటు ఖర్చు రూ.5.64కు చేరిందని.. దీనితో దాదాపు రూ.3,110 కోట్లు అదనపు భారం పడిందని వెల్లడించాయి. బకాయిల విషయంలో వివాదం ఉందని, రూ.1,081 కోట్లే బకాయి ఉందని తెలంగాణ చెప్తుంటే.. ఛత్తీస్‌గఢ్ మాత్రం రూ.1,715 కోట్లు రావాల్సి ఉందని లెక్క చూపిస్తోందని పేర్కొన్నాయి.

సరిగా విద్యుత్ సరఫరా లేక..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఏనాడూ వెయ్యి మెగావాట్ల కరెంటు సాఫీగా రాలేదని.. దీనితో తెలంగాణ డిస్కంలు బహిరంగ మార్కెట్లో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇలా 2017 నుంచి 2022 వరకు రూ.2,083 కోట్లు అదనపు భారం పడిందని పేర్కొన్నాయి. ఇక ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌ను తెచ్చుకునేందుకు పవర్ గ్రిడ్ నుంచి వెయ్యి మెగావాట్ల కారిడార్ బుక్ చేయడం.. విద్యుత్ తెచ్చుకున్నా, లేకున్నా ఒప్పందం ప్రకారం చార్జీలు చెల్లించాల్సి రావడంతో రూ.638 కోట్లు భారం పడిందని తెలిపాయి. దీనికితోడు మరో 1000 మెగావాట్ల కారిడార్‌ను అడ్వాన్స్‌గా బుక్ చేయడం, దాన్ని అర్ధంతరంగా రద్దు చేసుకోవడం కూడా రాష్ట్ర విద్యుత్ సంస్థలకు నష్టం కలిగించిందని పేర్కొన్నాయి. పరిహారం కింద రూ.261 కోట్లు కట్టాలని పవర్ గ్రిడ్ సంస్థ రాష్ట్ర డిస్కంలకు నోటీసులు జారీ చేసిందని వివరించాయి. ఇక ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర ఈఆర్సీ ఇప్పటివరకు ఆమోదం తెలపలేదని.. ఈ లెక్కన ఛత్తీస్‌గఢ్‌కు కట్టిన వేల కోట్ల రూపాయలను అడ్డదారి చెల్లింపులుగానే పరిగణించాల్సి ఉంటుందని ఆరోపించాయి.

20న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి సన్మానం

- అదే రోజు రాష్ట్రానికి చెందిన మరో ఆరుగురు ఎంపీలకూ సత్కారం
- 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యునికి కూడా
- 'సెల్యూట్ తెలంగాణ' పేరిట సన్మాన కార్యక్రమం
- బేగంపేట నుంచి నాంపల్లి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్రమంత్రులు, మరో ఆరుగురు బీజేపీ ఎంపీల సన్మాన కార్యక్రమంలో స్వల్పమార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ఈ నెల 19న వారికి సన్మాన కార్యక్రమం జరపాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించిది. అయితే ఈ కార్యక్రమాన్ని 20 వతేదీ సాయంత్రానికి వాయిదా వేసినట్టుగా పార్టీ ముఖ్య నేతల సమాచారం. ఈ నెల 19న ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన నూతన కేబినెట్ తొలిసమావేశం జరగనుండడంతో ఈ మార్పు జరిగినట్టు తెలుస్తోంది. ఈ భేటీకి కేబినెట్ మంత్రి హోదాలో బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సన్మాన కార్యక్రమం 19వ తేదీకి బదులు 20వ తేదీకి వాయిదా వేసినట్టు పార్టీవర్గాల సమాచారం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కుమార్ 19న నగరానికి చేరుకుని కరీంనగర్‌కు వెళ్తారు. 20వ తేదీ సాయంత్రం తిరిగి ఆయన బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మిగతా ఎంపీలతో కలిసి ఓపెన్‌టాప్ జీప్‌లో ర్యాలీగా పార్టీ ఆఫీసుకు చేరుకుంటారని తెలుస్తోంది.

సన్మాన కార్యక్రమం ఇలా...

గురువారం (20న) సాయంత్రం 4గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి నాంపల్లిలోని పార్టీ కార్యాలయం వరకు కేంద్ర మంత్రులు, ఎంపీలను ర్యాలీగా తీసుకురానున్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద 'సెల్యూట్ తెలంగాణ' పేరిట సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు, అసెంబ్లీకి గెలిచిన 8 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ (యూపీ నుంచి ప్రాతినిధ్యం)ను ఘనంగా సన్మానించనున్నారు. బేగంపేట నుంచి ఓపెన్‌టాప్ జీపులలో వారిని కార్యాలయం వరకు వాహనాల కాన్వాయ్‌లో మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా తీసుకురానున్నారు.

మోదీకి ధన్యవాద సభ

ఇక రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలను గెలుచుకోవడం పట్ల.. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ ధన్యవాద సభ నిర్వహించనున్నారు. అనంతరం చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కాగా, కొద్దిరోజుల తర్వాత పార్టీ జాతీయనేతల ఆధ్వర్యంలో, రాష్ట్రంలో పెద్దఎత్తున మోదీ ధన్యవాద సభ నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పదాధికారుల, రాష్ట్ర కార్యదర్శుల, జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఎంపీలకు స్వాగత ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ, డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్, ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

21న అన్ని మండలాల్లో యోగా డే

కాసం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'సెల్యూట్ తెలంగాణ' ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 21న ఇంటర్నేషనల్ యోగా డేను పురస్కరించుకుని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో (2028) రాష్ట్రంలో 88 సీట్లలో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే ముందుకు సాగాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు కాసం తెలియజేశారు.

24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు!

సాక్షి, అమరావతి: ఈ నెల 24వ తేదీ నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. 22వ తేదీ తొలి మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. తొలుత ఈ నెల 19వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వ పెద్దలు అనుకున్నట్టు సమాచారం. అయితే మంత్రులందరూ పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించకపోవడంతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణను వాయిదా వేసినట్టు ప్రచారం నడుస్తోంది. 24వ తేదీ నుంచి ఐదురోజులు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

22న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరినీ ఆహ్వానించారు. వీరితోపాటు ఎంపీలు మినహా పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులను కూడా ఆహ్వానించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

పింఛన్ కోసం యాభై కిలోమీటర్లు!

రానూపోనూ వంద కిలోమీటర్లు, రూ.200 ఖర్చు

- అధికారుల తప్పిదంతో 'దేవునిపల్లి' ఊళ్ల ఆసరా లబ్ధిదారులకు అవస్థలు
- రెండు మున్సిపాలిటీల పరిధిలో దేవునిపల్లి గ్రామాలు
- కామారెడ్డి వాళ్లకు ఎల్లారెడ్డిలో, ఎల్లారెడ్డి వాళ్లకు కామారెడ్డిలో...
- ఏడాదిన్నరగా ఇబ్బంది పడుతున్న పండుటాకులు

సాక్షి, కామారెడ్డి: ఆసరా పింఛన్ కోసం పల్లె వెలుగు బస్సులో 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. రానూపోనూ వంద కిలోమీటర్లు. రాకపోకలకు బస్సు కిరాయిలు దాదాపు రూ.100 అవుతాయి. ఆకలైతే అన్నమో, అల్పాహారమో తింటే ఇంకో రూ.100 వరకు ఖర్చవుతుంది. 'దేవునిపల్లి' పేరుతో ఉన్న రెండు గ్రామాలకు చెందిన ఆసరా లబ్ధిదారుల అవస్థలివి. కామారెడ్డి జిల్లా కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో దేవునిపల్లి గ్రామం ఉండగా, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కూడా మరో దేవునిపల్లి గ్రామం ఉంది. కామారెడ్డి దేవునిపల్లి గ్రామానికి చెందిన ఆసరా లబ్ధిదారులు దాదాపు నలభై మంది పేర్లను ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామం జాబితాలో చేర్చారు. అలాగే ఎల్లారెడ్డి దేవునిపల్లి లబ్ధిదారుల పేర్లు కామారెడ్డి దేవునిపల్లి జాబితాలో ఉన్నాయి. దీంతో వీరంతా ప్రతి నెలా అక్కడి వాళ్లు ఇక్కడికి, ఇక్కడి వాళ్లు అక్కడికి వెళ్లి పింఛన్ తెచ్చుకోవాల్సి వస్తోంది.

ఏడాదిన్నరగా అవస్థలు

2022 అక్టోబర్ నెల నుంచి ప్రభుత్వం కొత్త ఆసరా పింఛన్లు మంజూరు చేసింది. అప్పుడు లబ్ధిదారుల జాబితాలు రూపొందించే క్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన పొరపాటో, మరేమోగానీ ఈ రెండు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పింఛన్ కోసం ఏడాదిన్నర కాలంగా అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి– ఎల్లారెడ్డి పట్టణాల మధ్య దూరం యాభై కిలోమీటర్లు. బస్సులో కనీసం గంటన్నర సమయం పడుతుంది. పోస్టాఫీసుకు వెళ్లి వరుసలో కూర్చోవాలి. అంతదూరం వెళ్లేసరికి స్థానికులు ముందుగానే చేరుకుని వరుసలో ముందుంటారు. వాళ్ల తరువాతే పింఛన్ తీసుకోవలసి వస్తుంది. ఒక్కోసారి సమయం సరిపోకపోవడంతో మరుసటి రోజు కూడా వెళ్లాల్సి వస్తోందని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి దేవునిపల్లికి చెందిన వడ్ల బాల్‌రాజు, వడ్ల లింగం, కోక బాపురావ్, దోమల రుక్మాజీ, మోత్కూరి సత్తవ్వ, నీరడి అశోక్‌తో పాటు మరికొందరు ఎల్లారెడ్డికి వెళ్లి పింఛన్ తెచ్చుకుంటున్నారు. ఎల్లారెడ్డి దేవునిపల్లికి చెందిన ఎరుకల దుర్గయ్య, కాదురి పర్వయ్య, నాగం గంగారాం, దుంపల సాలమయ్య, తుర్కపెద్ద షాదుల్లాతో పాటు మరికొందరు కామారెడ్డికి వెళ్లి పింఛన్ తెచ్చుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

ఆసరా లబ్ధిదారుల జాబితాలో జరిగిన ఈ పొరపాటును సరిచేయాల్సిన బాధ్యత యంత్రాంగంపైనే ఉంది. అవసరమైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపి లబ్ధిదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

నెలనెలా ఎల్లారెడ్డికి పోయి తెచ్చుకుంటున్నం...



నాకు యేడాదిన్నర కిందట పింఛన్ వచ్చిందని చెప్పిండ్రు. పోస్టాఫీసుకు పోతే ఇక్కడ కాదని, ఎల్లారెడ్డికి పోవాలన్నరు. అప్పటి సంది ఎల్లారెడ్డికి పోయి పింఛన్ తెచ్చుకుంటున్న. మస్తు మంది నాలెక్కనే పింఛన్ కోసం ఎల్లారెడ్డికి పోతున్నరు. మాకు ఇక్కడనే పింఛన్ ఇప్పిస్తే ఎంతన్న మంచిగుంటది. పోయిరాకడకు ఇబ్బంది పడుతున్నం.

–మోత్కూరి సత్తవ్వ, దేవునిపల్లి, కామారెడ్డి

పోయిరాకడకు మస్తు ఖర్సయితున్నయి..



పింఛన్ కోసం నెలనెలా కామారెడ్డికి పోవలసి వస్తోంది. పోయినపుడల్లా బస్సు కిరాయిలకు రూ. నూరు ఖర్చవుతున్నయి. ఆకలైతే ఏమన్న తింటే ఇంకో యాభయ్యో, వందో ఖర్చవుతున్నయి. పొద్దుగల్ల పోతే సాయంత్రం వరకు ఇంటికి చేరుతున్నం. ఒక్కోసారి పోయిన దినం పింఛన్ ఇయ్యకుంటే మళ్ల పోయిరావలసి వస్తుంది. ఎక్కడోళ్లకు అక్కడనే పింఛన్ ఇస్తే మంచిగుంటది.

–కాదూరి పర్వయ్య, దేవునిపల్లి, ఎల్లారెడ్డి

మెడికల్ సీట్లపై 'ఉత్తరాది' కన్ను!

ఆలిండియా కోటాతో ఇతర రాష్ట్రాల సీట్లలో చొరబాటు

- పలుచోట్ల 'నీట్'లో అక్రమాలకు ఇదే ప్రధాన కారణమా?
- కాలేజీలు తక్కువున్న రాష్ట్రాలకు 15 శాతం ఆలిండియా కోటా వరం
- దేశవ్యాప్తంగా సీట్లను పొందేందుకు అక్రమాలు
- అవకాశం ఉన్నా ఇతర రాష్ట్రాలకు వెళ్లని మన విద్యార్థులు



సాక్షి, హైదరాబాద్: దక్షిణాది సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మెడికల్ సీట్లు పొందేందుకు ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకోసం వారికి ఆలిండియా కోటా వరంగా మారింది. ఎంబీబీఎస్, ఎండీ సహా పలు మెడికల్ యూజీ, పీజీ కోర్సుల్లో వివిధ రాష్ట్రాల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా తక్కువ మెడికల్ కాలేజీలున్న ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోకి చొరబడుతున్నారు. దేశంలో ఇప్పుడు జరుగుతున్న 'నీట్' అక్రమాలకు ఇదీ ఒక కారణంగా చెబుతున్నారు. మంచి ర్యాంకు సాధిస్తే సొంత రాష్ట్రంలో సీట్లు లేకున్నా దేశంలో ఎక్కువ సీట్లున్న రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీటు వస్తుందన్న నమ్మకం వారికి కలిగింది. అందుకోసం వివిధ మార్గాల్లో పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు.

తెలంగాణ నుంచి ఆలిండియా కోటాకు 600 సీట్లు

నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందేందుకు కేంద్రం ఆలిండియా కోటాను ఏర్పాటు చేసింది. అందుకోసం 15 శాతం సీట్లను నేషనల్ పూల్ కింద కేటాయించింది. దానికోసం జాతీయస్థాయిలో ప్రత్యేక కౌన్సెలింగ్ జరుగుతుంది. దేశంలో ప్రభుత్వ కాలేజీల్లో 55 వేల ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 15 శాతం ఆలిండియా కోటా ప్రకారం 8,250 సీట్ల వరకు నేషనల్ పూల్ కిందకు వెళ్తాయి. తెలంగాణలో 2023–24లో 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, అందులో 27 ప్రభుత్వ కాలేజీల్లో 3,790 సీట్లున్నాయి. వీటిలో ఈసారి 300 సీట్ల మేరకు పెరుగుతాయి. అంటే ప్రభుత్వ కాలేజీల్లోనే 4 వేలకు పైగా సీట్లు అవుతాయి. అలాగే 29 ప్రైవేట్ కాలేజీల్లో 4,700 సీట్లున్నాయి. ప్రభుత్వ సీట్లలో ఆలిండియా కోటాలో 600 సీట్లు తెలంగాణ నుంచి భర్తీ అవుతాయి. వాటిలో ఏ రాష్ట్ర విద్యార్థులైనా సీటు సంపాదించుకోవచ్చు.

బిహార్‌లో అత్యంత తక్కువ సీట్లు

బిహార్ జనాభా 12 కోట్లపైనే. కానీ మెడికల్ కాలేజీలు 21 మాత్రమే. వాటిల్లో 2,765 సీట్లున్నాయి. అందులో ప్రభుత్వంలో 13 కాలేజీలే ఉండగా, వాటిల్లో 1,615 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. మన రాష్ట్ర జనాభా పట్టుమని నాలుగు కోట్లు కూడా లేదు. కానీ మూడింతలు పెద్దదైన బిహార్‌లో మన ప్రభుత్వ ఎంబీబీఎస్ సీట్లలో కేవలం 40 శాతమే ఉన్నాయి. ఇక ఉత్తరప్రదేశ్ జనాభా ఏకంగా 25 కోట్లు. అక్కడ 68 మెడికల్ కాలేజీలు ఉండగా, అందులో 35 ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 4,303 సీట్లు ఉన్నాయి. అంటే మనకంటే ఆరింతలు మించి జనాభా ఉంటే... ప్రభుత్వ సీట్లు మన రాష్ట్రంతో దాదాపు సమానంగా ఉన్నాయి. ఇక ఈ ఏడాది నీట్‌లో దేశవ్యాప్తంగా 13.16 లక్షల మంది అర్హత సాధించగా, అందులో బిహార్ నుంచి 74,743 మంది, యూపీ నుంచి 1.65 లక్షల మంది అర్హత సాధించారు. తెలంగాణ నుంచి 47,371 మంది అర్హత సాధించారు. ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ మంది అర్హత సాధిస్తే, సీట్లు మాత్రం తక్కువగా ఉన్నాయి. మన దగ్గర తక్కువ మంది అర్హత సాధించినా సీట్లు ఎక్కువగా ఉన్నాయి. అంతెందుకు తమిళనాడులోనూ ప్రభుత్వ కాలేజీల్లో 5,350 సీట్లున్నాయి. ఆ రాష్ట్రంలో 89,426 మంది అర్హత సాధించారు. దక్షిణాదిలో ఎక్కువ సీట్లుండగా, ఉత్తరాదిలోని రెండు ప్రధాన రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఉండటం గమనార్హం . దీంతో ఆలిండియా కోటాలో ఆయా రాష్ట్రాల విద్యార్థులు సీట్లు సాధించాలని ఆరాటపడుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ సాధించడమంటే అతి తక్కువ ఫీజుతో సీటును పొందడమే.

ఆలిండియా కోటాపై మన వాళ్ల అనాసక్తి

ఆలిండియా కోటా సీట్లపై తెలంగాణ విద్యార్థులు అంతగా ఆసక్తి చూపరని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు అంటున్నాయి. కేవలం దక్షిణాది రాష్ట్రాల్లోనే చదవడానికి, మరీ ముఖ్యంగా తెలంగాణలోని కాలేజీల్లో చదవడానికే ఇష్టపడుతుంటారు. ఎయిమ్స్ వంటి వాటిల్లో... అదీ కూడా ఢిల్లీ వంటి వాటిల్లో తప్ప ఇతర రాష్ట్రాలకు మన వాళ్లు వెళ్లడంలేదు. అందువల్ల మన రాష్ట్రంలో ఉండే ఆలిండియా కోటా సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులు కొట్టుకుపోతున్నారు. అందుకే మనతో పోటీ పడేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ఉత్తరాది విద్యార్థులు హైదరాబాద్ వంటి నగరాల్లో చదవడానికి ఆసక్తి చూపుతుంటారు. ఇక్కడ భాషా సమస్య ఉండదు. అన్ని రకాల ఆహార వ్యవహారాలు, ఆచారాలు ఇక్కడ ఉంటాయి. అందుకే ఆలిండియా కోటాలో సీట్లు పొందేందుకు ఆయా రాష్ట్రాల్లో కొందరు అక్రమాలు చేస్తుంటారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల బిహార్‌లో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కూడా అదే తరహాగా చెబుతుంటారు. అందుకోసం సాల్వర్ వంటి గ్యాంగ్‌లు పనిచేస్తుంటాయి. అందుకే ఆలిండియా కోటా వల్ల మనకు ఒరిగేదేమీ ఉండదని వైద్య విద్య నిపుణులు అంటున్నారు.

భూ పరిపాలనలో మార్పు తేవాలి

జీఓ 317ను వెంటనే రద్దు చేయాలి

- తహసీల్దార్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం
- రెవెన్యూ మంత్రి పొంగులేటిని కలిసి విజ్ఞప్తి



రెవెన్యూమంత్రి పొంగులేటిని కలిసి వినతిపత్రం ఇస్తున్న టీజీటీఏ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రైతులకు మరింతగా చేరువయ్యేలా భూపరిపాలనలో మార్పులు తేవాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే రైతు సమస్యలు తీరుతాయని, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కారం చేసే దిశలో మార్పులు చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అసోసియేషన్ అభిప్రాయపడింది. సోమవారం హైదరాబాద్‌లో టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రెవెన్యూ వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై చర్చించిన అనంతరం అసోసియేషన్ పలు తీర్మానాలు చేసింది. ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేసిన జీఓ 317ను వెంటనే రద్దు చేయాలని, సీపీఎస్ విధానానికి స్వస్తి పలికి పాత పింఛన్ విధానం అమల్లోకి తేవాలని, పూర్వ వీఆర్వో, వీఆర్ఏల న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని తీర్మానించింది. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ ప్రధాన కార్యదర్శులు రమేష్ పాక, అరేటి రాజేశ్వర్, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్‌చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రాధ, కోశాధికారి శ్రీనివాస్‌తోపాటు రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు దూర ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్లను మళ్లీ వారి పూర్వస్థానాలకు బదిలీ చేయాలని, అర్హులైన తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల(ఎస్‌జీడీసీ)లకు పదోన్నతులు కల్పించాలని, అద్దె వాహనాల చార్జీలు పెంచాలని, కొత్త మండలాల్లో కేడర్ స్ట్రెంగ్త్ మంజూరు చేయాలని, రెవెన్యూ వ్యవస్థలో వికేంద్రీకరణ చేపట్టాలని, రెవెన్యూ కోర్టులు, అప్పిలేట్ ట్రిబ్యునల్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో మంత్రి పొంగులేటిని కోరారు.


ఈసెట్ తొలి కౌన్సెలింగ్‌లో 8,982 సీట్ల భర్తీ

- ఈ ఏడాది ఈసెట్‌కు అర్హత సాధించిన 22,365 మంది విద్యార్థులు
- సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 21లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి
- సాంకేతిక విద్య కమిషనర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, ఫార్మా కోర్సుల్లో నేరుగా రెండో ఏడాదిలో ప్రవేశానికి నిర్వహించిన ఈసెట్ మొదటి దశ సీట్ల కేటాయింపు వివరాలను సాంకేతిక విద్య కమిషనర్ కార్యాలయం సోమవారం వెల్లడించింది. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి ఈసెట్ అర్హత పొందిన వారికి ఈ సీట్లను కేటాయించారు. ఇంజనీరింగ్‌లో 12,785 సీట్లు అందుబాటులో ఉండగా అందులో 7,203 (66.6%) సీట్లు కేటాయించారు. ఫార్మసీలో 1,180 సీట్లు అందుబాటులో ఉంటే, 31(2.6%) సీట్లు కేటాయించారు. ఈ ఏడాది ఈసెట్‌లో మొత్తం 22,365 మంది అర్హత సాధించారు. మొదటిదశ కౌన్సెలింగ్‌లో 12,703 మంది 5,43,171 ఆప్షన్లు ఇచ్చారు. ఇంజనీరింగ్‌లో 8,951 సీట్లు, ఫార్మసీలో 31 సీట్లు భర్తీ చేశారు. 3,773 మంది ఆప్షన్లు ఇవ్వలేదు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 529 మందికి సీట్లు దక్కాయి. సీట్లు పొందిన వారు ఈ నెల 21లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలన్నారు.

ఈనెల 20న ధర్నాలు చేపట్టండి

నీట్‌పై న్యాయ విచారణ కోసం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పిలుపు



సాక్షి, హైదరాబాద్: 'నీట్'పై న్యాయవిచారణ కోసం ఈ నెల 20న ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. నీట్ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకల మీద న్యాయ విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బిహార్, గుజరాత్‌లలో ప్రశ్నపత్రాలు లీకు చేశారనీ, పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరీక్షలు రాసిన 24 లక్షల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలు రాశారన్నారు. న్యాయ విచారణకు ఆదేశించాలని, విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 20న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

'సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలి'

సాక్షి, హైదరాబాద్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పింఛను పెంచాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోరింది. సోమవారం సింగరేణి గుర్తింపు ప్రాతినిధ్య సంఘం నాయకులతో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై, ప్రభుత్వం కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. కోలిండియా బొగ్గు ఉద్యోగులు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారని దీనిపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడేందుకు జాతీయ కేంద్ర సంఘం నేతలతో చర్చించాలని నిర్ణయించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తానని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని ఎన్ఐటీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్ష సన్నద్ధతపై ఉచిత వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: యూపీఎస్సీ 2025లో నిర్వహించే సివిల్స్ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఈ నెల 19 నుంచి పది రోజుల పాటు ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ గడియారం వివేకానంద సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష విధానం, సీఎస్‌లోని అన్ని సబ్జెక్టులు, ఆప్షనల్ ఎంపిక, న్యూస్ పేపర్ రీడింగ్, నోట్స్ ప్రిపరేషన్ విధానం వంటి అంశాలపై సీనియర్ అధ్యాపకులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9866079891 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గురుకుల బోర్డు కన్వీనర్ ఎవరో.. ఆ పోస్టు భర్తీ ఎప్పుడో?

- నాలుగు నెలలు కావస్తున్నా భర్తీ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- దీంతో ముందుకు సాగని అపాయింట్‌మెంట్ ఆర్డర్ల జారీ
- పెండింగ్‌లోనే గురుకుల ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల భర్తీ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ)లో కన్వీనర్ పోస్టు ఖాళీగా ఉంది. బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఉన్న మల్లయ్యబట్టు.. గురుకుల బోర్డు కన్వీనర్‌గా కొనసాగుతూ వచ్చారు. మార్చి మొదటివారంలో మల్లయ్యబట్టును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆ పోస్టు అప్పటి నుంచి ఖాళీగానే ఉంది. గురుకుల బోర్డు ద్వారా చేపట్టే ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అత్యంత కీలక పాత్ర కన్వీనర్‌దే ఉంటుంది. బోర్డు చైర్మన్ నిర్ణయాలు తీసుకున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో కన్వీనర్ ముఖ్య పాత్ర పోషిస్తారు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో గురుకుల బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలు ముందుకు కదలడం లేదు. ప్రధానంగా 15వందల మంది అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో దాదాపు 80శాతం మందికి నియామక పత్రాలు అందించినప్పటికీ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్పట్లో 15వందల మంది అభ్యర్థులకు నియామకపత్రాలు అందించలేదు. ప్రస్తుతం ఎన్నికలకోడ్ ముగిసినప్పటికీ ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అదేవిధంగా ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి పరీక్షను నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికీ ముందడుగు పడలేదు.

సీనియారిటీ ప్రాతిపదికన నియామకం

గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీని వేగవంతంగా చేపట్టాలనే ఉద్దేశంతో తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టీఆర్ఈఐఆర్‌బీలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీడబ్ల్యూఆర్ఈఐఎస్), మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్)తో పాటు విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఆర్ఈఐఎస్) కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. గురుకుల సొసైటీల్లో సీనియర్ కార్యదర్శి టీఆర్ఈఐ ఆర్‌బీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో సీనియర్ సభ్యుడు కన్వీనర్‌గా ఉంటారు.

స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్‌పై నిఘా పెట్టండి

యాజమాన్యాలకు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కళాశాలలు, పాఠశాలల నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కఠినచర్యలు తీసుకుంటున్నట్టు తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. డ్రగ్స్ దందాపై నిఘా పెట్టాలని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలను కోరారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలు (ఏడీసీఎస్) చురుగ్గా పనిచేయాలని, ఎలాంటి అనుమానాస్పద కదలికలు ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు లేదా యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతర్గత సమాచార సేకరణలో ఇబ్బందులు ఉంటే అవసరం మేరకు రిటైర్డ్ పోలీస్ అధికారులను ఉద్యోగులుగా నియమించుకోవాలని సూచించారు. డ్రగ్స్ వాడుతున్న విద్యార్థుల సమాచారం ఇస్తే, వారి భవిష్యత్ దృష్ట్యా విద్యార్థుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. అనుమానం ఉంటే విద్యార్థుల బ్యాగ్‌లు, లాకర్లను తనిఖీ చేయాలని సూచించారు. స్కూళ్లు, కాలేజీలతోపాటు సాధారణ ప్రజలు సైతం డ్రగ్స్ వాడకానికి సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో కంట్రోల్ రూంకి 8712671111 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని డైరెక్టర్ సందీప్ శాండిల్య కోరారు.

మాదాపూర్‌లో ఇద్దరి అరెస్టు

డ్రగ్స్ తీసుకుని పబ్‌లకు వెళుతున్న ఒక డీజేతో పాటు మరో వ్యక్తిని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించినట్టు టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో డ్రగ్ నిర్ధారణ పరీక్షల అనంతరం డ్రగ్స్ వాడినట్టు పాజిటివ్ వచ్చిన ఒక డీజేతో పాటు మరో వ్యక్తిపై మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 27 కింద అరెస్టు చేసినట్టు తెలిపారు.

పరస్పర బదిలీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

తప్పుడు ప్రచారం నమ్మొద్దు..

- తెలంగాణలో ఉన్న ఏపీ ఉద్యోగులు 1,369, ఏపీలో ఉన్న తెలంగాణ ఉద్యోగులు 1,808 మంది ఆప్షన్లు ఇచ్చారు
- కానీ గత ప్రభుత్వాలు తుది నిర్ణయం తీసుకోలేదు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి సమావేశాలు, చర్చలు జరగలేదు
- సీఎం కార్యాలయం స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ఉద్యోగులెవరూ రావడం లేదని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. గతంలో ఆప్షన్లు ఇచ్చిన వారు తెలంగాణకు వస్తున్నట్లు జరుగుతున్నదంతా అసత్య ప్రచారమేనని పేర్కొంది. తెలంగాణ, ఏపీ ఉద్యోగుల కేటాయింపునకు సంబంధించి గానీ, పరస్పర బదిలీలకు సంబంధించి గానీ తమ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. విభజన చట్టంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై కూడా ఎలాంటి సమావేశాలు, చర్చలు జరగలేదన్న విషయాన్ని ఉద్యోగ సంఘాలు గుర్తించాలని కోరింది. రాష్ట్రం ఏర్పడిన ఏడాది, రెండేళ్లలోనే ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చిన అంశాన్ని ప్రస్తావించింది. ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ జూన్ 2వ తేదీ నుంచి తెలంగాణకు మాత్రమే ప్రత్యేక రాజధానిగా ఏర్పడిందని, గతంలో ఏపీకి కేటాయించిన ఆఫీసులు, భవనాలతో పాటు విభాగాల వారీగా విభజన చట్టంలోని అన్ని అంశాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు పేర్కొంది.


ఆ సమస్య ఏళ్లుగా అలానే ఉంది

ఉద్యోగుల విభజన సమయంలో ఆప్షన్లు, పోస్టుల లభ్యత ఆధారంగా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు ఏపీకి, ఏపీ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు తెలంగాణకు కేటాయించిన సంగతి విదితమే. అయితే వైద్య అవసరాలు, భార్యాభర్తలు ఉద్యోగాల్లో ఉండటం, పిల్లల చదువులు, సొంత ఇల్లు ఉన్నాయనే కారణాలతో కొందరు ఉద్యోగులు, ఈ కేటాయింపుల్లో ఇబ్బంది పడిన ఉద్యోగులు మానవీయ కోణంలో తమ బాధను అర్థం చేసుకుని పరస్పర బదిలీలకు అనుమతించాలని కోరారని తెలిపింది. ఏపీకి వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ తెలంగాణకు కేటాయించిన 1,369 మంది ఉద్యోగులు విజ్ఞప్తి చేశారని వివరించింది. ప్రభుత్వం వారి వివరాలను సేకరించి, 2021 సెప్టెంబర్లో తమకు అభ్యంతరం లేదని సర్క్యులర్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. ఇదే తరహాలో ఏపీలో పనిచేస్తున్న 1,808 మంది ఉద్యోగులు తెలంగాణకు రావడానికి సమ్మతి తెలిపారని, ఆ మేరకు అప్పటి ఏపీ సీఎస్ సమీర్‌శర్మ వారి అభ్యర్థనను మానవీయ కోణంలో పరిశీలించాలని, ఆప్షన్లు ఇచ్చిన వారికి సంబంధించి పరస్పర బదిలీపై నిర్ణయం తీసుకోవాలని అప్పటి తెలంగాణ సీఎస్ సోమేష్‌కుమార్‌కు 2022 సెప్టెంబర్ 23న లేఖ రాశారని గుర్తు చేసింది. ఈ వ్యవహారం ఏళ్లుగా నానుతోందని, విభజన హామీలపై రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగినప్పుడల్లా ఈ అంశం ప్రస్తావనకు వచ్చినా రెండు ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోయినట్లు తెలిపింది. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవడంతో రెండు రాష్ట్రాల మధ్య ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న అంశాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీసింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

VERITAS SAINIK SCHOOL
Hyderabad - 502279, Ph: +91 9281451379
www.veritassainikschool.com
email: hrvsshyd@gmail.com
SCHOOL STAFF REQUIREMENT
Veritas Sainik School - Shamirpet, Hyderabad - 502 279
LOOKING FOR:
- Vice Principal (PGT with VP Experience)
- Teachers (Primary & and Middle School Teachers) - Nursery to 8th Class for all subjects (Mother Teachers, English, Telugu, hindi, EVS, Mathematics, Science, Social, Computer Science, Music, Dance, Art & Craft)
Eligibility: NTT / Montessori / D.Ed./ B.Ed.,/ TPT / HPT , TET/ CTET Qualified; CBSE Exeprienced (Sainik School Experience Preferred)
Send your CV & Profile : hrvsshyd@gmail.com, +91 9281451379
Walk in Person @
VERITAS SAINIK SCHOOL, Near RVM Medical College, Mamidipally, Vantimamidi, Laxmakkapally, HYDERABAD - 502 279





ప్రారంభం అనేది ఒక పనికి అతి ముఖ్యమైనది.
– ప్లేటో

సాక్షి
మంగళవారం, 18 జూన్ 2024

ఇక... జమ్మూ వంతు!

జమ్మూలో వరుస తీవ్రవాద దాడులు కలవరం సృష్టించగా, ఎట్టకేలకు సర్కార్ రంగంలోకి దిగింది. కేంద్ర హోమ్ మంత్రి సారథ్యంలో ఆదివారం ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అందులో తొలి అడుగు. పాక్ నుంచి తీవ్రవాదుల చొరబాటు యత్నాలను నిర్వీర్యం చేసేందుకు భద్రతా దళాల సంఖ్యను పెంచడం సరైన దిశలో సరైన చర్యగా చెప్పుకోవాలి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రాజౌరీ, పూంఛ్, రియాసీ, కథువా, ఉధమ్‌పూర్, దోడా జిల్లాలు ఆరింటిలో ఆరు ప్రధాన తీవ్రవాద దాడులు జరిగాయి. సైనిక వర్గాల కథనం ప్రకారం విదేశీ తీవ్రవాదులు నలుగురైదుగురు చొప్పున బృందాలుగా ఏర్పడుతున్నారట. అలాంటి బృందాలు కనీసం అయిదు పీర్ పంజల్, చీనాబ్ ప్రాంతాల్లో పని చేస్తున్నాయి. జమ్మూలోని ఈ కొత్త తరహా తీవ్రవాద ధోరణి కశ్మీర్‌కూ వ్యాపించే ప్రమాదం పొంచివుంది. అందుకే, జమ్మూ కశ్మీర్‌పై స్వయంగా ప్రధాని గత వారం సమీక్షా సమావేశం నిర్వహిస్తే, తర్వాత మూడు రోజులకే హోమ్ మంత్రి సైతం సమీక్ష చేశారు. పరిస్థితి తీవ్రతకు ఇది దర్పణం.

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న సమయంలోనే తాజా దాడులు యాదృచ్ఛికం అనుకోలేం. జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు సజావుగా లేవనీ, 370వ అధికరణం రద్దు తర్వాత శాంతి నెలకొనలేదనీ వీలైనప్పుడల్లా ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదులు పని చేస్తూనే ఉన్నారు. తాజా తీవ్రవాద దాడులు అందులో భాగమే. ఇటీవల కొన్నేళ్ళుగా కశ్మీరీ తీవ్రవాదులు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలను అనుసరిస్తున్నారు. 2022లో నిర్దేశిత వ్యక్తులే లక్ష్యంగా హత్యలు చేసే పద్ధతిని అనుసరిస్తే, గత ఏడాది నుంచి సాంప్రదాయిక విన్యాసాలు సాగిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల పైచిలుకుగా ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో అలజడులు సృష్టించసాగారు. గతంలో కశ్మీర్ ప్రాంతంపై పంజా విసిరిన ముష్కర మూకలు ఇప్పుడు ప్రశాంతమైన జమ్ము ప్రాంతంపై గురి పెట్టాయి. దాంతో, భద్రతా దళాలు తమ వ్యూహాలను మార్చుకోక తప్పని పరిస్థితి.

గతాన్ని సింహావలోకనం చేసుకుంటే, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370వ అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత దృష్టి అంతా కశ్మీర్‌పై నిలిచింది. అప్పటికి పదిహేనేళ్ళుగా జమ్మూలోని అధిక భాగంలో నిస్సైనికీకరణ సాగింది. ప్రశాంతత నెలకొంది. ఫలితంగా, విదేశీ తీవ్రవాదులు ఈసారి జమ్మూని తమకు వాటంగా చేసుకున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రధానంగా అడవులు ఈ విదేశీ చొరబాటుదారులకు కలిసొచ్చాయి. రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లోని దట్టమైన అడవులు, సంక్లిష్టమైన కొండలు తీవ్రవాదుల కొత్త కేంద్రాలయ్యాయి. అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకొని, గుహల్లో దాక్కొని వారు తమ ఉనికి, బలం పెంచుకున్నారు. తాజాగా నాలుగు రోజుల్లో నాలుగు చోట్ల దాడులు జరగడం, అందులోనూ రియాసీ జిల్లాలో జూన్ 9న యాత్రికుల బస్సుపై అమానుష దాడితో ఒక్కసారిగా దేశమంతా ఉలిక్కిపడింది. ప్రభుత్వం హడావిడిగా క్షేత్రస్థాయి పరిస్థితులపై మళ్ళీ దృష్టి పెట్టింది.

2021 జనవరి నుంచే వాస్తవాధీన రేఖ వెంట జమ్మూలోకి చొరబడడానికి విదేశీ తీవ్రవాద బృందాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అప్పట్లో జమ్మూలోని అఖ్నూర్‌లో మన సైన్యం ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టి, ముగ్గురిని హతమార్చింది. అదే ఏడాది జూన్‌లో భారత వైమానిక దళ స్థావరంపై డ్రోన్ దాడి ఘటనల నుంచి జమ్మూ ప్రాంత సరిహద్దు జిల్లాల్లో తీవ్రవాద కార్యకలాపాలు పెరిగాయి. 2021 నుంచి ఇప్పటి వరకు ఒక్క జమ్మూ ప్రాంతంలోనే 29 తీవ్రవాద హింసాత్మక ఘటనలు జరిగాయి. జమ్మూ కశ్మీర్‌లో దాదాపు 100 మందికి పైగా తీవ్రవాదులు క్రియాశీలంగా ఉన్నారట. వారిలో తీవ్రవాద బాట పట్టిన స్థానికుల కన్నా విదేశీ తీవ్రవాదులే ఎక్కువ. ఇది తీవ్రమైన అంశం. ఒకప్పటి భారీ వ్యవస్థీకృత హింసాకాండ నుంచి ఇప్పుడు పొరుగునున్న శత్రువుల అండతో పరోక్ష యుద్ధంగా మారిన ఈ బెడదపై సత్వరమే కార్యాచరణ జరగాలి.

నిజం చెప్పాలంటే, జమ్మూ కశ్మీర్, మణిపుర్‌లు రెండూ ఇప్పటికీ అట్టుడుకుతూనే ఉన్నాయి. మోదీ 3.0 సర్కార్ ముందున్న ప్రధానమైన సవాళ్ళు ఇవి. ప్రభుత్వ పెద్దలు వీటిని అశ్రద్ధ చేయడానికి వీలు లేదు. అందులోనూ ఈ జూన్ 29 నుంచి అమరనాథ్ యాత్ర మొదలు కానున్న వేళ జమ్మూలో భద్రత కీలకం. గతంలో సాంప్రదాయికంగా తీవ్రవాదులకు పెట్టనికోట అయిన కశ్మీర్ లోయలో ఆ పరిస్థితిని మార్చడంలో భద్రతాదళాలు విజయం సాధించాయి. నిరుడు ఏకంగా 2.11 కోట్ల మంది సందర్శకులతో కశ్మీర్‌లో పర్యాటకం తిరిగి పుంజుకొంది. మొన్న లోక్‌సభ ఎన్నికల్లోనూ జనం ఉత్సాహంగా పాల్గొన్నారు. గత 35 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా మొత్తం కేంద్రపాలిత ప్రాంతంలో 58.46 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. తీవ్రవాదం పీచమణిచి సాధించిన అలాంటి విజయాలు జమ్మూలోనూ పునరావృతం కావాలని హోమ్ మంత్రి ఆదేశిస్తున్నది అందుకే.

తీవ్రవాదులు ప్రధానంగా అంతర్జాల ఆధారిత వ్యవస్థల ఆధారంగా సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. విదేశీ సిమ్ కార్డులతో, పాకిస్తానీ సర్వీస్ ప్రొవైడర్లతో సాగుతున్న ఈ వ్యవహారానికి సాంకేతికంగా అడ్డుకట్ట వేయాలి. ప్రజలు, పోలీసులు, స్థానిక రక్షణ దళ సభ్యులతో సహా అందరినీ కలుపుకొనిపోతూ దేశంలో చేరిన ఈ కలుపు మొక్కల్ని ఏరిపారేయాలి. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించాలని చూస్తున్న ఈ దుష్టశక్తుల పాచిక పారనివ్వరాదు. ప్రభుత్వం వెనక్కి తగ్గక సెప్టెంబర్‌లో జరగాల్సిన జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను నిరాటంకంగా జరిపించాలి. పాక్ పాలకులు పైకి మెత్తగా మాట్లాడుతున్నా, అక్కడి సైన్యాధ్యక్షుడు, సైనిక గూఢచారి వ్యవస్థ ఐఎస్ఐ చేసే కుటిల యత్నాలకు సర్వదా కాచుకొనే ఉండాలి. అప్రమత్తత, సత్వర సన్నద్ధతే దేశానికి శ్రీరామరక్ష.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ద్వాదశి పూర్తి (24 గంటలు)
నక్షత్రం: స్వాతి ప.2.42 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.8.44 నుండి 10.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.37 వరకు
అమృతఘడియలు: లేవు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

విత్తనాలకు సుస్థిర విధానం అవసరం

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

మన దేశంలో వరిలో దాదాపు 3 లక్షల దేశీ రకం విత్తనాలు ఉండేవని వ్యవసాయ చరిత్ర చెబుతున్నది. అనేక పంటలకు వివిధ రకాల విత్తనాలను వృద్ధి చేసుకున్న ఘనత భారత సాంప్రదాయ వ్యవసాయానిది. హరిత విప్లవం ఒక విధానంగా వచ్చిన గత 60 ఏళ్లలో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలను ప్రవేశ పెట్టారు. ఏకపంట పద్ధతికి ప్రోత్సాహం రావడంతో, పంటల వైవిధ్యం తగ్గింది. రసాయనాలు వాడి తయారు చేసిన విత్తనాలు రసాయన వ్యవసాయంలోనే పని చేస్తాయి. కొన్ని కంపెనీల ఆధిపత్యంలో మార్కెట్లు ఉండటం వ్యవసాయ సుస్థిరతకు శ్రేయస్కరం కాదు. రైతులకు విత్తనాల మీద స్వావలంబన కొనసాగించే వ్యవస్థ అవసరం. ప్రభుత్వాలు సుస్థిర, గుత్తాధిపత్య రహిత విత్తన వ్యవస్థకు ప్రోత్సాహం అందించే విధానాలు రూపొందించాలి.

ఆహార ఉత్పత్తి మొదలయ్యేది విత్తనాల నుంచే. దాదాపు ప్రతి పంటకు అనేక రకాల విత్తనాలు ఉన్నాయి. స్థానికంగా లభ్యమయ్యే ప్రత్యేక పర్యావరణ, వాతావరణ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి పంటలో రైతులు వందల ఏండ్లుగా విత్తనాలను రూపొందిస్తున్నారు. మన దేశంలో వరిలో దాదాపు 3 లక్షల దేశీ రకం విత్తనాలు ఉండేవని వ్యవసాయ చరిత్ర చెబుతున్నది. వంకాయలో 3 వేలతో సహా అనేక పంటలకు వివిధ రకాల విత్తనాలను వందల యేండ్ల నుంచి వృద్ధి చేసుకున్న ఘనత భారత సాంప్రదాయ వ్యవసాయానిది. దేశవ్యాప్తంగా విత్తనాల చుట్టూ అనేక సంప్రదాయాలు, పండుగలు, గ్రామీణ కార్యక్రమాలు ఉండేవి. గ్రామీణులు, రైతులు, ప్రత్యేకంగా మహిళలు విత్తనాలను గుర్తించటంలో, దాచటంలో, శుద్ధి చేయడంలో గణనీయ జ్ఞానం, కౌశల్యం సంపాదించారు. 35,000 సంవత్సరాలకు పైగా, తరతరాలుగా రైతాంగం పరిశోధనల ఫలితంగా అనేక రకాల విత్తనాలు వృద్ధి అయినాయి. ఈ జానపద విత్తన రకాలు మానవాళికి సుమారు 2,500 పంటలు, 14 పశువుల రకాలకు సంబంధించి ఆశ్చర్యపరిచే స్థాయిలో 11.4 లక్షల రకాల పంటలు, 8,800 పశువుల జాతులను అందించాయి.

హరిత విప్లవం ఒక విధానంగా వచ్చిన గత 60 ఏళ్లలో అనేక రకాల హైబ్రిడ్ విత్తనాలు, ప్రధానంగా వరి, గోధుమలు, మక్కల (మొక్కజొన్న)లో ప్రవేశపెట్టారు. 1968–2019 మధ్య వివిధ సంస్థల ద్వారా 1200 వరి హైబ్రిడ్లు ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. ఏకపంట పద్ధతికి ప్రోత్సాహం రావడంతో, పంటల వైవిధ్యం క్రమంగా తగ్గుతూ వచ్చి, ప్రమాదకర స్థాయికి చేరింది. హైబ్రిడ్ విత్తనాలను ప్రతి 3, 4 ఏళ్లకు మార్చాల్సి వస్తుంది. ఆధునిక వ్యవసాయం ల్యాబ్ విత్తనాలను ప్రవేశపెట్టి, సంప్రదాయ విత్తనాలను కనుమరుగు చేస్తున్నది. విత్తనాలు కంపెనీల గుప్పిట్లోకి పోయాయి. విత్తనాలు పోయినాయి అంటే మొత్తం ఆహార వ్యవస్థ ఈ కంపెనీల చేతులలోకి వెళ్లిపోవచ్చు. అట్లని కంపెనీల అధీనంలో, ఒక గొప్ప విత్తన వ్యవస్థ వచ్చిందా అంటే అదీ లేదు. రసాయనాలు వాడి తయారు చేసిన విత్తనాలు రసాయన వ్యవసాయంలోనే పని చేస్తాయి. సహజంగా విత్తనాలలో సహజీవన సూక్ష్మ జీవులు ఉంటాయి. రసాయన చర్యకు లోనైన ఆధునిక విత్తనాలలో ఈ సూక్ష్మ జీవులు ఉండవు. జీవ ప్రక్రియలో ముఖ్య ఘట్టం విత్తనాలు. ఆ విత్తనాలు విషానికి, విష వ్యాపార సంస్కృతికి బలవుతున్నాయి.

ప్రైవేటు కంపెనీల విత్తన వ్యాపారం మన దేశంలో 2002 నుంచి పుంజుకుని, ప్రతి యేడు పెరుగుతున్నది. దాదాపు రూ.25 వేల కోట్ల వార్షిక టర్నోవర్‌కు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా 75 శాతం విత్తన వ్యాపారం కేవలం మూడు బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యంలో ఉన్నది. అమెరికాలోనే పారిశ్రామిక వ్యవసాయానికి అనుగుణమైన విత్తన వ్యవస్థ పుట్టుకొచ్చింది. అమెరికా ప్రభుత్వం ఎల్లప్పుడూ ఈ



కంపెనీలకు మద్దతుగా తన వాణిజ్య, విదేశాంగ విధానం అమలు చేస్తుంది. మార్కెట్లో పోటీ తగ్గి కొన్ని కంపెనీల ఆధిపత్యంలో మార్కెట్లు ఉండడం వ్యవసాయ సుస్థిరతకు శ్రేయస్కరం కాదు. బీటీ పత్తి మినహా వేరే రకం పత్తి మార్కెట్లో లేకుండా ఈ ప్రైవేటు కంపెనీలు సిండికేట్ అయినాయి. ప్రభుత్వ సంస్థలలో విత్తన పరిశోధనలు జరగకుండా ప్రైవేటు విత్తన వ్యాపారం అడ్డు పడుతున్నది.

అధిక దిగుబడి వంగడాలు, హైబ్రిడ్ విత్తనాలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో 1968లో కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం తెచ్చింది. ఈ చట్టం ప్రాథమిక లక్ష్యం అప్పట్లో ప్రభుత్వ పరిశోధన సంస్థలు విత్తనాలను విడుదల చేసే పద్ధతిని నిర్దేశించిడం. తరువాత 2002లో ప్రైవేట్ కంపెనీలకు విత్తనాలను ప్రవేశపెట్టే అవకాశం ఇచ్చినాక విత్తన చట్టం సవరించాలని భావించారు. 2003 నుంచి కొత్త విత్తన చట్టాన్ని రైతాంగం కోరుతున్నా కూడా కేంద్ర ప్రభుత్వం చేయలేదు. కంపెనీలకు అనుకూల ముసాయిదాలతో 20 యేండ్ల కాలం దాటింది. కొన్ని రాష్ట్రాలు తమ పరిధిలో చట్టం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్నది. వ్యవసాయానికి విత్తన ఆవశ్యకత ఉన్నందున విత్తనాలను నిత్యావసర చట్టంలో చేర్చిన ప్రభుత్వం ప్రైవేటు విత్తన కంపెనీలకు ఆదాయ పన్ను చట్టం నుంచి మినహాయింపు ఇచ్చింది. విత్తన ధరల మీద నియంత్రణ లేదు. ఉత్తుత్తగా ప్రతి సంవత్సరం పత్తి విత్తనాల ధర నిర్ణయిస్తారు. కొరత ఉందని రైతులను భయపెట్టి బ్లాకు మార్కెట్లో ధరను పదింతలు పెంచుతారు. రైతు మీద భారం మోపుతారు. ఎవరైనా రైతు సొంతంగా విత్తనాలు చేసి అమ్మితే వారి మీద 420 కేసులు పెట్టే శాసన వ్యవస్థ, నాణ్యత లేని విత్తనాల వల్ల వేల ఎకరాల పంట నష్టపోయినా ఆయా కంపెనీలకు తాఖీదులు కూడా ఇచ్చే ధైర్యం చేయలేదు.

జన్యుమార్పిడి విత్తనాల వల్ల శ్రేష్ఠమైన సంప్రదాయ విత్తనాలు కనుమరుగు అవుతుంటే, కలుషితం అవుతుంటే పట్టించుకుని సంరక్షించే విత్తన సంస్థ లేకపోవడం దురదృష్టకరం. ప్రత్తి విత్తనాలలో శ్రేష్ఠమైన, దేశీ విత్తనాలు ఇప్పుడు దొరికే పరిస్థితి లేదు. అనేక పంటలలోనూ ఇదే పరిస్థితి. పసుపు, చెరుకు, గోధుమలు, జొన్నలు, కూరగాయలు, మక్కలలో దేశీ రకాలు కనుమరుగు అవుతున్నాయి. ప్రైవేటు కంపెనీలు అమ్ముతున్న కంకర లాంటి మక్క గింజల పంటను ఫ్యాక్టరీకి పంపించి, ప్రాసెస్ చేసి, పశువుల, కోళ్ళ దాణాగా మాత్రమే ఉపయోగించేందుకు వృద్ధి చేశారు. ఇప్పటి మక్క కంకులు నేరుగా ఇళ్లల్లో కాల్చుకుని, ఉడకపెట్టుకుని, ఒలుచుకుని తినే విధంగా లేవు. అటువంటి మక్క గింజలనే పక్కాగా వాడమనీ, తమ కంపెనీల దగ్గర కొనుక్కోమనీ వివిధ దేశాల మీద ఒత్తిడి తేవడం అమెరికా పని. ఇటీవల అటువంటి జన్యుమార్పిడి మక్కలు మాకు వద్దని మెక్సికో ప్రభుత్వం అమెరికా నుంచి మక్కల దిగుమతిని ఆపేసింది. ముక్కలకు మక్కాగా ప్రసిద్ధి చెందిన మెక్సికో తమ గింజలను, తమ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి అమెరికాను ధిక్కరించింది. వరి గింజలకు, వైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన మన దేశం మాత్రం విత్తన వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు ఒక్కడుగు కూడా వేయడం లేదు.

రైతులే కేంద్రంగా విత్తన వ్యవస్థను పునరుద్ధరించే పనిని అనేక స్వచ్ఛంద సంస్థలు దేశ వ్యాప్తంగా చేస్తున్నాయి. సహకార విత్తన బ్యాంకులను (కమ్యూనిటీ సీడ్ బ్యాంక్స్) ఏర్పాటు చేసి రైతులు, ప్రత్యేకంగా మహిళలను ప్రోత్సహిస్తున్నాయి. గత పదేళ్ళలో వరిలో, గోధుమలలో, చిరు ధాన్యాలలో, వివిధ కూరగాయలు, పండ్లలో తిరిగి దేశీ విత్తనాలను ఉపయోగించే వాతావరణం కల్పించటంలో అనేక సంస్థలు, వ్యక్తుల కృషి ఉన్నది. మన దేశంలో ఈ రెండు వ్యవస్థల (రైతు కేంద్రీకృత విత్తన వ్యవస్థ, లాభాపేక్షతో కొన్ని జన్యుమార్పిడి విత్తనాలను గుప్పిట్లో పెట్టుకున్న ప్రైవేటు వ్యవస్థ) మధ్య కనపడని సంఘర్షణ ఏర్పడింది. కానీ ప్రభుత్వాలు మాత్రం ప్రైవేటు విత్తన వ్యవస్థ వైపు మొగ్గు చూపుతూ, సబ్సిడీలు అందిస్తూ గుత్తాధిపత్యానికి ఊతం అందిస్తున్నాయి.

రైతులకు విత్తనాల మీద స్వావలంబన కొనసాగించే వ్యవస్థ అవసరం. వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నా, రసాయన రహిత పౌష్టిక ఆహారం అందాలన్నా, అందరికి కూడు, బట్ట అందాలన్నా విత్తన వ్యవస్థ లాభాపేక్ష లేని వ్యవస్థగా రూపుదిద్దాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుస్థిర, గుత్తాధిపత్య రహిత విత్తన వ్యవస్థకు ప్రోత్సాహం అందించే విధానాలు రూపొందించాలి. గాలి, నేల, నీరు వంటివి సహజ పర్యావరణ వనరులు. విత్తనాలు కూడా సహజ వనరు. ఏ ఒక్కరి సొంతమో కారాదు.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అభినందనలు



దక్షిణాఫ్రికాకు అధ్యక్షులుగా తిరిగి ఎన్నికైన శ్రీమాన్ సిరిల్ రాంఫోసాకు శుభాభినందనలు. భారత– దక్షిణాఫ్రికా వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు నేను మీతో పనిచేయాలని ఎదురుచూస్తున్నాను.
– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

తమలోనే భరిస్తారు



అంతర్ముఖులు బాధను వెల్లడించలేరు. వాళ్లు బలహీనులు కాదు. కానీ మీ మీద తమ బరువును మోపాలనుకోరు. అందుకే సాయం అడగటానికి బదులుగా ఒంటరిగా భరిస్తారు. నన్ను నమ్మండి. అదేం సమస్య కాదు. దాన్ని ఎదుర్కోవడం ఎలాగో వాళ్లు తెలుసుకున్నారు. ఒంటరిగానే!
– కరుణ్ పాల్, మైండ్‌సెట్ కోచ్

అసమర్థతే కారణం



దేశవ్యాప్తంగా ఆగని ఈ రైలు ప్రమాదాలకు పూర్తిగా రైల్వేశాఖ నిర్లక్ష్యం, దాని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అసమర్థత కారణం. లోటుపాట్లను సరిదిద్దడంలో ఘోరంగా విఫలమైన మంత్రి వేలమంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారు. ఏది అత్యుత్తమంగా ప్రధాని చేయగలరో అదే చేస్తున్నారు... దేశాన్ని పట్టాలు తప్పించడం!
– సాయోనీ ఘోష్, నటి, తృణమూల్ ఎంపీ

ఆగితేనే నీటు!



ఉత్తరప్రదేశ్‌లో 67 వైద్య కళాశాలలు ఉన్నాయి. పదివేల ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఈ కళాశాలలకు ప్రవేశాలు నీట్ ద్వారా జరుగుతున్నాయి. దీని సిలబస్ సీబీఎస్‌ఈ. రాష్ట్ర బోర్డ్ నుంచి కేవలం కొంతమందే వైద్య కళాశాలలకు ఎంపికవుతున్నారు. హిందీ మీడియం కూడా పెద్ద సమస్య. నీట్ ఆగిపోతే, యూపీ బోర్డ్ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.
– దిలీప్ మండల్, సంపాదకుడు

ఈద్ ముబారక్



ఈద్ ముబారక్. బోల్డంత ప్రేమ. బిర్యానీ, కోర్మా, కబాబులను నోరారా తినండి. మన శాకాహార మిత్రులకు ఎలాగూ సేవయీ, దహీ పకోడీ ఉండనే ఉన్నాయి. బక్రీద్ రోజు మాత్రమే తమ గుహల్లోంచి బయటికి వచ్చి, తమ ఆహార అలవాట్ల పట్ల అభద్రతకు లోనయ్యేవారిని పట్టించుకోవద్దు. ఆహార అలవాట్లు ఒకరిని తక్కువ గానో, ఎక్కువగానో చేయవు. అవి ఎంపికలు, వాటిని గౌరవించాలి.
– సయేమా, రేడియో జాకీ

చెదరని బంధం



సామాజిక మాధ్యమాలు తప్ప ఇంకేమీ తెలియని వ్యాకుల యువతకు ఒక సూచన: బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య సంబంధం చెదరలేనిది, విడిపోలేనిది. దాని అంతర్గత వ్యవహారాల్లో భాగం కాని చాలామంది అవగాహనకు మించినది. అది కాలపరీక్షకు నిలిచినది. ఎందుకంటే ఒకదాని కడుపులోంచి ఇంకోటి జన్మించింది. కాబట్టి పతాక శీర్షికల మీద సమయం వృథా చేసుకోవద్దు.
– సునందా వశిష్ఠ్, కాలమిస్ట్

వ్యక్తిగతం బాగుండొద్దా?



నేననుకోవడం... చాలా మంది, ముఖ్యంగా ఖరీదైన మ్యాగజైన్లను చదివేవాళ్లు, పెద్ద టీవీలను చూసే జనాల్లో ఇది విస్తృతాంగీకారం పొందిన విషయంగా మారిపోయింది. తమ వ్యక్తిగత జీవితం మామూలుగా ఉన్నప్పటికీ, వృత్తిపరమైన జీవితం మిరుమిట్లు గొలిపినట్లు ఉండటాన్ని మేలైనదిగా వీళ్లు భావిస్తున్నారు; రివర్సులో మాత్రం కాదు.
– రాబ్ హెండెర్‌సన్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ఆ ఖాళీలు జత చేయాలి!

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీచర్ల బదిలీలు–ప్రమోషన్స్ ప్రక్రియ వల్ల కొత్తగా ఏర్పడే 9 వేల ఉపాధ్యాయ ఖాళీలను ప్రస్తుతం ఉన్న డీఎస్సీ నోటిఫికేషన్‌కు జత చేసి లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలి. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే మెగా డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున డీఎస్సీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. గత ప్రభుత్వం 5,089 టీచర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌కు కొత్త ప్రభుత్వం మరో 6 వేల టీచర్ పోస్టులు మాత్రమే జత చేసి 11,062 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. గత 8 సంవత్సరాలుగా టీచర్ పోస్టులు భర్తీ కాలేదు. 33 జిల్లాల వారీగా చూస్తే ఇప్పుడు వచ్చిన డీఎస్సీలో స్వల్ప సంఖ్యలోనే పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అయితే సింగిల్ డిజిట్ లోనే ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులు కూడా చాలా జిల్లాల్లో తక్కువ సంఖ్యలోనే ఇచ్చారు. అందువల్ల ప్రభుత్వం ఇప్పుడు చేపట్టిన టీచర్ల బదిలీలు– ప్రమోషన్స్ ప్రక్రియ వల్ల కొత్తగా ఏర్పడనున్న 9 వేల కొత్త పోస్టులనూ ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌కు జత చేయాలి. తద్వారా లక్షలాది అభ్యర్థులకు న్యాయం చేయాలి. అప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద విద్యార్థులకు కూడా టీచర్లు అందుబాటులో ఉంటారు. ప్రభుత్వ స్కూల్స్ కూడా బలోపేతం అవుతాయి. టీచర్ల బదిలీలు–ప్రమోషన్స్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత హేతుబద్ధీకరణ అంటూ టీచర్ పోస్టులు కుదించకుండా మొత్తం ఖాళీలు ప్రస్తుత డీఎస్సీకి కలిపి అందరకీ న్యాయం చేయాలి. అలాగే డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలి.

– రావుల రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు

వీసీల నియామకాల్లో ప్రమాణాలు పాటించాలి!

విశ్వవిద్యాలయాలు సమాజాన్ని నడిపించే మేధావులను తయారుచేసే కేంద్రాల వంటివి. చరిత్రను మలుపు తిప్పే ఉద్యమ కేంద్రాలుగానూ అనేకసార్లు నిరూపించుకున్నాయి. ముఖ్యంగా మన తెలంగాణ చరిత్రలో యూనివర్సిటీలు నిర్వహించిన పాత్ర అమోఘం. ఉస్మానియా, కాకతీయ వంటి యూనివర్సిటీలు మలి తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగినది. తెలంగాణ వ్యాప్తంగా దాదాపుగా 1200 మంది విద్యార్థుల ఆత్మ బలిదానాల అనంతరం తెలంగాణ రాష్ట్రం సాకారం అయింది. అయితే ఇదంతా సాకారం చేయటానికి తమ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టిన విశ్వ విద్యాలయాల పరిస్థితి ఇప్పుడు అత్యంత దయనీయంగా మారుతోంది.

2014లో స్వరాష్ట్రం వచ్చిన నాటి నుండి గడిచిన పదేండ్లలో విశ్వ విద్యాలయాలపై ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. యూనివర్సిటీల పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న విధంగా ఉంది. మౌలిక సదుపాయాలు కొత్తగా కల్పించినవి ఏమీ లేదు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలు లేక యూనివర్సిటీల మనుగడ ప్రశ్నార్థకమయ్యింది. అటెండర్ పోస్ట్ మొదలుకొని అధ్యాపక పోస్టు వరకూ ఎన్నో పోస్టులు ఖాళీ అయ్యాయి. అయినా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. దీనికి తోడు చాలా యూనివర్సిటీలకు పెద్ద దిక్కు అయిన వైస్ ఛాన్స్‌లర్లు (వీసీలు) లేరు. ఇన్‌చార్జీలతోనే కాలం గడుపుతూ వచ్చింది గత ప్రభుత్వం.



ఈ నేపథ్యంలో 'మార్పు కావాలి –కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన అనుముల రేవంత్ రెడ్డి సర్కారు సైతం విశ్వవిద్యాలయాలను గాలికొదిలేసినట్లుగా కనిపిస్తోంది. వీసీల నియామకాలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని చెబుతున్నా అది సాకారం అయ్యేలా కనిపించడం లేదు. ఒకరిద్దరు వీసీ పదవితో పాటూ మరో ఉన్నత పదవినీ నిర్వహించడం చర్చనీయాంశం అయ్యింది.


విద్యారంగంలో నిష్ణాతులుగా ఉండి, ప్రొఫెసర్‌గా పదేళ్ళ అనుభవం ఉండి, మంచి పాలనా దక్షులై ఉన్నవారే వీసీ పదవికి అర్హులు. కానీ ఈ ప్రమాణాలతో సంబంధం లేకుండా మంత్రులూ, కాంట్రాక్టర్లూ తమకు అత్యంత సన్నిహితులూ, క్లాస్‌మేట్లూ అయినవారిని కొన్ని యూనివర్సిటీలకు ఉపకులపతులుగా నియమించాలని పావులు కదుపుతున్నట్లు యూనివర్సిటీ క్యాంపసుల్లో చర్చలు నడుస్తున్నాయి. వీసీల నియామకంలో మంత్రులు తమ తమ సామాజిక వర్గాలవారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. దీన్నిబట్టి విశ్వ విద్యాలయాల్లో రాజకీయ నాయకుల జోక్యం ఎంత భయంకరంగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయ నాయకుల జోక్యం తగ్గి, విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెంటనే ఇప్పటికైనా ఉపకులపతుల ఎంపిక ప్రక్రియ, కేవలం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణలో మాత్రమే కాకుండా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సమక్షంలో, నిష్పక్ష పాతంగా, అందరి దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకునేవిధంగా సాగాలి. అభ్యర్థులు ఆ యా విశ్వవిద్యాలయాలను ఏ రకంగా అభివృద్ధి చేస్తారో తెలియచేసే విజన్ డాక్యుమెంట్లను సైతం సేకరించి విశ్లేషించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి. అలా కాకుండా ప్రమాణాలను తుంగలో తొక్కి, అయినవారికే వీసీ పదవులను వడ్డిస్తే యూనివర్సిటీలు స్వరాష్ట్రంలోనూ బాగుపడవు. ఇక అందులో చదువుకునే యువత ఏవిధంగా తయారవుతారో ఊహించాల్సిందే!

– జవ్వాజి దిలీప్; జేఎన్‌టీయూ పరిశోధక విద్యార్థి, హైదరాబాద్

దేవుని సేవకు ఇదోమార్గం

భక్తి ఎక్కువైతే కొందరు ఊహాతీతంగా ప్రవర్తిస్తారు. వరగుణ పాండ్యన్ అనే రాజు ప్రవర్తన ఇందుకు మంచి ఉదాహరణ. తిరవిడై మరుదూర్ అనే ఊళ్లో ఆలయానికి కావలసిన నూనెను తీయడం కోసం ఒక రోజు నువ్వులు ఆరబెట్టారు. ఆ సమయంలో అటువైపుగా ఓ శివభక్తుడు వచ్చి ఓ పిడికెడు నువ్వులు తీసుకుని నోట్లో వేసుకున్నాడు. దేవుడి కోసం ఉపయోగించాలని ఎండబెట్టిన నువ్వుల్ని ఇలా నోట్లో వేసుకోవచ్చా? అది తప్పు కదా? అపచారం కదూ! అక్కడ కాపలా ఉన్నవారు ఇది చూశారు. 'అయ్యో... అపచారం అపచారం' అంటూ పరుగున వచ్చి అతనిని పట్టుకుని తీసుకుపోయి రాజు వరగుణ పాండ్యన్ ఎదుట హాజరుపరచారు.



వరగుణ పాండ్యన్ అతని వంక తీక్షణంగా చూశాడు. నుదుట బొట్టుతో పరమ శివభక్తునిలా కనిపించిన అతడిని చూసి ఆశ్చర్యపోయాడు రాజు. ఈయన ఇలా చేయడమేమిటీ అని అనుకున్న రాజు నమ్మలేకపోతున్నాడు.

'నువ్విలా చేయడమేమిటీ?' అని అడిగాడు. దానికి ఆ భక్తుడు ఇలా చెప్పాడు... 'నేను ఆకలి వల్ల అలా చేశాను. ఈ ఊరు నాకు ఎంతో నచ్చింది. శివాపచారం చేస్తే ఏడు జన్మలకు ఈ ఆలయానికి గానుగ ఆడించే ఎద్దుగా పుడతారన్న విషయం తెలుసు. అందుకే అలా చేశాను' అన్నాడు. పూర్వం ఎద్దులతో గానుగను ఆడించి నూనెను తీసేవారు. పుడితే ఈ ఊళ్ళో పుట్టాలి. అదీనూ గానుగ ఆడించే ఎద్దుగా. ఆ ఆలయంలో సేవ చేయాలి. ఒక తప్పు చేస్తే ఆ అవకాశం దక్కుతుందని తెలిసి ఆ భక్తుడు అలా చేశాడు.

రాజు వరగుణ పాండ్యన్ భక్తుణ్ణి నోరు తెరవమన్నారు. శివభక్తుడు నోరు తెరిచాడు. అతని నోటిని రాజు చీలుస్తాడని అక్కడున్న వారందరూ అనుకున్నారు. కానీ రాజు భక్తుని నోటిలో అంటుకుని ఉన్న నువ్వుల్ని తీసి తన నోట్లో వేసుకున్నాడు. 'మీరు చేసిన అపచారాన్ని నేనూ చేశాను. మీతో కలిసి నేనూ గానుగ ఆడించే ఎద్దుగా పుడతాను' అన్నాడు రాజు. ఇలా ఉంటుంది అపరిమిత భక్తి గలవారి ప్రవర్తన. ప్రవర్తనలోని తప్పొప్పుల కన్నా వారి భావన ప్రధానమని గ్రహించాలి.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ

ఎన్నికల అనంతరం యూపీలో మాదిరిగా రాష్ట్రంలో దాడులు / రాష్ట్రంలో మానవ హక్కుల హననంపై ప్రజా సంఘాల ధ్వజం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలిచిన తరువాత రాష్ట్రంలో హింసాకాండ చెలరేగిపోయిందని, ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలే లక్ష్యంగా కూటమి నేతలు దాడులతో చెలరేగిపోతున్నారని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడకముందు నుంచే కూటమి కార్యకర్తలు రాష్ట్రంలో విధ్వంసం ప్రారంభించారని, ప్రజాస్వామ్యవాదులంతా ఈ దాడులను ఖండించాలని చెప్పారు. ఎన్నికల అనంతరం ఏపీలో జరుగుతున్న మానవ హక్కుల హననంపై ప్రజా సంఘాల సమాలోచన సదస్సు (రౌండ్‌టేబుల్ సమావేశం) సోమవారం గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజిక కార్యకర్త, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్, ప్రముఖ అంబేడ్కరిస్ట్, గాయకుడు రెంజర్ల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై గళమెత్తారు. మానవ హక్కులను కాపాడేందుకు, రాష్ట్రంలో ప్రజా సంఘాలన్నీ కలిసి కూటమిగా ఏర్పడి పోరాటం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి ఎన్నికల హింస వ్యతిరేక పోరాట సమితిగా నామకరణం చేశారు. అందరూ ఐక్యతతో, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగి, ఎన్నికల హింసను, పేద, బడుగు, బలహీన వర్గాలపై దాడులను అరికట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సదస్సుల్లో పాల్గొన్న వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది



ఏపీలో ఎన్నికల తరువాత జరుగుతున్న దాడులు చూస్తుంటే ప్రజాస్వామ్యం ఖూనీ అయిందనే చెప్పుకోవచ్చు. నాయకులను ప్రజలు ఎన్నుకునే విధంగా రాజ్యాంగం రూపొందింది. నేడు ఆ రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా ప్రజలపై దాడులు జరుగుతున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. సోషల్ మీడియాను సమర్థవంతంగా మలుచుకుని పోరాటాలు చేయడంలో అందరూ కలిసికట్టుగా ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. నిరంతరం ఐక్యతతో ముందుకు సాగితేనే ఇలాంటి దాడులను ఆపగలం.

– బైరి నరేష్, సామాజిక కార్యకర్త, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు

యూపీ తరహా అరాచకాలకు ముఖచిత్రంగా ఏపీ



యూపీ తరహా అరాచకాలకు ఏపీ ముఖచిత్రంగా మారుతోంది. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. జేసీబీలతో ఇళ్లను కూల్చివేయడం చూస్తుంటే యూపీలో పాలనే ఏపీలో కొనసాగుతుందేమో అనిపిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు హేయమైన చర్య. వీటిన్నింటినీ అడ్డుకునేందుకు ప్రజా సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలి. ఈ దాడులను వ్యతిరేకిస్తూ త్వరలో ప్రజాసంఘాలన్నింటితో కలిసి విస్తృత పోరాటం చేస్తాం.

– రెంజర్ల రాజేష్, అంబేడ్కరిస్ట్, గాయకుడు

అధికారంలో ఉన్న పార్టీకి కొమ్ము కాస్తున్న అధికారులు



ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి అధికారులు కొమ్ము కాయడం బాధాకరం. ఎన్నికల ముందు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను మారిస్తే వారు జిల్లాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేక బృందాలను తీసుకువచ్చామని చెప్పినప్పటికి, ఎన్నికలైన తరువాత దాడులు జరగడం బాధాకరం. దాదాపు 30 గ్రామాల్లో మాదిగ పల్లెలను టార్గెట్ చేస్తూ కూటమి కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు పక్షపాతంతో వ్యవహరించడం సిగ్గుచేటు.

– కె.కృష్ణ, కుల నిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి

చట్టబద్ధమైన పాలన లేకుండా పోయింది



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చట్టబద్ధమైన పాలన లేకుండా పోయింది. ముఖ్యంగా పల్నాడులో వ్యాపారాలను స్వచ్ఛందంగా టీడీపీ నేతలకు అప్పగించాల్సిన పరిస్థితి. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలకు తల వంచాల్సిన పరిస్థితులు చూస్తున్నాం. ముఖ్యంగా కుల ఆధిపత్యం చెలరేగిపోతోంది. ఈ దుష్పరిణామాలపై ప్రజా సంఘాలన్నీ సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

– కోలా నవజ్యోతి, భారత్ బచావో గుంటూరు, కృష్ణా జిల్లాల ఆర్గనైజింగ్ సెక్రటరీ

అన్యాయంగా కేసులు పెడుతున్నారు



రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. అన్యాయంగా వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ అక్రమ కేసులను ఖండించాలి. బాధితుల పక్షాన ప్రజా సంఘాలన్నీ నిలబడి వారిలో మనోధైర్యాన్ని నింపాలి.

– జయసుధ, వీసీకే పార్టీ నాయకురాలు

రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు



కూటమి సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందు నుంచే ఆ పార్టీల కార్యకర్తలు విధ్వంసం సృష్టిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమంజసం కాదు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ గళం విప్పి కూటమి అరాచకాలను ఎండగట్టాలి.

– భాను, జర్నలిస్ట్

కలిసికట్టుగా ఒక తాటిపైకి రావాలి



రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ముఖ్యంగా దళితులు, బహుజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మాల, మాదిగలపై దాడులు పెరిగిపోయాయి. వీటన్నింటినీ అరికట్టాలంటే కలిసి కట్టుగా పోరాటం చేయాలి. దాడి చేయాలంటేనే భయపడే పరిస్థితులు రావాలి.

– వాసిమళ్ల విజయ్, క్రిస్టియన్ యూత్ ప్రెసిడెంట్

ఈవీఎంలు బ్యాన్ చేయాలి



ఈవీఎంలు బ్యాన్ చేయాలని కొన్ని సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నాం. వాటిని బ్యాన్ చేస్తేనే ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతాయి. ప్రజా సమస్యల మీద పోరాడే వారిపై దాడులు పరిపాటిగా మారాయి. గెలిచిన వారు ప్రజా రంజక పాలన అందించాలే గానీ, వ్యక్తిగత రాజకీయాలు చేయకూడదు.

– పొందుగల చైతన్య, హైకోర్టు న్యాయవాది

రాష్ట్రంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన



77 సంవత్సరాల స్వాతంత్ర్యం అనంతరం కూడా రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరగడం గర్హనీయం. రాష్ట్రంలో మనిషిని మనిషిగా గౌరవించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మనుషుల మధ్య జరుగుతున్న హింసను అరికట్టాలి. బాధితుల తరఫున హైకోర్టులో పోరాడటానికి మేం సిద్ధం.

– వేముల ప్రసాద్, హైకోర్టు అడ్వొకేట్

కూటమి పాలన ఎలా ఉండబోతోందో అర్థమవుతోంది



ఎన్నికల్లో కూటమి గెలిచిన తరువాత సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయకముందే రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లు చూస్తుంటే...కూటమి పాలన ఐదేళ్లలో ఏ విధంగా ఉంటుందో స్పష్టంగా అర్థమవుతోంది. ప్రజాసంఘాలన్నీ ఈ దాడులను అరికట్టేందుకు సరైన నిర్ణయంతో ముందుకు సాగాలి.

– చిలుక చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మెరిట్ ప్రకారం పోస్టింగ్ ఇవ్వండి

టీజీఎస్‌పీడీసీఎల్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల ఎంపికల్లో మెరిట్ ప్రకారం పిటిషనర్ కు పోస్టు ఇవ్వాలని టీజీఎస్‌పీడీసీఎల్‌ను హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రస్తావన అవసరంలేదని, అన్ని బెనిఫిట్స్‌ను అత నికి వర్తింపజేయాలని స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను అనుమతించింది. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు ఎంపికైనా.. రాష్ట్రపతి ఉత్తర్వుల పేర నాన్‌లోకల్ జిల్లాగా చెబుతూ తనకు టీజీఎస్‌పీడీసీఎల్ పోస్టింగ్ ఇవ్వకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ కామారెడ్డి జిల్లాకు చెందిన టి.గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు రాష్ట్ర పతి ఉత్తర్వులు అమలు సరికాదని ఇటీవల ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు.

‘స్థానికత’పై ఈ నెల 26న తుది విచారణ

- టీజీపీఎస్సీ పిటిషన్లపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: పోస్టుల భర్తీకి సంబంధించి ‘స్థానికత’అంశంపై ఈ నెల 26న తుది విచారణ చేపడతామని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. 2018, ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 124లోని స్థానికత నిబంధనల్లో కొన్ని లోపాలున్నప్పటికీ, వివిధ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను స్థానికులుగా పరిగణించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ను సింగిల్ జడ్జి ఆదేశించారు. దీన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. 7వ తరగతి వరకు వరుసగా నాలుగు సంవత్సరాలు చదవకపోయినా.. జూనియర్ అసిస్టెంట్, ఇతర కేటగిరీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ఆ జిల్లా స్థానిక అభ్యర్థిగా పరిగణించాలని సింగిల్ జడ్జి ఆదేశించడం సరికాదని టీజీపీఎస్సీ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. ఇలాంటి స్థానికత అంశానికి సంబంధించిన మరికొన్ని పిటిషన్లు కూడా ఉండటంతో అన్నింటిపై ఈ నెల 26 తుది విచారణ చేపడతామన్న ధర్మాసనం.. తదుపరి విచారణ వాయిదా వేసింది.



రవీందర్, రవళి

‘పంచాయితీ’ ప్రాణాల మీదికొచ్చింది

- సహజీవనం చేస్తున్న జంటకు సంకటంగా మారిన కుల పంచాయితీ
- ఏం చేస్తారోననే భయంతో ఆత్మహత్యాయత్నం
- ప్రేమికురాలు మృతి... విషమంగా ప్రేమికుడి ఆరోగ్యం

బయ్యారం: ఒకరినొకరు ఇష్టపడి కొన్ని నెలల పాటు సహజీవనం చేసిన జంటకు కులపంచాయితీ ప్రాణాల మీదికి తెచ్చింది. కుల కట్టుబాట్ల కారణంగా విడిపోతామనే భయమో... ఇంకేదైనా కారణమో.. ఆ జంట చనిపోదామని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయంతో ప్రేమికు రాలు మృతి చెందగా ప్రేమికుడు చావుబతు కుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. కోటగడ్డ గ్రామానికి చెందిన మెండు రవీందర్, అదే గ్రామానికి చెందిన వివాహిత కొట్టెం రవళి (23) ప్రేమించుకున్నారు. రవళికి మూడేళ్ల క్రితమే మరో యువకుడితో వివాహం జరగగా, ఆమె కాపురానికి వెళ్లకుండా తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో రవళి తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, లీలావతి బతుకుదెరువు కోసం యాదాద్రి జిల్లా భువనగిరి ప్రాంతంలోని ఓ కోళ్లఫారంలో కూలీలుగా పనిచేస్తుండగా రవళి కూడా వారితోనే ఉంటోంది. గత ఏప్రిల్‌లో రవీందర్ భువనగిరి వెళ్లి రవళిని వెంటబెట్టుకుని ఏపీలోని శ్రీకాకుళం వెళ్లి అక్కడే సహజీ వనం చేస్తున్నారు. దీంతో ఇరువురి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రేమికులను తీసుకొచ్చిన పోలీసులు..

రవీందర్, రవళి శ్రీకాకుళంలో ఉన్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఐదు రోజుల క్రితం వారిని తీసుకువచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరినీ వారివారి తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే రెండు రోజుల క్రితం రవీందర్ ఇంటికి రవళి వచ్చింది. ఈ క్రమంలో రవళి తల్లిదండ్రులు కులపంచాయితీ చేయాలని పెద్దలను ఆశ్రయించటంతో సోమవారం నిర్వహించేందుకు నిర్ణయించారు. అయితే సోమవారం తెల్లవారుజా మున నిద్రలేచిన రవళి, రవీందర్‌లు గదిలోకి వెళ్లి తలుపు పెట్టుకున్నారు. ఏం జరిగిందోగానీ రవళి ఉరివేసుకొని మృతి చెందగా, రవీందర్ కత్తితో మెడకోసుకొని రక్తపుమడుగులో ఉన్నాడు. వెంటనే స్థానికులు అతన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, తన కూతురు మృతిపై అనుమానం ఉందని రవళి తండ్రి ఆరోపించారు. గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సైలు ఉపేందర్, జీనత్‌కుమార్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా ఐపీఎస్‌ల బదిలీ

అధికారి పేరు	ప్రస్తుతం	బదిలీ
అశోక్‌కుమార్(2019)	మంచిర్యాల,డీసీపీ	ఎస్పీ, జగిత్యాల
సన్‌ప్రీత్ సింగ్(2011)	వెయిటింగ్	ఎస్పీ, సూర్యాపేట
రాహుల్ హెగ్డే(2014)	ఎస్పీ, సూర్యాపేట	హైదరాబాద్, ట్రాఫిక్ డీసీపీ
ఎల్ సుబ్బారాయుడు(2013)	హైదరాబాద్,ట్రాఫిక్ డీసీపీ	డీజీపీ హెడ్ క్వార్టర్స్
టి శ్రీనివాస రావు(2013)	బాలానగర్ డీసీపీ	ఎస్పీ, జోగుళాంబ గద్వాల
రితిరాజ్(2018)	ఎస్పీ, జోగుళాంబ గద్వాల	జాయింట్ డైరెక్టర్,ఏసీబీ
డీవీ శ్రీనివాసరావు(2013)	ట్రాఫిక్ డీసీపీ, మేడ్చల్	ఎస్పీ, కొమురంభీం ఆసిఫాబాద్
కె సురేష్‌కుమార్(2016)	ఎస్పీ, కొమురంభీం ఆసిఫాబాద్	బాలానగర్,డీసీపీ
జానకి ధారవత్(2013)	డీసీపీ, సౌత్‌జోన్ హైదరాబాద్	ఎస్పీ,మహబూబ్‌నగర్
హర్షవర్ధన్(2018)	ఎస్పీ, మహబూబ్‌నగర్	ఎస్పీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో
విశ్వజీత్ కంపాటి(2013)	ఎస్పీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో	ఎస్పీ సీఐడీ
బి. రాజేశ్	నాన్ కేడర్ ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్	డీసీపీ, శంషాబాద్
కె నారాయణరెడ్డి(2013)	డీసీపీ, శంషాబాద్	ఎస్పీ, వికారాబాద్
ఎన్ కోటిరెడ్డి(2013)	ఎస్పీ, వికారాబాద్	డీసీపీ, మేడ్చల్
నితిక పంత్(2017)	డీసీపీ, మేడ్చల్	కమాండెంట్ 2వ బెటాలియన్, అదిలాబాద్
చటర్జీ	కమాండెంట్ 2వ బెటాలియన్, అదిలాబాద్	రిపోర్ట్ టు హెడ్ క్వార్టర్స్
షరత్ చంద్ర పవర్(2016)	ఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో	ఎస్పీ, నల్లగొండ
చందనా దీప్తి(2012)	ఎస్పీ, నల్లగొండ	ఎస్పీ, రైల్వేస్, సికింద్రాబాద్
షేక్ సలీమా(2017)	ఎస్పీ,రైల్వేస్ ,సికింద్రాబాద్	వరంగల్, సెంట్రల్ జోన్ డీసీపీ
ఎమ్ఏ భారి(నాన్ కేడర్)	వరంగల్, సెంట్రల్ జోన్ డీసీపీ	రిపోర్ట్ టు హెడ్ క్వార్టర్స్
పాటిల్ సంగ్రామ్‌సింగ్(2015)	వెయిటింగ్	సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్
పి. సాయి చైతన్య(2016)	వెయిటింగ్	ఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో
సాధన రష్మి పెరుమాల్(2019)	డీసీపీ, టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్	డీసీపీ నార్త్‌జోన్, హైదరాబాద్ సిటీ
రోహిణి ప్రియదర్శిణి(2013)	డీసీపీ, నార్త్‌జోన్, హైదరాబాద్ కమాండెంట్,	7వ బెటాలియన్, డిచ్‌పల్లి, నిజామాబాద్
బి రామ్ ప్రకాష్	కమాండెంట్, 7వ బెటాలియన్, డిచ్‌పల్లి ,నిజామాబాద్	రిపోర్టు టు హెడ్ క్వార్టర్స్
బి రాజ మహేంద్ర నాయక్	ఎస్పీ, ఇంటెలిజెన్స్	డీసీపీ, వెస్ట్‌జోన్ జనగాం, వరంగల్
పి సీతారాం	డీసీపీ, వెస్ట్‌జోన్ జనగాం, వరంగల్	రిపోర్ట్ టు హెడ్ క్వార్టర్స్
ఏ భాస్కర్	ఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో	డీసీపీ,మంచిర్యాల, రామగుండం

సాగర్ ప్రాజెక్టును సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్



సాగర్ డ్యాంను పరిశీలిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ అశోక్‌గోయెల్

నాగార్జునసాగర్: కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ అశోక్ గోయెల్ సోమవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రధాన డ్యామ్, గ్యాలరీలు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సాగర్ జలాశయం నీటిమట్టంతోపాటు, టెయిల్‌పాండ్‌లో నీటి నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. జలాశయంలో ఎంతమేరకు నీరుంటే కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాలతోపాటు ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో ప్రస్తుతం కరెంట్ ఉత్పత్తి జరుగుతుందని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట కేఆర్ఎంబీ కమిటీ సభ్యులు ఆర్.ఎన్ సాంకు, వరలక్ష్మీ, ఎస్ఈ అజయ్ యాదవ్, డీఈ రాజేశ్‌చారి, వీరితో పాటు సాగర్‌డ్యామ్ ఎస్ఈ నాగేశ్వర్ రావు, ఈఈ మల్లి ఖార్జున్, డీఈ శ్రీనివాసరావు, ఏఈలు కృష్ణయ్య, సత్య నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన ఫొటో సరదా

- ఎల్ఎండీ చూసేందుకు వెళ్లిన కుటుంబం
- ఫొటో దిగుతుండగా డ్యాంలో పడిన కూతురు
- కూతురిని కాపాడేందుకు నీళ్లలో దూకిన తండ్రి, సోదరుడు
- నీట మునిగి తండ్రి మృతి
- కొట్టుకుపోతున్న పిల్లలను కాపాడిన జాలరి
- కరీంనగర్ జిల్లా అలుగునూరులో ఘటన



విజయ్



జాలరి శంకర్

తిమ్మాపూర్: పిల్లల ఫొటో సరదా ఓ తండ్రి నిండు ప్రాణం తీసేసింది. కరీంనగర్ జిల్లా అలుగు నూరు వద్ద ఎల్ఎండీ జలాశయంలో మునిగి జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వోద్యోగి మృతి చెందారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన బంగారి విజయ్ (47) కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇరిగేషన్ పే అండ్ అకౌంట్స్ డిపార్టుమెంట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆది, సోమవారం సెలవు కావడంతో ఇంటికి వచ్చారు. సోమవారం భార్య ప్రశాంతి, తల్లి పుష్పలత, పిల్లలు సాయినిత్య, విక్రాంత్‌తో కలిసి కారులో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి శివాలయా నికి వెళ్లారు. పిల్లలు డ్యాం చూద్దామని కోరడంతో అలుగు నూరు శివారులోని కాకతీయ కెనాల్ మీదుగా ఎల్ఎండీ జలాశయం కట్టపైకి వెళ్లారు. కెనాల్ మెయిన్ పాయింట్ వద్దకు వెళ్లి జలాశయాన్ని సందర్శించారు. అనంతరం అక్క డే ఫొటోలు దిగుతుండగా సాయినిత్య నీళ్లలో పడిపోయింది. కూతుర్ని కాపాడేందుకు విజయ్ జలాశయంలో దూకాడు. తండ్రి, సోదరి నీటమునగడం చూసి కొడుకు విక్రాంత్ సైతం డ్యాంలో దూకాడు. ఒడ్డునున్న ప్రశాంతి, పుష్పలత కేకలు వేయడంతో సమీపంలో ఉన్న జాలరి శంకర్ వచ్చి పిల్లలను కాపాడాడు. విజయ్ అప్పటికే నీట మునిగి చనిపోయారు. జాలర్లు ఆయన మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఘటనా స్థలాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించి బాధితులను ఓదార్చారు. పిల్లలను కాపాడిన జాలరి శంకర్‌ను అభినందించారు. విజయ్ భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భారజల కర్మాగారాన్ని సందర్శించిన బోర్డు చైర్మన్

దక్షిణ కొరియాకు భారజలం ఎగుమతి

అశ్వాపురం(భద్రాద్రి కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారాన్ని సోమవారం భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్ సందర్శించారు. కర్మా గారంలోని వివిధ విభాగాలను సందర్శించిన ఆయన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. మణుగూరు భారజల కర్మా గారం నుంచి ఇరవై వేల లీటర్ల(20 టన్నులు) భారజలాన్ని దక్షిణ కొరియాకు ఎగుమతి చేస్తుండగా.. ఈ ఎగుమతిని చైర్మన్ సత్యకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, డీజీఎంలు శ్రీనివాసరావు, హెచ్.కె.శర్మ, జగన్నాథశర్మ, ఏడీఎంఓ రాఖీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ
'ఇ'ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
తి.తి.దేవస్థానము మార్కెటింగ్ శాఖకు ఆరు నెలల కాలవ్యవధి కొరకు "5,40,000 నం.ల కాటన్ అప్పర్స్, 150 నం.ల వెల్వెట్ మరియు తిత్తిరీయం వస్త్రం సెట్లు, 21,600 నం.ల దుప్పట్లు (పాలి X సిల్క్)", 1,80,000 ఎండుద్రాక్ష (ఇండియన్ బ్రౌన్) (రెండు నెలల కాలవ్యవధి) మరియు 50,00,000 పేపర్ ప్లేట్లు (సిల్వర్ ఫాయిల్‌తో) (నాలుగు నెలల కాలవ్యవధి) సరఫరా కొరకు ప్రముఖ తయారీదారులు / ప్రభుత్వ అర్హతగల (అంటే ప్రభుత్వ అధీకృత ఏజెన్సీలు) నుండి ఇ-టెండర్-కమ్-రివర్స్ బిడ్డింగ్ ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాల కొరకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in ను లాగిన్ అవండి. తదుపరి వివరాల కొరకు సంప్రదించండి ఫోన్ నంబర్లు 0877-2264079, 2264555, ఫ్యాక్స్ నం: 0877-2264554
TTD-40021(31)/1/2024-PRO SEC (Adv.No.33), Dt: 17.06.2024
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
హైదరాబాద్ లోని ఎర్రమంజిల్‌లో గల జలసౌధ భవన సముదాయము యొక్క వార్షిక నిర్వహణ సంవత్సరం 2024-25 (సివిల్, వాటర్ సప్లై వర్క్స్, హౌస్ కీపింగ్ మరియు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్స్, రోడెంట్ కంట్రోల్ (ట్రీట్మెంట్ మరియు శానిటైజేషన్). ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నెం.01/2024-25, తేది: 14.06.2024 ద్వారా బిడ్లను ఆహ్వానించడమైనది. టెండరు స్వీకరించు ఆఖరి తేది మరియు సమయం: 24.06.2024 మ.03.00 గం. వరకు, అంచనా విలువ: రూ.72.70 లక్షలు
గమనిక: మిగతా వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- హైడ్రోగ్రాఫ్, పర్యవేక్షక అభియంత, I & CADD, జలసౌధ సర్కిల్, హైదరాబాద్, రెడ్‌హిల్స్, హైదరాబాద్, ఫోన్ 040-23394218
DIPR RO No.715-PP/CL/Advt/1/2024-25, Dt: 15.06.2024

डी एन ए फिंगरप्रिंटिंग एवं निदान केन्द्र
(जैव प्रौद्योगिकी विभाग, विज्ञान एवं प्रौद्योगिकी मंत्रालय, भारत सरकार का स्वायत्त संस्थान) इनर रिंग रोड, उप्पल, हैदराबाद-500039, तेलंगाना, भारत
CENTRE FOR DNA FINGERPRINTING AND DIAGNOSTICS
(an autonomous institute of the Dept. of Biotechnology, Ministry of Science & Technology, Govt. of India) Inner Ring Road, Uppal, Hyderabad - 500 039, Telangana, India
सीडीएफडी CDFD
दूरभाष / Tel: +91-40-2721 6093 फैक्स / Fax: +91-40-2721 6006
वेबसाइट / Website: http://www.cdfd.org.in
ADVERTISEMENT NO. 03/2024
RECRUITMENT OF MEDICAL CONSULTANT ON TEMPORARY BASIS
The Centre for DNA Fingerprinting and Diagnostics (CDFD), Hyderabad is a premier autonomous R & D Institute under Department of Biotechnology, Ministry of Science and Technology, Government of India, that has been established to provide services in DNA fingerprinting and diagnosis of genetic disorders, and to undertake high quality basic research in frontier areas of modern biology.
CDFD wishes to recruit
MEDICAL CONSULTANT - (01 POST) ON TEMPORARY BASIS
Please visit CDFD website www.cdfd.org.in for further details. Sd/-
प्रमुख - प्रशासन
Head - Administration

भारतीय वायु सेना | భారతీయ వాయుసేన
భారతీయ వాయుసేనలో అగ్నివీర్‌వాయుగా చేరండి
అగ్నిపథ్ పథకం క్రింద అగ్నివీర్‌వాయు ఇంటేక్ 02/2025 కోసం ఎంపిక పరీక్ష కొరకు అవివాహిత భారతీయ పురుషులు మరియు మహిళా అభ్యర్థుల నుండి భారతీయ వాయుసేన ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు : 08 జూలై 2024, 1100 గం. నుండి 28 జూలై 2024, 2300 గం. వరకు
ఆన్‌లైన్ పరీక్ష తేదీలు : 18 అక్టోబర్ 2024 నుండి
రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌పోర్టల్ : https://agnipathvayu.cdac.in
పుట్టిన తేది బ్లాక్ : 03 జూలై 2004 మరియు 03 జనవరి 2008 మధ్య జన్మించి ఉండాలి (రెండు తేదీలు సహా)
విద్యార్హతలు :
(ఏ) సైన్స్ సబ్జెక్ట్స్
అభ్యర్థులు అగ్రిగేట్‌లో కనీసం 50% మార్కులు మరియు ఇంగ్లీష్‌లో 50% మార్కులతో కేంద్ర, రాష్ట్ర మరియు UTచే గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి మేథమెటిక్స్, ఫిజిక్స్ మరియు ఇంగ్లీష్‌తో ఇంటర్మీడియట్ / 10+2 / సరిసమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
లేదా
డిప్లొమా కోర్సు (లేదా డిప్లొమా కోర్సులో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా లేనట్లయితే ఇంటర్మీడియట్ / మెట్రిక్యులేషన్)లో ఇంగ్లీష్‌లో 50% మార్కులు మరియు అగ్రిగేట్‌లో 50% మార్కులతో కేంద్ర, రాష్ట్ర మరియు UTచే గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ నుండి ఇంజినీరింగ్ (మెకానికల్ / ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / ఆటోమొబైల్ / కంప్యూటర్ సైన్స్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ / ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణత.
లేదా
వొకేషనల్ కోర్సు (లేదా వొకేషనల్ కోర్సులో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా లేనట్లయితే ఇంటర్మీడియట్ / మెట్రిక్యులేషన్)లో ఇంగ్లీష్‌లో 50% మార్కులు మరియు అగ్రిగేట్‌లో 50% మార్కులతో కేంద్ర, రాష్ట్ర మరియు UTచే గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి నాన్-ఒకేషనల్ సబ్జెక్ట్ అంటే ఫిజిక్స్ మరియు మేథమెటిక్స్‌తో రెండు సంవత్సరాల వొకేషనల్ కోర్సు ఉత్తీర్ణత.
(బి) సైన్స్ సబ్జెక్ట్స్ కాకుండా
అగ్రిగేట్‌లో కనీసం 50% మార్కులు మరియు ఇంగ్లీష్‌లో 50% మార్కులతో కేంద్ర, రాష్ట్ర మరియు UTచే గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి ఏవేని స్ట్రీమ్ / సబ్జెక్టులలో ఇంటర్మీడియట్ / 10+2 / సరిసమాన పరీక్ష ఉత్తీర్ణత.
లేదా
వొకేషనల్ కోర్సు (లేదా వొకేషనల్ కోర్సులో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా లేనట్లయితే ఇంటర్మీడియట్ / మెట్రిక్యులేషన్)లో ఇంగ్లీష్‌లో 50% మార్కులు మరియు అగ్రిగేట్‌లో కనీసం 50% మార్కులతో కేంద్ర, రాష్ట్ర మరియు UTచే గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి రెండు సంవత్సరాల వొకేషనల్ కోర్సు ఉత్తీర్ణత.
గమనిక-1: సైన్స్ సబ్జెక్టుల పరీక్ష (ఇంటర్మీడియట్ / 10+2 / ఇంజినీరింగ్‌లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు లేదా నాన్-వొకేషనల్ సబ్జెక్టులు అంటే ఫిజిక్స్ మరియు మ్యాథ్స్‌తో రెండు సంవత్సరాల వొకేషనల్ కోర్సు సహా) కోసం అర్హతగల అభ్యర్థులు సైన్స్ సబ్జెక్టులు కానివాటి కోసం కూడా అర్హులే మరియు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారం పూరించే సమయంలో వన్ సిటింగ్‌లో సైన్స్ సబ్జెక్టులు మరియు సైన్స్ సబ్జెక్టులు కానివాటికి రెండింటిలో హాజరుకావడానికి ఆప్షన్ ఇవ్వబడును.
రిజిస్ట్రేషన్ మరియు పరీక్ష ఫీజు: రూ.550/- ప్లస్ GST.
అగ్నివీర్‌వాయు ఇంటేక్ 02/2025 కోసం ప్రారంభ స్థాయి విద్యార్హత, వైద్య ప్రమాణాలు, నియమ నిబంధనల సవివరమైన సమాచారం, ఆన్‌లైన్ దరఖాస్తులు పూరించడానికి సూచనలు మరియు రిజిస్ట్రేషన్ కోసం https://agnipathvayu.cdac.in వెబ్‌పోర్టల్‌కు లాగాన్ చేయండి.
CBC 10803/11/0006/2425
సవివరమైన సమాచారం కొరకు QR కోడ్ స్కాన్ చేయండి.



బెంగాల్‌లోని రంగపాణి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం గూడ్స్ రైలు వెనుక నుంచి ఢీకొనడంతో పైకి లేచిన కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ బోగీ

● పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టిన గూడ్స్ రైలు

పట్టాలు తప్పిన మూడు కోచ్‌లు

9 మంది దుర్మరణం.. 41 మందికి గాయాలు

న్యూజల్పాయ్‌గురి/కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. వేగంగా వస్తున్న గూడ్స్ రైలు రెడ్ సిగ్నల్‌ను జంప్ చేసి అదే ట్రాక్‌పై నిలిచిఉన్న కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. త్రిపురలోని అగర్తలా నుంచి బెంగాల్‌లోని సీల్దాకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి మూడు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఇందులో ఒక గార్డు కోచ్, రెండు పార్సల్ కోచ్‌లు ఉన్నాయి. అదృష్టవశాత్తూ ప్రయాణికుల కోచ్‌లకు నష్టం వాటిల్లలేదు. ఉత్తర బెంగాల్‌లో న్యూజల్పాయ్‌గురి రైల్వేస్టేషన్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని రంగపాణి స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. 41 మంది గాయపడ్డారు. గూడ్స్ రైలు లోకో పైలట్, ఎక్స్‌ప్రెస్ రైలు గార్డుతోపాటు ఏడుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని రైల్వేశాఖ అధికారులు వెల్లడించారు. రైలు ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే రైల్వేశాఖతోపాటు పశ్చిమ బెంగాల్ అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. కోచ్‌ల్లో ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

రెడ్ సిగ్నల్ పడినా..

గూడ్స్ రైలు లోకో పైలట్ నిర్లక్ష్యం వల్లే రైలు ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో మానవ తప్పిదం ఉండొచ్చని, రెడ్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ లోకో పైలట్ ఆగకుండా ముందుకు దూసుకెళ్లడంతో ఎక్స్‌ప్రెస్ రైలును వెనుకనుంచి ఢీకొట్టినట్లు భావిస్తున్నామని రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా చెప్పారు. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు చోటుచేసుకున్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఒకే సింగిల్ ట్రాక్‌పై రెండు రైళ్లు అత్యంత సమీపంలోకి వచ్చేలా సిగ్నల్ ఎలా ఇచ్చారన్న దానిపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద తీవ్రతకు కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ చివరి భాగంలోని మూడు కోచ్‌లు పట్టాలు తప్పాయి. రెండు కోచ్‌లు పూర్తిగా పక్కకు ఒరిగిపోగా, మరో కోచ్ గాల్లోకి లేచి అలాగే వేలాడుతోంది. గూడ్స్ రైలు ఇంజన్ దానికిందికి చొచ్చుకొచ్చింది. వేలాడుతున్న కోచ్‌ను అధికారులు తొలగించారు. మధ్యాహ్నం 12.40 గంటలకు మిగిలిన కోచ్‌లతో ఎక్స్‌ప్రెస్ రైలు ఘటనా స్థలం నుంచి కోల్‌కతా వైపు ప్రయాణం సాగించింది.

కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ దర్యాప్తు

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షించడానికి రైల్వేశాఖ మంత్రి వైష్ణవ్ రంగంలోకి దిగారు. లిఫ్ట్ అడిగి బైక్‌పై ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంపై కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షల చొప్పున, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు.

రాష్ట్రపతి, ప్రధానమంత్రి దిగ్భ్రాంతి

సాక్షి, న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఘోర ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

ఇదంతా మోదీ సర్కారు నిర్వాకం: కాంగ్రెస్

బెంగాల్ రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ నేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాకం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రైల్వేశాఖను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. మోదీ పదేళ్ల పాలనలో రైల్వేశాఖ తల్లిదండ్రులు లేని అనాథగా మారిందని సీఎం మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. రైల్వే శాఖ గత వైభవాన్ని కోల్పోయిందన్నారు.

ఆ మార్గంలో 'కవచ్' లేదు

రైళ్లు పరస్పరం ఢీకొట్టకుండా కవచ్ వ్యవస్థను రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. అయితే, గౌహతి-ఢిల్లీ మార్గంలో ఈ వ్యవస్థను ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు. కాంచనజంగ ప్రమాదం జరిగిన ప్రాంతం ఇదే మార్గంలో ఉంది.

కొంపముంచిన టీఏ912 లెటర్!

కాంచనజంగ రైలు ఘటనలో మరో కోణం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదం వెనుక గూడ్స్ రైలు లోకో పైలట్ తప్పిదం లేదని తెలుస్తోంది. రాణిపాత్ర స్టేషన్, ఛత్తర్‌హట్ జంక్షన్ మధ్యలో కాంచనజంగ రైలును గూడ్స్ రైలు ఢీకొట్టింది. అయితే, సోమవారం ఉదయం 5.50 గంటల నుంచి ఈ మార్గంలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయక పోవడంతో రెడ్‌సిగ్నల్ ఉన్నప్పటికీ ముందుకెళ్లాలని లోకో పైలట్‌కు సూచించినట్లు వెల్లడయ్యింది. ఈ మేరకు రైల్వేశాఖ అంతర్గత నివేదిక ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ నివేదిక ప్రకారం.. రాణిపాత్ర స్టేషన్ మాస్టర్ టీఏ912 పేరిట లోకో పైలట్‌కు లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. రాణిపాత్ర స్టేషన్, ఛత్తర్‌హట్ జంక్షన్ మధ్యలో ఏ సిగ్నల్ పడినా దాటుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. అదే ట్రాక్‌పై మరో రైలు లేకపోతే సిగ్నల్‌తో సంబంధం లేకుండా ముందుకెళ్లడానికి టీఏ912 లెటర్ జారీ చేస్తుంటారని రైల్వేవర్గాలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన ట్రాక్‌పై అంతకుముందే ఒక రైలు వెళ్లింది. మరో సెక్షన్‌లోకి ప్రవేశించింది. దాంతో ట్రాక్‌పై రైలు లేదన్న అంచనాతో స్టేషన్ మాస్టర్ టీఏ912 జారీ చేసినట్లు అనుమానిస్తున్నారు. కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 8.27 గంటలకు రంగపాణి స్టేషన్‌ను దాటేసింది. రాణిపాత్ర స్టేషన్, ఛత్తర్‌హట్ జంక్షన్ మధ్యలో ట్రాక్‌పై నిలిచిపోయింది. ఎందుకు నిలిచిందన్నది తెలియడంలేదు. గూడ్స్ రైలు ఉదయం 8.42 గంటలకు రంగపాణి స్టేషన్‌ను దాటేసి సరిగ్గా 8.55 గంటలకు కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఏడాది క్రితం జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనను గుర్తుకుతెచ్చింది.

వయనాడ్ నుంచి ప్రియాంక

రాయ్‌బరేలీ ఎంపీగానే రాహుల్ గాంధీ ● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ స్థానాల్లో ఎంపీగా విజయం సాధించిన రాహుల్ గాంధీ ఇకపై రాయ్‌బరేలీ నుంచే కొనసాగుతారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. రెండింటా గెలిస్తే చట్టం ప్రకారం ఒక స్థానంలోనే కొనసాగాలి కాబట్టి రాయ్‌బరేలీ నుంచే రాహుల్ గాంధీ కొనసాగుతారని స్పష్టం చేశారు. ఎంతో అంతర్మథనం, చర్చల తర్వాత పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని అంగీకరించిన రాహుల్‌కు ఖర్గే ధన్యవాదాలు తెలిపారు. రాయ్‌బరేలీ స్థానంతో రాహుల్ కుటుంబానికి తరతరాలుగా అనుబంధం ఉందని గుర్తుచేశారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు కూడా రాయ్‌బరేలీ నుంచే రాహుల్ కొనసాగాలని కోరుకుంటున్నారని చెప్పారు. వయనాడ్ ప్రజల ప్రేమాభిమానాలు రాహుల్‌కు లభించాయన్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రియాంకా గాంధీ ఎంతో సహకరించారని ఖర్గే అభినందించారు. రాహుల్ ఏ స్థానం వదులుకోవాలన్న అంశంపై కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకా గాంధీ, కె.సి.వేణుగోపాల్ తదితరులు సోమవారం ఢిల్లీలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే, రాహుల్ మీడియాతో మాట్లాడారు. రాయ్‌బరేలీతోపాటు వయనాడ్‌తో తనకు భావోద్వేగపూరిత అనుబంధం ఉందని రాహుల్ గాంధీ అన్నారు. వయనాడ్‌ను వదులుకోవడం చాలా కఠిన నిర్ణయమేనని వెల్లడించారు. గత ఐదేళ్లపాటు వయనాడ్ ఎంపీగా కొనసాగడం అద్భుతమైన అనుభవం అని చెప్పారు. వయనాడ్ ప్రజలు తనకు అండగా నిలిచారని, సంక్షోభ సమయాల్లో తనకు కొత్త శక్తిని ఇచ్చారని కొనియాడారు. వారిని ఎప్పటికీ మర్చిపోలేనని వ్యాఖ్యానించారు. ఇకపై కూడా వయనాడ్‌ను సందర్శిస్తానే ఉంటానని, అక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని ఉద్ఘాటించారు. ఐదేళ్లపాటు ఎంతో ప్రేమాభిమానాలు పంచిన వయనాడ్ ప్రజలకు రాహుల్ ధన్యవాదాలు తెలియజేశారు. వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంక పోటీ చేస్తుందని తెలిపారు. తమకు ఇద్దరు ఎంపీలు ఉన్నట్లుగా భావించాలని వయనాడ్ ప్రజలకు రాహుల్ సూచించారు.

సంతోషంగా ఉంది: ప్రియాంకా గాంధీ

వయనాడ్ నుంచి తాను పోటీ చేయాలని పార్టీ తీసుకున్న నిర్ణయంపై ప్రియాంకా గాంధీ సంతోషం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా రాయ్‌బరేలీ, అమేథీలో పనిచేశానని, ఆ బంధం ఎట్టి పరిస్థితుల్లోనూ తెగిపోదని అన్నారు. ఆ బంధాన్ని కొనసాగించేందుకు తాను, రాహుల్ ఉన్నామని చెప్పారు. రాయ్‌బరేలీ, వాయనాడ్‌లో తనతో పాటు రాహుల్ ఉంటూ ఇద్దరం కలిసి పనిచేస్తామని తెలిపారు. రాహుల్ అందుబాటులో లేరన్న అభిప్రాయం వయనాడ్ ప్రజల్లో కలగకుండా చూస్తానని ప్రియాంక గాంధీ చెప్పారు.


మీడియాతో మాట్లాడుతున్న రాహుల్, ప్రియాంక

తొలిసారిగా పోటీ చేస్తున్న ప్రియాంక

ప్రియాంకా గాంధీ 2019లో క్రియాశీల రాజకీయాల్లో అడుగుపెట్టారు. అతిత్వరలోనే కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. సార్వత్రిక ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీ లేదా అమేథీ లేదా వారణాసిలో పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, పోటీకి దూరంగానే ఉన్నారు. ప్రచారంలో పాల్గొన్నారు. రాయ్‌బరేలీ, అమేథీలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. రాహుల్ ఖాళీ చేస్తున్న వయనాడ్ రాడ్ స్థానానికి ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక జరుగనుంది. 52 ఏళ్ల ప్రియాంక ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

పోప్‌ను అవమానించడం మా ఉద్దేశం కాదు

క్రైస్తవులకు క్షమాపణ చెప్పిన కేరళ కాంగ్రెస్

తిరువనంతపురం: పోప్–మోదీ భేటీపై సోషల్ మీడియాలో చేసిన కామెంట్ పట్ల కేరళ కాంగ్రెస్ క్రైస్తవ సమాజానికి క్షమాపణలు చెప్పింది. పోప్‌ను అవమానించడం తమ ఉద్దేశం కాదని స్పష్టత ఇచ్చింది. జీ7 సదస్సులో పోప్ ఫ్రాన్సిస్‌తో మోదీ భేటీపై కేరళ కాంగ్రెస్ పార్టీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో చేసిన పోస్టు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. మోదీ–పోప్ ఫోటోను పోస్టు చేసిన కేరళ కాంగ్రెస్.. దానికి ''చివరకు దేవున్ని కలిసే అవకాశం పోప్‌కు దక్కింది'' అని క్యాప్షన్ రాసింది. ఆ పోస్టుపై బీజేపీతో పాటు ఇతర పార్టీలు విమర్శలు గుప్పించాయి. దీంతో తన సోషల్ మీడియా అకౌంట్ నుంచి ఆ పోస్టును తొలగించిన కేరళ కాంగ్రెస్, క్రైస్తవులకు క్షమాపణలు చెప్పింది.

ఎన్‌ఐఏ చేతికి 'బస్సుపై ఉగ్రదాడి' కేసు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఇటీవల బస్సుపై ఉగ్రవాదుల దాడి కేసు దర్యాప్తును కేంద్రం హోంశాఖ... జాతీయ పరిశోధన సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగించింది. జమ్మూకశ్మీర్ శాంతిభద్రతలు, అమర్‌నాథ్ యాత్రకు సంబంధించిన సన్నాహాలపై వరుస సమీక్షా సమావేశాల అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ నుంచి మాతా వైష్ణోదేవీ ఆలయానికి వెళ్తున్న యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై రియాసి జిల్లాలో జూన్ 9న ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. డ్రైవర్‌కు బుల్లెట్ తగలడంతో బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మహిళలు సహా తొమ్మిది మంది మరణించారు. 41 మంది గాయపడ్డారు.

జార్ఖండ్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి

చైబాసా: జార్ఖండ్ రాష్ట్రం పశ్చిమ సింఘ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. గువా పోలీస్‌స్టేషన్ పరిధిలోని లిపుంగా ప్రాంతంలో సోమవారం ఉదయం 5 గంటల సమయంలో కాల్పులు చోటుచేసుకున్నట్లు ఐజీ అమోల్ వి హోంకార్ చెప్పారు. మావోయిస్టు పార్టీ ఏరియా కమాండర్ టైగర్ అలియాస్ పాండు హస్సా, బత్రి దేవ్‌గమ్‌లను అదుపులోకి తీసుకోవడంతోపాటు ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు ఎస్ఎల్ఆర్‌లు, మూడు రైఫిళ్లు, ఒక పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతులను జోనల్ కమాండర్ కండె హొన్హాగా, సబ్ జోనల్ కమాండర్ సింగ్‌రాయ్ అలియాస్ మనోజ్, ఏరియా కమాండర్ సూర్య అలియాస్ ముండా దేవ్‌గమ్, మహిళా నక్సల్ జుంగా పుర్తి అలియాస్ మర్లా, సప్ని హస్సాగా గుర్తించామన్నారు.

నిక్కీ హేలీ తండ్రి కన్నుమూత

ఫాదర్స్ డే రోజు ప్రొఫెసర్ అజిత్ సింగ్ మృతి

సౌత్ కరోలినా(యూఎస్ఏ): సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీకి పితృ వియోగం కలిగింది. తన తండ్రి ప్రొఫెసర్ అజిత్ సింగ్ రణ్‌ధవా(64) ఫాదర్స్ డే నాడు 16న తుదిశ్వాస విడిచారని ఆమె ప్రకటించారు. ఎంతో దయార్ద్ర హృదయం కలిగిన వ్యక్తిగా పేర్కొంటూ తన తండ్రిని హత్తుకున్నప్పటి ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. 'నా తండ్రి లేరనే విషయం తెలిసి నా హృదయం బరువెక్కింది. నలుగురు పిల్లలకు శ్రమించే తత్వం, విశ్వాసం, దయాగుణాలను ఆయన నేర్పారు. ముత్తాత, తాత, తండ్రి, భర్తగా ఆయన ఎంతో ప్రియమైన వ్యక్తి. హ్యాపీ ఫాదర్స్ డే డాడీ. మేమంతా మిమ్మల్ని కోల్పోతున్నాం' అని పేర్కొన్నారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న అజిత్ సింగ్.. నిక్కీ జీవితంలో ప్రతి నిర్ణయం వెనుక ప్రేరణగా నిలిచారు.

నేడు ఉత్తర కొరియాకు పుతిన్

● రెండు రోజుల పర్యటనను ధ్రువీకరించిన ఇరు దేశాలు
● గతేడాది రష్యాలో పర్యటించిన ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్


కిమ్‌తో పుతిన్ (ఫైల్)

సియోల్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం ఉత్తర కొరియాకు వెళ్లనున్నారు. కిమ్ ఆహ్వానం మేరకు పుతిన్ మంగళ, బుధవారాల్లో తమ దేశంలో పర్యటించనున్నట్లు కొరియన్ సెంట్రల్ అధికారిక న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రకటనను ఇరు దేశాలు ధ్రువీకరించాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు, ఉత్తర కొరియా ప్యాంగ్యాంగ్ క్షిపణుల పరీక్షల నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గతేడాది చివరలో ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ రష్యాలో పర్యటించడం సంచలనమైంది. ఉక్రెయిన్‌పై రష్యా తీవ్రమైన దాడులు చేస్తుండటంతో రష్యాకు అవసరమైన ఆయుధ సంపత్తిని ఉత్తర కొరియా సరఫరా చేస్తోందని, అందుకు బదులుగా రష్యా నుంచి అణు సాంకేతికతను పొందుతోందని దక్షిణ కొరియాతోపాటు అమెరికా ఆరోపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వమున్న రష్యా.. ఉత్తర కొరియాతో ఆయుధ వాణిజ్యం చేస్తే యూఎన్ తీర్మానాలను ఉల్లంఘించడమేనని అంటున్నాయి. అయితే, ఉత్తర కొరియా, రష్యా ఈ కథనాలను ఖండించాయి. కాగా, రష్యా అధ్యక్షుడు ఉత్తర కొరియాలో పర్యటించడం 24 ఏళ్లలో ఇది ప్రథమం. పుతిన్ మొదటిసారి జూలై 2000లో ఉత్తర కొరియాలో పర్యటించారు. మొదటి ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత, అప్పుడు ఉత్తర కొరియాను పాలిస్తున్న కిమ్ తండ్రి కిమ్ జోంగ్ ఇల్‌తో సమావేశమయ్యారు.

పుతిన్ కోసం విలాసవంతమైన వేడుక

1991లో సోవియట్ పతనం తర్వాత ఉత్తర కొరియాతో రష్యా సంబంధాలు బలహీనపడ్డాయి. కిమ్ జోంగ్ ఉన్ తొలిసారిగా 2019లో రష్యాలోని తూర్పు నౌకాశ్రయం వ్లాడివోస్టాక్‌లో పుతిన్‌తో సమావేశమయ్యారు. మళ్లీ పుతిన్, కిమ్‌లు ఇరుదేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. ఈ సంవత్సరం ప్రారంభంలో పుతిన్.. కిమ్‌కు హై–ఎండ్ ఆరస్సెనాట్ కారును పంపారు. ఇప్పుడు ఇరు దేశాల మధ్య అనుబంధాన్ని బయటి ప్రపంచానికి తెలిపేందుకు పుతిన్ కోసం విలాసవంతమైన వేడుకను కిమ్ సిద్ధం చేస్తున్నారు. రాజధాని ప్యాంగ్యాంగ్‌లోని ఒక చౌరస్తాలో భారీ కవాతు కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాలు తెలుపుతున్నాయని ఓ న్యూస్ వెబ్‌సైట్ విశ్లేషించింది. ఉక్రెయిన్‌పై యుద్ధం తరువాత పుతిన్‌ను స్వాగతించే దేశాలు తక్కువగా ఉన్నా.. ఉత్తర కొరియాలో పుతిన్ పర్యటన కిమ్ విజయం అంటున్నారు ఉత్తరకొరియా రాజకీయ విశ్లేషకులు. మాస్కోతో ఆర్థిక, ఇతర సహకారాలను పెంపొందించుకోవడానికి ఈ పర్యటనలు ఉపయోగపడతాయని చెబుతున్నారు.

దక్షిణ చైనా సముద్రంలో కలకలం

చైనా గస్తీ నౌకను ఢీకొట్టిన ఫిలిప్పీన్స్ సరుకు నౌక

బీజింగ్/మనీలా: దక్షిణచైనా సముద్రంలో గుత్తాధిపత్యం కోసం చైనా ప్రయత్నిస్తున్న వేళ ఆ సముద్రజలాల్లో సోమవారం జరిగిన ఓడల ప్రమాదం ఇరుదేశాల మధ్య మాటల మంటలు రాజేసింది. మీ వల్లే ప్రమాదం జరిగిందని ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్నారు. దక్షిణచైనా సముద్రంపై తమకు హక్కు ఉందని ఫిలిప్పీన్స్, మలేసియా, వియత్నాం, బ్రూనై, తైవాన్‌లు అంతర్జాతీయ స్థాయిలో వాదిస్తున్న విషయం విదితమే. రెండు ఓడల ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

అసలేం జరిగింది?

నన్షా ద్వీపాల సమీపంలోని రెనాయ్ జియో పగడపు దిబ్బ దగ్గర తమ గస్తీ నౌక ఉందని తెల్సికూడా ఉద్దేశపూర్వకంగా అదే దిశలో దూసుకొచ్చి ఫిలిప్పీన్స్‌కు చెందిన సరకు రవాణా నౌక ఢీకొట్టిందని చైనా కోస్ట్ గార్డ్(సీసీజీ) ఆరోపించింది. చైనా కొత్త చట్టం ప్రకారం అనధికారికంగా ప్రయాణించిన ఆ నౌకపై మేం నియంత్రణ సాధించామని సీసీజీ ప్రకటించింది. చైనా చర్యను ఫిలిప్పీన్స్ తీవ్రంగా తప్పుబట్టింది. ''చైనా విధానాలు వాస్తవ పరిస్థితిని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి. సమీపంలోని సెకండ్ థామస్ షావల్ స్థావరంలోని మా బలగాలకు సరకులు, నిర్మాణ సామగ్రిని తీసుకెళ్తున్న మా నౌకకు అడ్డంగా చైనా వారి నౌకను నిలిపింది'' అని ఫిలిప్పీన్స్ సాయుధ విభాగ అధికార ప్రతినిధి ఎరేస్ ట్రినిడాడ్ వెల్లడించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం గతంలో ఫిలిప్పీన్స్ ప్రత్యేక ఆర్థిక మండలి(ఈఈజెడ్) పరిధిలో ఉండేది. 2012 ఏడాదిలో ఈ ప్రాంతాన్ని చైనా ఆక్రమించింది. అప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. దక్షిణ చైనా సముద్రజలాల గుండా ప్రయాణించే పొరుగుదేశాల సరకు రవాణా నౌకలపై తరచూ జల ఫిరంగులను ప్రయోగిస్తూ చైనా నావికాదళాలు తెగ ఇబ్బంది పెట్టడం తెల్సిందే. విదేశీ నౌకల సిబ్బందిని ఎలాంటి ముందస్తు విచారణ లేకుండా 60 రోజులపాటు నిర్బంధించేలా చేసిన చట్టం అమల్లోకి వచ్చిన రెండు రోజులకే ఈ ప్రమాదం జరగడం గమనార్హం.

వార్ కేబినెట్‌ను రద్దు చేసిన నెతన్యాహూ



టెల్ అవీవ్: యుద్ధక్షేత్రంలో ముందుకు దూసుకెళ్తున్న ఇజ్రాయెల్ సైనిక బలగాలకు సూచనలు చేసే కీలకమైన వార్ కేబినెట్‌ను సోమవారం ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అనూహ్యంగా రద్దుచేశారు. దీంతో గాజాస్ట్రిప్‌లో సైనికులు అనుసరించాల్సిన వ్యూహాలు, వారికి పూర్తి స్వేచ్ఛనిస్తూ తుది నిర్ణయాలను ఇకపై ఎవరు తీసుకుంటారన్న దానిపై సర్వత్రా చర్చ నెలకొంది. విపక్ష నేతలు ఈ యుద్ధ మండలి నుంచి వైదొలగడమే వార్ కేబినెట్ నిర్వీర్యానికి అసలుకారణమని తెలుస్తోంది. హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడి చేసి 1,200 మంది ఇజ్రాయెలీలను పొట్టనబెట్టుకోవడంతో ఇజ్రాయెల్‌లోని విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. గాజా స్ట్రిప్‌పై దురాక్రమణకు తెగబడిన ఇజ్రాయెల్ సేనలకు బాసటా నిలిచాయి. దేశంపై దాడి నేపథ్యంలో రాజకీయపక్షాల మధ్య ఐక్యత ఉందని చాటుతూ ప్రభుత్వానికి మద్దతుపలుకుతూ నెతన్యాహూ ఏర్పాటుచేసిన వార్ కేబినెట్‌లో సభ్యులుగా నెతన్యాహూకు బద్ధ శత్రువులైన విపక్ష నేతలు బెన్నీ గాంట్జ్ తదితరులు చేరారు. గాంట్జ్, నెతన్యాహూ, రక్షణ మంత్రి మొఆవ్ గాలంట్‌లు వార్ కేబినెట్‌లో కీలక సభ్యులుగా ఉండేవారు. అయితే ఇటీవలి కాలంలో యుద్ధంలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని వేలాది మంది అమాయక పాలస్తీనియన్లను చంపేస్తోందని ప్రపంచదేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా సైతం పౌరనష్టంలేని సైనిక చర్యకే మొగ్గుచూపింది. బందీలను విడిపించడంపై దృష్టి సారించాల్సింది పోయి హమాస్ అంతం తమ లక్ష్యమన్నట్లు ఇజ్రాయెల్ సేనలు వ్యవహరిస్తున్నారని విపక్ష నేతలు బెన్నీ గాంట్జ్ తదితరులు నెతన్యాహూ ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కాల్పుల విరమణకు నెతన్యాహూ ససేమిరా అనడంతో యుద్ధ రీతులు మారిపోయాయని భావించి బెన్నీ తదితరులు కేబినెట్ నుంచి వైదొలిగారు.

పాఠ్యపుస్తకాల్లో లింగసమానత్వ చిత్రాలు

పురుషులు ఇంటిపనుల్లో ఉన్నట్లు పుస్తకాల్లో ఫొటోల ముద్రణ

కొచ్చి: వంటగది అనగానే అమ్మ వండుతున్నట్లు చూపే ఫొటోలు పాఠ్యపుస్తకాల్లో ముద్రిస్తుంటారు. ఇలాంటి ధోరణికి చెల్లుచీటి ఇస్తూ కేరళ ప్రభుత్వం లింగసమానత్వ చిత్రాలకు పాఠశాల పాఠ్యపుస్తకాల్లో చోటు కల్పించింది. అమ్మ అంటే ఉద్యోగం చేయదని, ఇంట్లోనే ఉంటుందనే భావన బడీడు పిల్లల్లో నాటుకుపోకుండా ఉండేందుకు, సమానత్వాన్ని వారి మెదడులో పాదుకొల్పేందుకు కేరళ సర్కార్ కృషిచేస్తోంది. ఈ ప్రయత్నానికి ఉపాధ్యాయుల నుంచి మద్దతు లభిస్తోంది. మూడో తరగతి మలయాళం మాధ్యమం పాఠ్యపుస్తకం పేజీలను కేరళ సాధారణ విద్యాశాఖా మంత్రి వి.శివాన్ కుట్టి సోషల్‌మీడియాలో షేర్‌చేశారు. తండ్రి వంటింట్లో కూర్చుని పచ్చి కొబ్బరి తురుము తీస్తున్నట్లు ఒక పేజీలో డ్రాయింగ్ ఉంది. తన కూతురు కోసం తండ్రి అల్పాహారం సిద్ధంచేస్తున్నట్లు మరో పేజీలో డ్రాయింగ్ ఉంది. ఇంటి పనిలో పురుషులు ఎంత బాధ్యతగా ఉండాలని ఈ చిత్రాలు చాటిచెబుతున్నాయని నెటిజన్లు మెచ్చుకున్నారు.

రాజ్‌భవన్ ఆవరణను తక్షణమే ఖాళీ చేయండి

కోల్‌కతా పోలీసులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా: రాజ్‌భవన్ వద్ద బందోబస్తు విధుల్లో ఉండే కోల్‌కతా పోలీసు సిబ్బంది తక్షణమే అక్కడి నుంచి ఖాళీ చేయాలని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్ సోమవారం ఉదయం ఆదేశాలు జారీ చేశారు. రాజ్‌భవన్ నార్త్‌గేట్ వద్ద ఉన్న పోలీస్ ఔట్ పోస్టును ప్రజావేదికగా మార్చాలని గవర్నర్ భావిస్తున్నట్లు సమాచారం. గవర్నర్, మమతా బెనర్జీ మధ్య విభేదాలు కొనసాగుతున్న సమయంలోనే ఇటీవల చోటుచేసుకున్న ఒక పరిణామమే దీనికి కారణమని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై గవర్నర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన సువేందు అధికారి సారథ్యంలోని బీజేపీ నేతల బృందాన్ని రాజ్‌భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయంటూ బీజేపీ నేతలను వెనక్కి పంపించి వేశారు. గవర్నర్ రాతపూర్వకంగా అనుమతి ఇచ్చినప్పటికీ పోలీసులు ఇలా వ్యవహరించడం వివాదస్పదమైంది. దీనిపై సువేందు కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించడం.. గవర్నర్‌ను గృహ నిర్బంధంలో ఉంచారా అంటూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

కశ్మీర్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్‌ల్లో మరికొద్ది నెలల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీలు, సహ ఇన్‌చార్జీలను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. జమ్మూకశ్మీర్ బాధ్యతలను కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి అప్పగించారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఇన్‌చార్జిగా పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను, సహ ఇన్‌చార్జిగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను నియమించారు. జార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహ ఇన్‌చార్జిగా అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వ్యవహరించనున్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు, సహ ఇన్‌చార్జి బాధ్యతలను త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బిప్లబ్ కుమార్ దేబ్‌కు అప్పగించారు.

పన్నూ హత్యకు కుట్ర ఆరోపణలు.. అమెరికాకు నిఖిల్ గుప్తా అప్పగింత

వాషింగ్టన్: ఖలిస్తానీ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తాను చెక్ రిపబ్లిక్ గత వారం అమెరికాకు అప్పగించింది. గుర్తు తెలియని భారతీయ అధికారి ఆదేశాల మేరకు కెనడా, అమెరికా ద్వంద పౌరసత్వమున్న పన్నూను అమెరికా గడ్డపైనే చంపేందుకు నిఖిల్ గుప్తా కిరాయి హంతకుడికి డబ్బులిచ్చినట్లు అమెరికా ఆరోపిస్తోంది. అమెరికా ప్రభుత్వ వినతి మేరకు చెక్ రిపబ్లిక్‌లో ఉన్న నిఖిల్‌ను అక్కడి ప్రభుత్వం గత ఏడాది అరెస్ట్ చేసింది. అయితే, అమెరికా ఆరోపణలను భారత్ ఖండించింది. నిఖిల్ ప్రస్తుతం అమెరికాలోని బ్రూక్లిన్‌లో ఫెడరల్ మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉన్నారు.

నేడు వారణాసికి ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధానిగా వరుసగా మూడో విడత బాధ్యతలు చేపట్టిన మోదీ ఈ నెల 18న మొదటిసారిగా తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించనున్నారు. వారణాసిలో జరిగే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ పథకం కింద 17వ విడతలో రూ.20 వేల కోట్ల నిధులను దేశవ్యాప్తంగా ఉన్న రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. 'కృషి సఖి'లుగా శిక్షణ పొందిన స్వయం సహాయక బృందాల మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 7 గంటలకు దశాశ్వమేధ ఘాట్‌లో జరిగే గంగా ఆరతి కార్యక్రమంలో పాల్గొంటారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 18 । జూన్ । 2024



ఎయిర్‌పోర్టులో డ్యూటీ ఫ్రీ అదనపు స్టోర్

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మరో అదనపు డ్యూటీ ఫ్రీ షాప్‌ను ఏర్పాటు చేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. గేట్‌–30 వద్ద ఏర్పాటు చేసిన మరో డ్యూటీ ఫ్రీ షాప్‌లో సరి కొత్త షాపింగ్ అనుభూతిని పొందవచ్చన్నారు.



కొత్త కిరికిరి!

కంటోన్మెంట్ విలీనం వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. అటు ప్రభుత్వాల ప్రకటన..ఇటు ఎన్నికల ప్రక్రియ తీరు చూస్తుంటే..అసలు విలీనం ఉన్నట్టా..లేనట్టా అనే సందేహం కలుగుతోంది. –8లో

గరిష్టం/కనిష్టం
35.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు, సాయంత్రం/రాత్రి వేళల్లో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

బంగారు బోనం కోసం ఏర్పాట్లు షురూ



నిషా క్రాంతికి వాయినం అందజేస్తున్న అంజయ్య దంపతులు

చార్మినార్: రానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా మాదిరిగానే సప్త మాతృకలకు సప్త బంగారు బోనం సమర్పించేందుకు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా బంగారు పాత్రలోని నైవేద్యాన్ని ఏడు అమ్మవారి ఆలయాలకు తీసుకెళ్లి సమర్పించేందుకు జోగిని నిషా క్రాంతికి సోమవారం మీరాలంమండిలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు వాయినాన్ని అందజేశారు. జులై 7న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో బంగారు బోనం కార్యక్రమాలు ప్రారంభమవుతాయని గాజుల అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ మాజీ చైర్మన్ పాటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళసూత్రం పోయిందని వస్తే...

వెంగళరావునగర్: మంగళసూత్రం దొంగిలించారని ఫిర్యాదు చేయడానికి వెళ్లిన మహిళను పోలీసులు నాలుగు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన సంఘటన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బర్కత్‌పురలో నివాసం ఉంటున్న శ్రీరేఖ ఈ నెల 15న స్థానిక మధురానగర్‌లోని తన బంధువుల వద్దకు వచ్చింది. 16వ తేదీ తన సోదరునితో కలిసి రైతుబజార్‌కు వెళ్లి కూరగాయలు తీసుకుని ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి చూసుకోగా తన మంగళసూత్రం కనిపించలేదు. హుటాహుటిన రైతుబజార్‌కు వెళ్లి విచారించినా ఫలితం లేదు. ఆమె సమీపంలోని సనత్‌నగర్ పీఎస్‌కు వెళ్లగా అది తమ పరిధి కాదని ఎస్‌ఆర్‌నగర్‌కు పంపారు. ఎస్‌ఆర్‌నగర్ పీఎస్‌కు వెళ్లగా ఆ ఏరియా బోరబండ పీఎస్ పరిధిలోకి వస్తుందని వెనక్కు పంపారు. తిరిగి బోరబండకు వెళ్లి ఫిర్యాదు చేయగా అక్కడ కూడా నిరాశే ఎదురైంది. ఆ పీఎస్‌లో కూడా ఫిర్యాదు తీసుకోకుండా మధురానగర్‌కు పంపారు. చివరకు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అసలే మంగళసూత్రం పోగొట్టుకుని బాధలో ఉన్న మహిళను నాలుగు పీఎస్‌లకు తిప్పడం ఎంతవరకు సబబని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు..

మల్లేపల్లి ఐటీఐలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్

నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన



నాంపల్లి: పారిశ్రామిక శిక్షణా సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ముందుకు దూసుకెళ్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టడానికి టాటా కంపెనీతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కోర్సుల నిర్వహణ కోసం అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం మల్లేపల్లిలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటిఐ) ప్రాంగణంలో 13500 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సెంటర్స్‌లో ఆరు రకాల దీర్ఘకాలిక కోర్సులను ప్రవేశపెడతారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిషన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులను ప్రవేశపెట్టి తర్ఫీదు ఇస్తారు. వీటితో పాటుగా మరో 20 స్వల్ప, అతి స్వల్ప కాల వ్యవధి కలిగిన కోర్సులను కూడా ప్రవేశపెడతారు. వీటిలో నిరుద్యోగ యువతకు రెండేళ్ల పాటు శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్స్‌ను కూడా కల్పిస్తారు. కాగా మంగళవారం సీఎం కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

'మహాగణపతి' పనులకు శ్రీకారం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి రూపకల్పన పనుల్లో భాగంగా ప్రతి యేటా నిర్వహించే కర్ర పూజ కార్యక్రమం సోమవారం సాయంత్రం 5 గంటలకు మహాగణపతి మంటపంలో నిర్వహించారు. జేష్ట శుద్ధ ఏకాదశి సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో స్థానిక నాయకుల సమక్షంలో కర్రపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ 70 సంవత్సరాల ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలను ఈ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కర్రపూజా కార్యక్రమాన్ని స్థానిక అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, రెండు మూడు రోజుల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలోనే ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ హితంగా వినాయకుడి విగ్రహం తయారు చేస్తామని, అన్ని ప్రభుత్వరంగ సంస్థలను కలుపుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు దానం నాగేందర్ తెలిపారు. మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే ప్రతి భక్తుడికి ప్రసాదాన్ని అందేలా చూస్తామని తెలిపారు. పూజా కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.



కర్రపూజ కార్యక్రమంలో పాల్గొన్న దానం నాగేందర్ తదితరులు



మీరాలం ఈద్గా వద్ద చిన్నారుల సందడి



మక్కా మసీదు వద్ద..

ఈద్ ముబారక్

నగర వ్యాప్తంగా సోమవారం బక్రీద్ ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. మీరాలం ఈద్గాతో పాటు మక్కా మసీదు, మాదన్నపేట్ ఈద్గాలలో ముస్లింలు భారీ సంఖ్యలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగింది. ఉదయం 8 గంటల నుంచి ప్రార్థనలు ముగిసేంత వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. – చార్మినార్



చార్మినార్ వద్ద..

'ఫేక్' రికగ్నిషన్!

బల్దియాలో ప్రహసనంగా సిబ్బంది అటెండెన్స్ నిర్వహణ

- పేరుకే ఐటీ...నిధులు లూటీ
- పనితీరు లోపాలతో అక్రమార్కులకు దారులు
- నిన్న బయోమెట్రిక్..నేటి ఫేస్ రికగ్నేషన్ సిస్టం సైతం వృథానే...

సాక్షి, సిటీబ్యూరో: ఏటా వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్న జీహెచ్‌ఎంసీలో ఐటీ విభాగం నామమాత్రంగా మారింది. పేరుకు ఐటీ విభాగం, దాని అడిషనల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి, తగినంత సిబ్బంది ఉన్నా అనేక అంశాల్లో తరచూ ఇబ్బందులెదురవుతున్నాయి. అంతే కాదు..పారిశుధ్యకార్మికుల వేతనాల చెల్లింపుల్లో బోగస్‌లకు జీతాలందేందుకూ ఐటీ నిర్వాకమే కారణమని తెలుస్తోంది. పారిశుధ్య కార్మికులకు 2017 నుంచే పూర్తిస్థాయి బయో మెట్రిక్ హాజరును అమలు చేస్తున్నప్పటికీ, నాటి నుంచి ఇప్పటి వరకు బోగస్‌లను గుర్తించలేకపోయారు. హాజరులో అక్రమాలను అరికట్టలేకపోయారు. గత మార్చి వరకు బయోమెట్రిక్ మెషిన్ల పేరిట, ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తెచ్చిన ఫేషియల్ రికగ్నిషన్ యాప్ పేరిట లక్షలకు లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ అవినీతిని అరికట్టలేకపోయారు. అవినీతిని అరికట్టడంతో పాటు పారిశుధ్య కార్మికులంతా తప్పకుండా విధుల్లోకి ఉండేలా చేస్తే..పారిశుధ్యం మెరుగవుతుందనే ఉద్దేశంతో బయోమెట్రిక్‌ను, దానికంటే కచ్చితత్వం కోసమని ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. కానీ అక్రమాలను అరికట్టలేకపోయారు. పైపెచ్చు పెచ్చుమీరి పోతున్నాయి. ఫేషియల్ రికగ్నిషన్ యాప్ నిర్వహణకు నిధులు ఖర్చవుతున్నా, తొందరపాటు చర్యల వల్ల బోగస్‌లకూ హాజరు నమోదవుతూ వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. ఇలా రెండు విధాలుగా జీహెచ్‌ఎంసీ ఖజానా గుల్ల అవుతోంది. ఏ కొత్త పథకాన్నయినా ప్రారంభించే ముందు పైలట్ ప్రాజెక్టుగా కొంత పరిధి వరకు, కొంతకాలం నిర్వహించి అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే నగరం మొత్తానికి అమలు చేయాల్సి ఉండగా, ఫేషియల్ రికగ్నిషన్ విషయంలో తొందరపాటు ప్రదర్శించారు. పైలట్ పనులు మొక్కుబడిగా మమ అనిపించారు. దాంతో బయోమెట్రిక్ కంటే ఈజీగా బోగస్‌లకు హాజరు నమోదవుతోంది.

మొబైల్‌లో ఫొటో ఉన్నా 'ఫేస్' రీడింగ్..

ఫేషియల్ రికగ్నిషన్‌తో హాజరు అంటే పనిచేసే కార్మికులు రోజూ విధులకు హాజరై యాప్‌లో తమ ముఖం చూపితేనే హాజరు పడాలి. కానీ.. సెల్‌ఫోన్ గ్యాలరీలో ఉంచిన ఫొటోతో కూడా హాజరు నమోదవుతోందంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు. ఫొటోలున్న ఫోన్‌తో కార్మికులు పనిచేయాల్సిన లొకేషన్‌కు వెళ్తే చాలు హాజరు నమోదవుతున్నట్లు తెలిసింది. ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో విధులకు రాకున్నా కొందరికి హాజరు పడుతుండటంతో తమకు కూడా అలాంటి సదుపాయం కల్పించాలని కొందరు కార్మికులు తమకు సూపర్‌వైజర్‌గా వ్యవహరించే ఎస్‌ఎఫ్‌ఏను కోరారు. అందుకు నిరాకరించడంతో, ఎస్‌ఎఫ్‌ఏకు, కార్మికుల మధ్య చెలరేగిన విభేదాలతో ఈ అక్రమాల వ్యవహారం రచ్చ కెక్కింది. ఈ వ్యవహారం కేవలం ఈ సర్కిల్‌కే పరిమితం కాలేదని , మరికొన్ని సర్కిళ్లలోనూ ఇదే తంతు జరుగుతున్నట్లు జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. విధులకు రాని కార్మికులకు హాజరు వేస్తున్న ఎస్‌ఎఫ్‌ఏలు వారికి నెలకు మూడు, నాలుగు వేలు మాత్రం చెల్లిస్తూ, మిగతా మొత్తం తమ జేబులో వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అలా ఒక్కో కార్మికుని పేరిట కనీసం దాదాపు రూ.10 వేలకు పైగా పొందుతున్నారు. తనిఖీల్లో భాగంగా కొందరు ఎస్‌ఎఫ్‌ఏల ఫోన్లలో సదరు కార్మికుల ఫొటోలు నిర్ణీత సైజులో ఉన్నట్లు అధికారులు గుర్తించి, వాటిని తొలగించినట్లు సమాచారం. దాదాపు 30 మంది ఎస్‌ఎఫ్‌ఏల ఫోన్ల నుంచి వీటిని తొలగించినప్పటికీ, ఇంకా ఎంతమంది వద్ద ఇలాంటి ఫొటోలున్నాయనేది వెల్లడి కావాల్సి ఉంది. ఒక్కో ఎస్‌ఎఫ్‌ఏ కింద 21 మంది కార్మికులు ఉండాల్సి ఉండగా, చాలామంది వద్ద 15 మందికి మించి ఉండరనేది బహిరంగ రహస్యమే. వేలిముద్రల బయోమెట్రిక్‌లు అమలు చేసినప్పుడు సింథటిక్ వేలిముద్రలను తయారు చేసి అక్రమాలకు పాల్పడ్డారు. అవకతవకలు గుర్తించి కార్మికుల బయోమెట్రిక్‌ను ఆధార్‌తో అనుసంధానం చేశారు. అయినా ఐరిస్ క్యాచ్‌చేయడం లేదని, ఫింగర్‌ప్రింట్స్ పడటం లేవని వివిధ కారణాలతో దాంట్లోనూ అక్రమాలకు తెరలేపారు. ఈనేపథ్యంలో ఎలాంటి అక్రమాలకూ తావుండదంటూ ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ మూణ్నాళ్లకే ఫేక్ రికగ్నిషన్‌గా మారింది.

జీహెచ్‌ఎంసీలో 17,092 మంది పారిశుధ్యకార్మికులుండగా, ఫేస్ రికగ్నిషన్ హాజరు కోసం ఏప్రిల్ 5 వరకు యాప్‌లో నమోదైన వారు 16,850 మంది కాగా, హాజరు 65 శాతమే ఉంది. ప్రస్తుతం నమోదైన వారు పెరగడంతో పాటు హాజరు శాతం సైతం 75 శాతం దాటినట్లు తెలుస్తోంది. అంటే పెరిగిన హాజరు బోగస్‌లదో, నిజమైన వారో అధికారుల విచారణలోనే వెల్లడి కానుంది.

అసలా.. బోగసా?



ఒక్కరికే మూడు విధులు

ప్రస్తుతం ఐటీ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నవారే శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా, రెవెన్యూ విభాగం అడిషనల్ కమిషనర్‌గా కూడా ఉన్నారు. రెండు కార్యాలయాల నుంచి మూడు ప్రధాన విభాగాల బాధ్యతలు ఒక్కరికే కట్టబెట్టడంలో ఆంతర్యం అంతుబట్టదు. ప్రధాన కార్యాలయంలో ఐటీ విభాగాన్ని శ్రద్ధతో పట్టించుకునే పరిస్థితీ లేకపోవడంతో ట్యాక్స్‌ల నుంచి బర్త్, డెత్ సర్టిఫికెట్ల దాకా ఫిర్యాదులు కోకొల్లలు. అయినా ఐటీని బలోపేతం చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించలేదు. కొందరికి లూప్‌లైన్ బాధ్యతలిచ్చి, కొందరికి మాత్రం రెండు మూడు కీలక విభాగాల బాధ్యతలప్పగించడం, అధిక బాధ్యతలున్న వారి విభాగాల్లో అవినీతి పెచ్చరిల్లుతుండటం బల్దియాలో హాట్ టాపిక్‌గా మారింది.

అవకతవకలపై చర్యలేవీ..

ఒకసారి కాదు..రెండుసార్లు కాదు. పలు పర్యాయాలు బయోమెట్రిక్‌లో బోగస్ హాజరును గుర్తించారు. పోలీసు కేసులూ నమోదయ్యాయి. అయినా ఎవరిపైనా తగిన చర్యలు లేక ఈ అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. ఎస్‌ఎఫ్‌ఏల నుంచి వారి పై స్థాయిలోని ఏఎంఓహెచ్‌ల వరకు అక్రమాల్లో వాటాలున్నాయని లోకం కోడై కూసినా ఏనాడూ పట్టించుకోలేదు. ఏఎంఓహెచ్‌లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయకపోవడం, ఎస్‌ఎఫ్‌ఏలకు వారి ఆశీస్సులుండటంతో ఆడింది ఆటగా సాగుతోంది.

డీసీపీలకు స్థాన చలనం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న పలువురు డీసీపీలను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్, ఆ తరువాత ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత, పార్లమెంట్ ఎన్నికల కోడ్ సమయంలో ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. తాజాగా మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిలో 'గ్రేటర్'కు చెందిన డీసీపీలు ఉన్నారు. ఇంకా కొన్ని స్థానాల్లో అధికారులను నియమించాల్సిన అవసరం ఉంది. త్వరలో మరో విడత బదిలీలు జరిగే అవకాశం ఉంది.



- హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పని చేస్తున్న సుబ్బారాయుడు బదిలీ కాగా, ఆయన స్థానంలో సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డేను నియమించారు. సుబ్బారాయుడిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.
- టాస్క్‌ఫోర్స్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్‌ను బదిలీ చేస్తూ ఆమెను సిటీ నార్త్‌జోన్ డీసీపీగా నియమించారు. నార్త్‌జోన్ డీసీపీగా పనిచేస్తున్న రోహిణి ప్రియదర్శినిని 7వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు.
- సౌత్‌ఈస్ట్‌జోన్ డీసీపీ జానకీ దరవాత్‌ను మహబూబ్‌నగర్ ఎస్పీగా బదిలీ చేశారు.
- బాలానగర్ జోన్ డీసీపీ టి.శ్రీనివాస్‌రావు జోగులాంబ గద్వాల్ జిల్లా ఎస్పీగా బదిలీ కాగా ఆయన స్థానంలో కె.సురేష్‌కుమార్‌ను నియమించారు.
- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డిని వికారాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్ఐబీ ఎస్పీ బి.రాజేష్‌ను నియమించారు. వికారాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న ఎస్.కోటిరెడ్డిని మేడ్చల్ డీసీపీగా బదిలీ చేశారు.



ఖైరతాబాద్‌లో..



అత్తాపూర్‌లో..



పంజాగుట్టలో..



బేగంపేట ప్రధాన రహదారిలో నిలిచిన ట్రాఫిక్..

సిటీలో జోరు వాన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. గచ్చిబౌలి, షేక్‌పేట, ఖైరతాబాద్, పంజగుట్ట, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎర్రగడ్డ, గండిపేట, శివరాంపల్లి, ఎల్బీనగర్, మన్సూరాబాద్, నాగోల్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇక లంగర్‌హౌస్‌లో 5.8, మెహిదీపట్నం 5.7, యూసుఫ్‌గూడ 5.2, తుర్కయంజాల్ 4.7, షేక్‌పేట 4.6, బంజారా హిల్స్‌లో 4.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



అమీర్‌పేటలో..

కొత్త కిరికిరి!



విలీనం ఉన్నట్టా.. లేనట్టా?

- ఎన్నికల కసరత్తు ప్రారంభించడంతో కొత్త సందేహాలు
- గతేడాది అర్ధంతరంగా నిలిచిన ఎన్నికల ప్రక్రియ
- రోజుకో మలుపు తిరుగుతున్న కంటోన్మెంట్ రాజకీయం

కంటోన్మెంట్: ఓ పక్క త్వరలో విలీనం అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటన.. మరో పక్క ఎన్నికల ప్రక్రియ చేపట్టేందుకు సంసిద్ధమవుతున్న యంత్రాంగం.. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న చట్ట సవరణ.. ప్రజా ప్రాతినిథ్యం లేకుండానే సాగుతున్న పాలన.. కంటోన్మెంట్‌లో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. కంటోన్మెంట్‌లలో అతిపెద్దదైన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో అయోమయ పరిస్థితి నెలకొంది. పేరుకే ప్రజాప్రాతినిధ్యం ఉన్నప్పటికీ పెత్తనమంతా మిలటరీ పాలకులదే... మిలటరీ భద్రత పేరిట సామాన్యులు అనేక ఆంక్షలతో సతమతం అవుతున్నారు..

ప్రశ్నార్థకంగా మనుగడ...

బ్రిటిష్ పాలనావశేషంగా కొనసాగుతున్న కంటోన్మెంట్‌లు త్వరలోనే కనుమరుగయ్యే అవకాశముంది. ప్రస్తుతం దేశంలో 61 (ఇటీవలే ఒకటి మున్సిపాలిటీగా మారింది) ఉన్నాయి. కంటోన్మెంట్‌లను ఎక్స్‌క్లూజివ్ మిలటరీ స్టేషన్‌లుగా ఏర్పాటు 2017 లోనే కేంద్రం నిర్ణయం తీసుకుంది. రెండేళ్ల క్రితమే ఈ విషయంలో స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు కార్యాచరణ చేపట్టింది. ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనం చేపట్టాలని గత జనవరిలోనే కేంద్రం కార్యాచరణ మొదలుపెట్టింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన కమిటీ ఒకే ఒకసారి భేటీ అయ్యింది. అయితే ఈ సమావేశంలో ఏం చర్చించారో ఇప్పటికీ బహిర్గతం కాలేదు. ఈ నేపథ్యంలో అసలు విలీనం జరగుతుందా? కంటోన్మెంట్‌లు యథావిధిగానే కొనసాగుతాయా? అనే సందిగ్ధం కొనసాగుతోంది.

చట్టాన్ని మార్చేస్తామంటూ..

కంటోన్మెంట్ చట్టంలో కీలక మార్పులు చేపట్టేందుకు కేంద్రం 2020 లోనే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ మేరకు ది కంటోన్మెంట్ బిల్ -2020 పేరిట రూపొందించిన డ్రాఫ్ట్ బిల్లుపై ప్రజాభిప్రాయం కూడా సేకరించింది. ఈ బిల్లును నాలుగేళ్లుగా పలుమార్లు పార్లమెంట్ సమావేశాల్లో ఎజెండాలో చేర్చడం మినహా ఎలాంటి పురోగతి లేదు.

విలీనానికి అడ్డంకులెన్నో

కేంద్రంలో నూతన ప్రభుత్వం కొలువుతీరాక 100 రోజుల ప్రణాళికలో భాగంగా విలీనంపై తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికిప్పుడే విలీనంపై నిర్ణయం తీసుకుని, అమలు చేయడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశ వ్యాప్తంగా రక్షణ భూముల బదలాంపు కోసం కొన్నేళ్ల క్రితం కేంద్రం ప్రత్యేక నిబంధనలు రూపొందించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం లేదా ఇతరత్రా ప్రభుత్వ రంగం సంస్థలకు బదలాయించే రక్షణ భూములకు ఈక్వల్ వ్యాల్యూ ఆఫ్ లాండ్ లేదా అంతే విలువైన సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. కంటోన్మెంట్‌లో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన 150 ఎకరాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1,500 కోట్లకు పైగా నిధులు చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసుకుంటే బోర్డు ఆధ్వర్యంలోని సుమారు 700 ఎకరాల రక్షణ స్థలానికి రూ.7 వేల కోట్లకు పైగా వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం విలీనానికి ముందుకొచ్చే పరిస్థితులు లేవని తెలుస్తోంది.

ఇలా అయితే ఒకే!

రక్షణ భూముల బదలాయింపునకు కేంద్రం రూపొందించిన నిబంధనల మేరకు సమాన విలువ కలిగిన భూమి రక్షణ శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని భూముల విలువ ఎకరానికి రూ.10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ మేరకు ఎలివేటెడ్ కారిడార్‌కు కేటాయించిన 150 ఎకరాలతో పాటు కంటోన్మెంట్ బోర్డు ఆధీనంలోని 'సీ' కేటగిరికి చెందిన స్థలాలు 200 ఎకరాల వరకు ఉన్నాయి. దీనికి తోడు ఓల్డ్ గ్రాంట్ బంగళాల పేరిట మరో 500 ఎకరాల రక్షణ భూమి ఉంది. ఇందులో సగానికిపైగా అక్రమమార్గంలో ప్రైవేటు వ్యక్తుల కబ్జాలోకి వెళ్లాయి. ఈ మొత్తం భూములను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే సుమారు 750 ఎకరాల విలువైన ప్రత్యామ్నాయ స్థలాలను రక్షణ శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే నగరంలో మిదానీ సమీపంలో 'రీసెర్చ్ సెంటర్ ఇమారత్'కు ఆధీనంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 2000 ఎకరాలు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కంటోన్మెంట్ పరిధిలోని ప్రతిపాదిత స్థలాలతో పాటు సుచిత్ర సమీపంలోని 700 ఎకరాల్లో విస్తరించి ఉన్న మిలటరీ డెయిరీఫామ్ స్థలాన్ని తమకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఈ ప్రతిపాదనలకు రక్షణ శాఖ అంగీకరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి భారం లేకుండా కంటోన్మెంట్ విలీన ప్రక్రియ సాఫీగా సాగే అవకాశముంది.

అన్నింటా అస్పష్టత

సుమారు 4 లక్షల జనాభా కలిగిన ఈ ప్రాంతానికి మిలటరీ ఆంక్షల నుంచి విముక్తి కల్పించేందుకు జీహెచ్‌ఎంసీలో విలీనానికి ఇటీవలే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం విలీనానికి సిద్ధమంటూ ప్రకటించాయి. రాష్ట్రంలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలూ అనుకూలంగా ఉన్నప్పటికీ ఏడాదిన్నర కాలంగా విలీనానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో మూడున్నరేళ్లుగా బోర్డు ఎన్నికలు సైతం నిర్వహించడం లేదు. కంటోన్మెంట్‌లో చట్టంలో మార్పులతో కేంద్రం తీసుకొచ్చిన బిల్లుకు సైతం పార్లమెంట్‌లో మోక్షం లభించడం లేదు.

ఎన్నికలపై ఊగిసలాట

కంటోన్మెంట్‌లో ఓటర్ జాబితా సవరణకు అధికారులు చర్యలు చేపట్టడంతో మరోసారి ఎన్నికల ఊహాగానాలు మొదలయ్యాయి. గతేడాది ఫిబ్రవరిలో అర్ధంతరంగా నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియను తిరిగి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

విలీనమే శరణ్యం



సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే మెజారిటీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కంటోన్మెంట్ ప్రజలకు మెరుగైన ప్రజాపాలన అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నేరుగా అమలు చేసేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవు. కంటోన్మెంట్ విలీనానికి సిద్ధమంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదివరకే ప్రకటించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి, వీలనంత త్వరగా కంటోన్మెంట్ వాసుల కల నెరువేరుస్తారని ఆశిస్తున్నా.

–శ్రీగణేశ్, ఎమ్మెల్యే

ఎన్నికలతో విలీనానికి ఆటంకం



కంటోన్మెంట్ ప్రజల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చిన్న చూపు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ విలీనం చేయాలన్న ఏకైక లక్ష్యంతోనే కంటోన్మెంట్ వికాస్‌మంచ్ ఏర్పాటు చేశాం. ఎట్టకేలకు విలీనానికి అనుకూలంగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందుకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో బోర్డు ఎన్నికలు నిర్వహిస్తే విలీన ప్రక్రియకు విఘాతం కలిగే ప్రమాదముంది.

–సంకి రవీందర్, కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి

విలీనంతో లాభం లేదు



కంటోన్మెంట్‌తో పోలిస్తే జీహెచ్‌ఎంసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో విలీనం వల్ల కంటోన్మెంట్‌కే నష్టం. విలీనంతో సంబంధం లేకుండానే కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేయడానికి ఎలాంటి అడ్డంకులు లేవు. విలీనం వల్ల టౌన్‌ప్లానింగ్‌లో కొద్దిపాటి మార్పులు మినహా, కంటోన్మెంట్‌లోని ప్రశాంత వాతావరణానికి విఘాతం ఏర్పడుతుంది. కంటోన్మెంట్ చట్టంలో మార్పులతో రూపొందించిన నూతన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించాకే, ఎన్నికలు నిర్వహించాలి. కొత్త చట్టం ప్రకారం ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత పెరుగుతుంది.

–రామకృష్ణ, బోర్డు నామినేటెడ్ సభ్యుడు

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి లోనైన ఓ యువకుడు శ్మశాన వాటిక సమీపంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన బోరంకోల సంతోష్(25) గత కొంత కాలంగా గౌడవెళ్లిలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భార్యభర్తల గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన సంతోష్ ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. గ్రామ శివార్లలోని శ్మశాన వాటిక సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం దీనిని గుర్తించిన స్థానికులు గమనించి మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెరువులో దూకి మహిళ...

మేడ్చల్‌రూరల్: భర్తతో గొడవపడి ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం, ఎరుకల బస్తీలో మధుసూదన్ శివలక్ష్మి(38) దంపతులు నివాసం ఉంటున్నారు. మధుసూదన్ మద్యానికి బానిస కావడంతో గత కొంతకాలంగా భర్తభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇరు కుటుంబాల పెద్దలు పలుమార్లు పంచాయతీ చేసినా అతడి వైఖరిలో మార్పు రాలేదు. ఈ నెల 12న భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో శివలక్ష్మి ఇంటి నుండి వెళ్లిపోయింది. సోమవారం మేడ్చల్ పెద్ద చెరువులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలనికి శివలక్ష్మిగా గుర్తించిన పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గొడవల కారణంగానే చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

భవనం పైనుంచి దూకి యువకుడు..



సాయిబాబా (ఫైల్)

మాదాపూర్: భవనం పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపూర్ జిల్లాకు చెందిన సాయిబాబా (29), గ్రూప్ 2 పరీక్షలకు శిక్షణ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చాడు. సోమవారం అతను మాదాపూర్‌లోని చంద్రనాయక్‌తాండ ఆర్‌కేఎస్ ప్రిస్టేజ్ ఓయో 6వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు



మాదాపూర్: కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీసులు రక్షించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన యువతి (25) హైదరాబాద్‌కు వచ్చింది. ఆర్థిక కారణాల నేపథ్యంలో నిద్రమాత్రలు మింగిన ఆమె కేబుల్ బ్రిడ్జిపైకి చేరుకుని దుర్గం చెరువులో దూకేందుకు యత్నిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి ఆమెను కాపాడారు. అనంతరం సమీపంలోని విక్రమ్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సదరు యువతికి మతి స్థిమితం లేదని పోలీసులు తెలిపారు.

కిడ్నాప్ కేసులో మరొకరి అరెస్ట్

గచ్చిబౌలి: అధిక వడ్డీకి అప్పు ఇచ్చిన వ్యవహారంలో తలెత్తిన వివాదం ఇద్దరి వ్యక్తుల కిడ్నాప్‌కు దారితీసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసిన గచ్చిబౌలి పోలీసులు మరో నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. మిగతా నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన నరేష్‌ను తాజాగా అరెస్ట్ చేశారు. బాధితుడు చదలవాడ సాయి గుప్తా, నిందితుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భవిశెట్టి గౌతమ్ మధ్య ఆర్థిక లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సాయిగుప్తా, సతీష్ రెడ్డిలను కిడ్నాప్ చేసి జగద్గిరిగుట్టకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వికారాబాద్ జిల్లా, గేట్ వనంపల్లిలోని ఫామ్‌హౌస్‌లో బంధించి చిత్ర హింసలకు గురి చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు అరెస్ట్ కాగా మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు సమాచారం.

దంపతులపై ఆటోవాలా దాడి

వెంగళరావునగర్: ఓ సివిల్ కాంట్రాక్టర్‌పై ఐదుగురు వ్యక్తులు అకారణంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథపం మేరకు... ఎస్సీఆర్ హిల్స్‌కు చెందిన సివిల్ కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ కారులో ఈ నెల 16న కుటుంబంతో కలిసి రహమత్‌నగర్‌లో ఉంటున్న స్నేహితుడి ఇంటికి బయలుదేరాడు. ఎస్‌ఎస్‌బీ నగర్ వద్దకు రాగానే ఎదురుగా ఆటో వచ్చి ఆగడంతో అతను కారును నిలిపాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో ఆటో మరో ప్యాసింజర్లను దింపుతోంది. దీంతో ఎదురుగా ఉన్న ఆటో డ్రైవర్ ఆటో పక్కకు తీయాలని లక్ష్మీనారాయణను దుర్భాషలాడాడు. ప్యాసింజర్లతో ఉన్న ఆటో పక్కకు వెళితే తాను వెళ్లగలనని చెప్పడంతో ఆగ్రహించిన ఆటో డ్రైవర్ ఫోన్ చేసి మరో నలుగురిని పిలిపించి లక్ష్మీనారాయణపై దాడి చేశాడు. ఈ సంఘటనను వీడియో తీస్తున్న లక్ష్మీనారాయణ భార్య శ్రీసత్య, కుమార్తె హరిప్రియలపై కూడా వారు దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితులు తమపై దాడికి పాల్పడిన బాలకృష్ణ, కేశవ్, యాదగిరి, కార్తీక్, వసంతలపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖేల్ ఇండియా పోటీలకు విద్యార్థుల ఎంపిక



హస్తినాపురం: కర్ణాటక రా ష్ట్రంలోని బాగాల్కోట్‌లో జరిగిన సౌత్ జోన్ ఖేల్ ఇండియా పురుషులు, ఉ మెన్స్ పోటీలలో హస్తినాపురం భవిష్య స్కూలు వి ద్యార్థులు పాల్గొని వివిధ పతకాలు సాధించి జాతీయస్థాయి ఖేలో ఇండి యా పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో రావుల మోక్ష వెండి పతకంతోపాటు మూడువేల రూపాయల నగదు, గుద్దేటి వైష్ణవి కాంస్య పతకం, రెండువేల నగదు, జరుపుల సిరి చందన కాంస్య ప తకం, రెండువేల రూ పాయల నగదు బహుమతి సాధించినట్లు భవిష్య స్కూలు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్కూలు ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్‌లు తె లిపారు. ఈ సందర్భంగా విజేతలను వారు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

Brand New Flats For Resale. Gated Communities. Near Habsiguda, ECIL, Cherlapally, Yapral. Many Options For Every Budget. Call Now Ph: 08069045555 [HA-242]

PLOT FOR SALE

VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 18,500/- సంప్ర: ✆ 63028 55524 [B-23]

Services

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [H-800419]

CHITS & DEPOSITS

కపిల్ చిట్స్‌లో లక్ష నుండి కోటి వరకు న్యూ మరియు వేకెంట్ చిట్స్ కలవు. సంప్రదించండి : Ph: 9912259056 [H-796304]

PERSONAL CARE

CHANGE OF NAME

I, Shyam Sundar Thangallapally R/o Flat No 221 B Block Gks Habitate Royale Yapral Hyderabad -500087, have changed my minor daughter's name from Sirri Vijetha Thangallapally to Ghaghna Sirri Thangallapally. [DA-35561]

I, Deepthi Naidu Nunna W/o, Sailesh Kasa R/o H.no.25-21/5/1, Ft-202, 2nd Floor, Mathrushri Brundavan Apartments, beside Lane of Paradise Hotel, East Anandhbagh, Malkajgiri, Hyderabad-500047. have changed my name to Deepthi Naidu Kasa. [DA-35588]

OLD AGE HOME

ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్ 8977639684 / 8977639685 [H-799891]

వృద్ధులు & భార్యాభర్తలు, Rtd ఎంప్లాయీస్, సింగిల్ & షేరింగ్ రూమ్స్, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి, 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్:7981467036, 9391039990, 8074327715 [H-778817]

TOURS & TRAVELS

సాయిటూర్స్: జూలై 2 రాజస్థాన్ టూర్, జూలై 13 మహారాష్ట్ర టూర్ అష్టగణపతులు, షిరిడి, జూలై - 21 కర్ణాటక టూర్, జూలై 22 రామేశ్వరం టూర్, ఆగస్టు - 24. కాశీ 9 నిద్రలు. 16 Sep గుజరాత్ టూర్. ఫోన్ 9848664831 [H-796077]

Wanted

ప్రముఖ ఇన్సూరెన్స్ కం॥లో పార్ట్ టైం అడ్వైజర్ కావలెను. కమీషన్ ఆధారంగా హౌస్ వైఫ్స్, రిటైర్డ్ వారు, చిట్స్ ఏజెంట్స్, NRI's మొ॥ వారు. Age : 30-75 సంప్ర : 9849248282 [H-189667]

రిసెప్షన్, టెలికాలర్స్ Bi PC, టెక్నీషియన్స్, రిపోర్టర్స్, ఆఫీస్‌బాయ్, డ్రైవర్లు, సూ॥వైజర్స్, ఆయాలు, కుక్స్, హెల్పర్స్, గార్డెన్ వర్కర్లు, వాచ్ మెన్, Qly: 7th - డిగ్రీ, Age: 16-72, జీ॥ 15-18, ఫ్రీ రూం మీల్స్ 9505288777 [H-778739]

ప్రముఖ విద్యాసంస్థకు మేల్ ప్రిన్సిపాల్ కావలెను. Age below 50 Years, Salary: 40000/- పనిచేయు స్థలం: అమీర్‌పేట, హైదరాబాద్. Please Contact: 92487 33323 [G-5445]

WANTED DRIVERS

డ్రైవర్స్ కావలెను: LB నగర్‌లో గల Concord డ్రగ్స్ Ltd కంపెనీకి అనుభవం గల డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. ఫోన్: 7032640251 [HA-1540]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-246/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

అప్పులు చేసి.. కనిపించకుండా పోయి..



భానుప్రసాద్ (ఫైల్)

మేడిపల్లి: సహోద్యోగుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు అప్పు తీసుకుని ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పీర్జాదిగూడ సాయినగర్‌కు చెందిన టి.భానుప్రసాద్(63) ఓ బ్యాంక్‌లో ఉద్యోగి. తాను పనిచేసే సంస్థలో సహోద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులను అప్పుగా తీసుకున్నాడు. గతనెల 27వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం అతని భార్య మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణులకు పోషకాహారం ఇవ్వాలి



ప్రిటర్మ్ డెలివరీ బేబీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న 2017 మిస్‌ఇండియా సుధాజైన్, తదితరులు

మన్సూరాబాద్: గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని 2017 మిస్ ఇండియా, మిస్ పసిఫిక్ సుధాజైన్ అన్నారు. ఎల్బీనగర్‌లోని ఆరెంజ్ హాస్పిటల్‌లో ప్రీటర్మ్ డెలివరీ బేబీ మొదటి జన్మదినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఏడు నెలల గర్భిణికి సాహసోపేతంగా శస్త్రచికిత్స నిర్వహించి తల్లిని, బిడ్డను కాపాడిన ఆరంజ్ హాస్పిటల్ వైద్యబృందాన్ని ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గౌతమ్ గోరిటియాల, ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ రాము, బిజినెస్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 మంది బైక్ రేసర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

- 10 బైక్‌లు సీజ్
- అడ్డుకున్న పోలీసుల పైకి దూసుకెళ్లిన రేసర్లు
- నాలెడ్జిసిటీలో ఘటన

గచ్చిబౌలి: అర్ధరాత్రి కొందరు యువకులు బైక్ రేస్‌లు నిర్వహిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తూ అడ్డు వచ్చిన పోలీసులపైకి దూసుకెళ్లారు. తప్పించుకున్న పోలీసులు స్టాపర్లను అడ్డు పెట్టడంతో వారు బైక్‌లను వదిలి పరారైన సంఘటన నాలెడ్జి సిటీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బైక్ నంబర్ల ఆధారంగా రాయదుర్గం పోలీసులు 9 మందిని అరెస్ట్ చేశారు. సీఐ సీహెచ్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి నాలెడ్జి సిటీలోని టీ హబ్ జంక్షన్‌లో బైక్ రేసులు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోల్ మొబైల్, బ్లూకోల్ట్స్‌తో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా రేసర్లు స్టంట్‌లు చేస్తూ కేకలు వేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. అడ్డుకునేందుకు వచ్చిన పోలీసుల మీదికి దూసుకు రావడంతో చాకచక్యంగా తప్పించుకున్నారు. రోడ్లకు అడ్డంగా స్టాపర్లు పెట్టడంతో కొందరు రేసర్లు పరారయ్యారు. మరి కొందరు బైక్‌లను వదిలి వెళ్లారు. బైక్‌ల ఆధారంగా సోమవారం తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ఈ నెల 1న టీ హబ్ జంక్షన్‌లో రేస్‌లు నిర్వహిస్తుండగా 50 స్పోర్ట్స్ బైక్‌లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయినా యువత ఏమీ పట్టనట్లు ప్రమాదకరంగా బైక్ రేస్‌లు నిర్వహిస్తుండటంతో వారి కట్టడి చేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని స్నేహపురికాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన హంస, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. మద్దాళి ఉషాగాయత్రి శిష్య బృందం ప్రదర్శించిన ఇల వైకుంఠం కూచిపూడి నృత్య రూపకం ఆద్యంతం అలరించింది. మధ్యాధూల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని శ్రీనివాస కల్యాణ వేదికపై శ్రీనివాసుడి కీర్తనలకు కళాకారిణుల నృత్యాభినయం అందరి మన్ననలు పొందింది. హృద్యంగా పాడిన శ్రీమన్నారాయణ తదితర కీర్తనలకు కళాకారిణుల హావభావ ప్రకటనను శాస్త్రీయ నృత్యాభిమానులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి పాల్గొన్నారు.

ఏం చేద్దాం..?

ఫార్మా భూములపై సర్కార్ యోచన

- టౌన్‌షిప్‌ల నిర్మాణమా.. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటా..?
- లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో మరోసారి కదలిక
- అభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రాధాన్యంగా అడుగులు
- త్వరలో నిర్ణయం ప్రకటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూములను ఏం చేద్దామనే విషయమై రేవంత్‌రెడ్డి సర్కార్ దృష్టి సారించింది. ఈ అంశంపై చర్చించేందుకు త్వరలోనే ఓ ఉన్నత స్థాయి బృందం సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఫార్మా భూముల్లో ఫార్మా విలేజ్‌లు నిర్మిస్తామని ఓసారి.. భారీ టౌన్‌షిప్‌లు నిర్మించి, ఈ ప్రాంతాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని మరోసారి సీఎం స్వయంగా ప్రకటించారు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు పెరిగాయి. ఆ వెంటనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఫార్మా అంశం కొంత మరుగున పడినట్లయింది.



త్వరలో నిర్ణయం

మహానగరానికి అతి సమీపంలో, శంశాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరాన ఫార్మా సిటీకి సేకరించిన భూములు ఉన్నాయి. నాగార్జునసాగర్– శ్రీశైలం హైవేల మధ్య సేకరించిన భూముల్లో ప్రపంచ స్థాయిలో మంచి పేరున్న విదేశీ సంస్థలతో కంపెనీలు ఏర్పాటు చేయిస్తే బాగుంటుందని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ కంపెనీల ఏర్పాటుతో స్థానికంగా భూములు కోల్పోయిన రైతులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. స్థానికుల నుంచి వ్యతిరేకత రాకుండా.. అభివృద్ధి, ఉపాధి కల్పన కోసం మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతానికి ప్రముఖ కంపెనీలు వస్తే ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు, వ్యవసాయ భూముల ధరలకు మళ్లీ రెక్కలొచ్చే అవకాశం ఉంటుంది. ఫార్మాసిటీకి సేకరించిన భూముల పక్కనే ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం పరిధిలో ఇప్పటికే పలు ప్రముఖ కంపెనీలు ఏర్పాటైన విషయం తెలిసిందే.

9,500 ఎకరాలకు పైగా సేకరణ

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పది గ్రామాల్లో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం 19,333 ఎకరాల భూములు సేకరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే టీఎస్‌ఐఐసీ (రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ) ద్వారా 9,500 ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూములను సేకరించింది. ఇదిలా ఉండగా తాము అధికారంలోకి వస్తే ఫార్మా సిటీని రద్దు చేస్తామని.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై బాధిత, స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రంగులతో అవగాహన



డ్రైనేజీ మ్యాన్‌హోల్ పైకప్పులపై ఎరుపు రంగు వేస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: వానాకాలంలో వరదలు ముంచెత్తినప్పుడు లోతైన మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచి ఉంటే ఏర్పడబోయే అనర్థాలను దృష్టిలో పెట్టుకుని జలమండలి సిబ్బంది పాదచారులు, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు మ్యాన్‌హోల్ మూతలపై ఎరుపురంగు వేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్ ప్రాంతాల్లో కొద్దిరోజులుగా లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించి మూతల కింద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటుచేస్తూ మూతల పైన ప్రమాదకర హెచ్చరికతో కూడిన రెడ్‌మార్క్ వేస్తూ అలెర్ట్ చేస్తున్నారు. ఇప్పటికే వంద శాతం మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ మార్కింగ్‌లు వేయడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో వర్షాకాలంలో జాగ్రత్తలు–హెచ్చరికలు పేరుతో బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మొదటిసారిగా ఈ సారి ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. వరదలు వచ్చినప్పుడు రెడ్‌మార్క్ ఉన్న మ్యాన్‌హోళ్ల పక్క నుంచి జాగ్రత్తగా వెళ్లాలని, ఎట్టిపరిస్థితిలో మూతలు తెరవవద్దని జాగ్రత్తలతో కూడిన అవగాహన అవగాహన కల్పిస్తున్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సమస్యలు వివరిస్తున్న రుద్రాక్ష మల్లేష్

లిబర్టీ: ఆటో డ్రైవర్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అఖిలభారత అసంఘటిత కార్మిక, ఉద్యోగుల సంఘం ఆటో విభాగం రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక మల్లేష్ సారథ్యంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 12 వేలు వెంటనే చెల్లించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేలు చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి లేక ఆటోలు అద్దెకి తీసుకొని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు బ్యాంకు ప్రధాన రుణాలు ఇప్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలను మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల నుంచి వేధింపులు ఆపాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 12 వేలు చెల్లిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారన్నారు.

గోశాలకు ఎద్దుల తరలింపు

రహమత్‌నగర్: సరైన సౌకర్యాలు లేకుండా వాహనంలో తరలిస్తున్న రెండు ఎద్దులను బోరబండ పోలీసులు గోశాలకు తరలించారు. సెక్టార్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సమాచారం మేరకు... బక్రీద్ నేపథ్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం రాత్రి మోతీనగర్ కూడలి వద్ద ఓ వాహనం ఆపకుండా వెళ్లింది. పోలీసులు వెళ్లి డ్రైవర్ అదుపులోకి తీసుకుని వాహనం తనిఖీ చేయగా అందులో రెండు ఎద్దులు ఉన్నాయి. వాటికి గడ్డి, తాగునీరు లేకుండా వాటి మెడ గట్టిగా తాళ్లతో కట్టి ఉండటాన్ని గమనించిన పోలీసు డ్రైవర్‌ను విచారించారు. తన వాహనం కొంత మంది తన కిరాయి మాట్లాడుకుని ఎద్దులు తరలించమని చెప్పినట్లు వివరించారు. ఎద్దులను గోశాలకు తరలించి, నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సెక్టార్ ఎస్‌ఐ మనోజ్ తెలిపారు.

వరద సహాయక చర్యల్లో జాప్యం తగదు

శ్రీనగర్‌కాలనీ: భారీ వర్షాలకు డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, సహాయ చర్యలు చేపట్టే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ ఆరోపించారు. సోమవారం వికాస్‌పురికాలనీలో ఆయన మాట్లాడుతూ... గాలి, వర్షాలకు చెట్లు కూలిపోతున్నాయన్నారు. ఎమర్జెన్సీ మాన్‌సూన్ బృందం జాడ కానరావడం లేదని ఆరోపించారు. విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టే విషయంలో పూర్తిగా విఫలమవుతున్నారని, ప్రజలు, ప్రజాప్రతినిధుల పోన్లు సైతం ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా మూడు నెలలపాటు వర్షాలు కురుస్తాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులు ముందస్తు కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మధురానగర్‌లో కూలిన భారీ వృక్షాలు

ఆందోళనలో కాలనీవాసులు



మధురానగర్‌లో పడిపోయిన చెట్లను తొలగిస్తున్న అసోసియేషన్ సిబ్బంది

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లో భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. కాలనీలోని బీ, డీ, జీ బ్లాక్‌లలో మూడు పెద్ద వృక్షాలు కూకటి వేళ్లతో సహా నేలకు ఒరిగిపోయాయి. ఒక్కసారిగా భారీ వృక్షాలు కూలడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు, డాబాలపై ఉన్న పిట్టగోడలు ధ్వంసం అయ్యాయి. విషయం తెలుసుకున్న మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు హుటాహుటిన కూలిన చెట్ల కొమ్మలను నరికి వేశారు. చెట్లు కూలడంతో కాలనీలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మరోవైపు వరదనీరు కూడా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు అసోసియేషన్ నేతల ఫిర్యాదు మేరకు జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖల సిబ్బంది వచ్చి తమ చెట్ల తొలగింపు, విద్యుత్ సరఫరా, మురుగునీటి పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టారు.

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి: గీతా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అమర గాయకులకు స్వరార్చన శీర్షికతో త్యాగరాయగానసభలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ప్రముఖ మెలోడికింగ్ గాయకులు రమణ, కృష్ణప్రసాద్, రాజన్‌కు సుబ్రహ్మణ్యం స్ఫూర్తి పురస్కారం–20 24ని ప్రదానం చేసి సన్మానించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షురాలు గీత పర్యవేక్షణ చేసిన కార్యక్రమంలో నవరస గాయని ఆమని, ప్రముఖులు లక్ష్మీనారాయణ, కుసుమ భోగరాజు, కె. రమేశ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్





ఫిలింనగర్ హకీంషా దర్గా వద్ద...





బంజారాహిల్స్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని మసీదులతో పాటు ఖాళీ మైదానాల్లో, ఈద్గాల్లో ముస్లింలు వేలాదిగా చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఇండో అరేబియన్‌మసీదుతో, నెక్లెస్ రోడ్డు ఈద్గా, యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్, జహీరానగర్ ఖాళీ మైదానం, ఫిలింనగర్ హకీంబాబా దర్గా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ముస్లింలు వచ్చి ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని మసీదులో ఇతర దేశాలకు చెందిన ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం ఆలింగనం చేసకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఆయా మైదానాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్వారీ మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న అజహరుద్దీన్...

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో బక్రీద్ ప్రార్థనల(ఈద్–ఉల్–అజా)ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎస్పీఆర్ హిల్స్ క్వారీ మైదానం, సలీం బాబా దర్గా ఈద్గాలలో పాటు మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్, కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డితో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. బోరబండ డివిజన్ సైట్–2 ఎస్ఆర్ఈర్ పురం కమాన్ వద్ద ఉన్న మసీదులో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఇండో అరబ్ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



అజహరుద్దీన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ సీఎస్ రెడ్డి

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ. 47, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 80, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 75, పచ్చాకకర 60, పందిరి బీర 72, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 45, గుండుబీన్స్ 145, గింజ చిక్కుడు 65, గోకరకాయ 55, కీర 38, దోసకాయ 23, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 45, సొరకాయ 17, పొట్లకాయ 20, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మల్లు రవిని కలిసిన మాల వెలుగు సంఘం ప్రతినిధులు



బంజారాహిల్స్: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందిన మల్లు రవిని మాల వెలుగు సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి దండు రామకృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ ఆలూరి సాయికిరణ్, భక్తి కీర్తనల గాయకురాలు నారాయణమ్మ తదితరులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై మల్లు రవి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

కుండపోత వర్షంతో పరేషాన్



ఫిలింనగర్‌లో రోడ్డుపై వరదనీరు



పంజగుట్టలో క్లీనింగ్ చేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

బంజారాహిల్స్: కుండపోత వర్షంతో రహదారులన్నీ జలమయం కాగా జీహెచ్ఎంజీ ఈవీడీఎం డీఆర్ఎఫ్ సిబ్బంది ఎక్కడికక్కడ వరదనీరు చేరిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉండి మ్యాన్‌హోల్ మూతల నుంచి వరదనీరు వెళ్లే మార్గాలను క్లీన్ చేశారు. సోమవారం సాయంత్రం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్ ప్రాంతాల్లో భారీ వర్షంతో రహదారులన్నీ జలమయమై బస్తీలు వరదతో ముంచెత్తాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. చాలాచోట్ల ట్రాఫిక్ స్తంభించింది.

నీట్ పరీక్షపై ప్రధాని స్పందించాలి

కాచిగూడ: నీట్ పరీక్ష విషయంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఈ మేరకు లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సోమవారం తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం తగదని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పెద్ద స్కాం అని, ఒక్కో అభ్యర్థికి రూ.30 లక్షల చొప్పున పేపర్‌ను అమ్ముకున్నారనే వార్తలొస్తున్నాయని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన 50కి పైగా లేటెస్ట్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9505800050లో సంప్రదించాలని కోరారు.

బోనాలకు భద్రతా ఏర్పాట్ల పరిశీలన

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు పోలీసులు భద్రతా ఏర్పాట్లు మొదలు పెట్టారు. జూలై 21,22వ తేదీల్లో జరుగనున్న బోనాలకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి ఏటా లక్షల మంది భక్తులు పాల్గొంటుండగా.. ఏటేటా ఆ సంఖ్య పెరుగుతూనే వస్తుంది. సోమవారం మహంకాళి ఈవో మనోహర్‌రెడ్డి, మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్‌లు దేవాలయ పరిసర ప్రాంతాల్లో తిరిగి భక్తుల భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. గతేడాది తలెత్తిన సమస్యలు, భక్తుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని తిరిగి పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడతామని ఏసీపీ, ఈవోలు తెలిపారు. భక్తులు, స్వచ్ఛంద సంస్థలు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు జాతర విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తామన్నారు.

పరామర్శ

సనత్‌నగర్: మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు పరామర్శించారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న సీనియర్ సిటిజన్స్ సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసానికి చేరుకుని శ్రీనివాస్‌యాదవ్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కౌన్సిల్ అధ్యక్షుడు మాణిక్‌రావ్ పాటిల్ పాల్గొన్నారు.

‘హిల్స్’లో దంచి కొట్టిన వాన



జూబ్లీహిల్స్‌లో విరిగిపడ్డ చెట్లకొమ్మలను తొలగిస్తున్న డీఆర్ఎస్ సిబ్బంది



తాజ్ కష్ణ హోటల్ ముందు వరద మళ్లింపులో పాల్గొన్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు



ప్రశాసన్‌నగర్‌లో నీట మునిగిన నివాసాలు

ఫిలింనగర్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ను సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ముంచెత్తింది. దంచికొట్టిన వానతో బస్తీలే కాకుండా కాలనీలు, అపార్ట్‌మెంట్లు అతలాకుతలమయ్యాయి. సంపన్నులు నివసించే ప్రశాసన్‌నగర్ కాలనీలో వరద నీరు రోడ్లపై నిలిచిపోయి ఇండ్లలోకి చేరింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో సకాలంలో స్పందించిన డీఆర్ఎఫ్ సిబ్బంది. వాటిని తొలగించే పనులను ముమ్మరం చేశారు. శ్రీకష్ణానగర్ పూర్తిగా నీట మునిగింది. ఇక్కడ వీధులు కాలువలను తలపించాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. సోమవారం సాయంత్రం ఏకధాటిగా కురిసిన భారీ వర్షం జనజీవనాన్ని స్తంభింపజేసింది. పలు చోట్ల ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అప్రమత్తమై వరదనీరు మ్యాన్‌హోళ్లలోకి వెళ్లే మార్గాలు వ్యర్థాలు, చెత్తాచెదారం తీసి శుభ్రం చేశారు. తాజ్ కృష్ణా హోటల్ ముందు భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని వరదనీటి మళ్లింపు పనుల్లో పాల్గొన్నారు.

వైభవంగా దైవసన్నిధానం బ్రహ్మోత్సవాలు



ఫిలింనగర్: విశాఖ శ్రీ శారద పీఠం ఫిలింనగర్ దైవసన్నిధానం వింశతి(20)వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఆలయంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. పూజల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, హారతి, తీర్థ ప్రసాద వితరణ, విశ్వక్సేన పూజ, అఖండ దీపారాధన, రుత్విక్‌వరుణ, మహీపూజ, అగ్నిప్రతిష్ఠ పూజాదికాలు నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సిగరెట్ ప్యాకెట్ల చోరీపై ఫిర్యాదు

వెంగళరావునగర్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో కుక్కలు తప్పి పోయాయంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే లేనిది, తాను సిగరెట్లు పోయాయని కంప్లెయిట్ ఇస్తే తప్పేంటని అనుకున్నాడో ఏమో ఓ దుకాణదారుడు సోమవారం నేరుగా మధురానగర్ పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. సిగరెట్ పాకెట్లు కూడా తన కష్టార్జితమే నంటూ పోలీసులను కేసు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జవహర్‌నగర్‌కు చెందిన ఎ.రమేష్ అనే వ్యక్తి ఆరు నెలలుగా యూసుఫ్‌గూడ బస్తీలో టీ దుకాణం నడుపుతున్నారు. ఈ నెల 14వ తేదీ రాత్రి షాపు మూసి 15 ఉదయం ఓపెన్ చేయడానికి వచ్చాడు. కాగా తన షాపును గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. షాపును పరిశీలించగా అందులో ఉండాల్సిన 30 పాకెట్ల సిగరెట్లు, దాంతో పాటుగా రూ. 5 వేలు నగదు మాయం అయ్యాయి. బాధితుడు చుట్టుపక్కల విచారించిన అనంతరం సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సిగరెట్ పాకెట్ల కోసం ఫిర్యాదు ఏందని అనుకున్న పోలీసులు చివరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోర్‌వెల్ నిర్వాహకుడిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా బోర్‌వెల్ నిర్వాహకుడిపై బీఆర్ఎస్ నేతలు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంనగర్‌కు చెందిన మహ్మద్ షకీర్ బోర్‌వెల్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఈనెల 16వ తేదీ రాత్రి రహమత్‌నగర్‌కు వచ్చి ఒక వ్యక్తితో బోర్‌వెల్ గురించి మాట్లాడుకుని తిరిగి బోర్‌వెల్ వాహనంలో వెళుతున్నాడు. హనుమాన్ దేవాలయం వద్ద ఇరుకుగా ఉండటంతో వాహనాన్ని డ్రైవర్ వెంకటేష్ రివర్స్ చేస్తుండగా సమీపంలోని నివసించే అరుణ్, మహేష్ అనే వ్యక్తులు వచ్చి అకారణంగా దూషించారు. ఇంటికి ఏమైనా డ్యామేజ్ అయితే తాను బాగు చేయిస్తానని షకీర్ చెబుతున్నప్పటికీ ఆగకుండా ఇరువురు అన్నదమ్ములు డ్రైవర్ వెంకటేష్‌ను గ్రనేట్ రాయితో షకీర్‌ను రాడ్డుతో తలపై కొట్టారు. బాధితులు ఆసుపత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్‌ను నియమించినట్లు సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న త్రిసభ్య కమిటీ పూర్తిగా విఫలమైందని, దానిని రద్దు చేసి పంచ సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేనా రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సేవాలాల్ సేనా కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడిగా రమేశ్ మహరాజ్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేనా రాష్ట్ర ఇన్‌చార్జిగా మూడావత్ కృష్ణానాయక్, కోకన్వీనర్లుగా బానోత్ హుస్సేన్‌నాయక్, వెంకన్ననాయక్, అజయ్‌నాయక్, మోతీలాల్‌నాయక్, భాస్కర్‌నాయక్, కొర్రా శ్రీను, రాజేశ్‌నాయక్, బానోత్ బాలునాయక్, శంకర్‌నాయక్, హైదరాబాద్ సీనియర్ నాయకులు కల్యాణ్‌నాయక్, శశిప్రసాద్, బానోత్ కిషన్‌నాయక్, రవినాయక్, రామునాయక్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ముగిసిన సమ్మర్ కోచింగ్




ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులతో వినయ్‌కుమార్

చిక్కడపల్లి: రుద్రమదేవి షోటోకన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ ముగింపు వేడుకలను సోమవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ టీఆర్‌టీ గ్రాండ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. రుద్రమదేవి షోటోకన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ మాస్టర్ నారాయణ, ఎస్‌కేడీఏ చీఫ్ ఎగ్జామినర్ క్యోషి, డాక్టర్ రవి, ఫౌండర్ షిహన్, ఎన్.లక్ష్మీ, బసవరాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

కవాడిగూడ: ఫాదర్స్‌డే ను పురస్కరించుకుని రామకృష్ణ మఠంలో యోగానంద రఘుమహారాజు, నవ భారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో నాన్నపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. నాన్న మాటను అర్థం చేసుకుంటే సరైనా దారిలో నడవగలమని పేర్కొన్నారు. అనంతరం ఇందిరాపార్కులో యోగా గురువు బి. సరోజినీ రామారావు ఆధ్వర్యంలో నాన్నలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.స్వరూపారాణి, శోభారాణి, సరోజినీ రామారావు, జి. కృష్ణవేణి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203





బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం మసీదులు, ఈద్గాలు ప్రార్థనలతో హోరెత్తాయి. ముస్లిం సోదరులు ఒకరినొకరు అలయ్ బలయ్ చేసుకున్నారు. పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మీరాలం ఈద్గా, మక్కా మసీద్‌ల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కుట్టు.. వెనకపట్టు

- గిట్టుబాటు కాక టైలర్ల అవస్థలు
- రెడీమేడ్ షాపులతో తగ్గిన ఆదరణ
- కూలి పనులకు వెళ్తున్న టైలర్లు



కుట్టుపనిలో పట్టు'మనీ' పైసా కూడా మిగలడంలేదు వృత్తిదారులకు. కుడుతూ, కుంటుతూ అన్నట్లుగా సాగుతోంది వృత్తి. టైలరింగ్‌కు ఇప్పుడు కళలేదు. కలరింగ్ లేదు. ఒకప్పుడు దర్జీకి ప్రత్యేక గౌరవం లభించేది. దర్జీ బతుకు దర్జాగా ఉండేది. వస్త్రం వారికి ఉపాధి అస్త్రంగా ఉండేది. రెడీమేడ్ దుస్తులు దూసుకొచ్చి వారిని కోలుకోని దెబ్బతీశాయి. కోవిడ్ తర్వాత దర్జీల బతుకులు మరింత దుర్భరమయ్యాయి. కుటుంబ పోషణ భారమైంది.

టైలరింగ్ వృత్తిని మానేస్తున్నారు..



గతంలో వేలాదిమంది టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవించేవారు. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల దుకాణాలు రావడంతో బట్టలు కుట్టించుకునేవారు తక్కువయ్యారు. మెటీరియల్ ధరలు పెరగడంతో జత దుస్తులు కుడితే కేవలం రూ. 50 నుంచి రూ. 100 లోపే మిగులుతోంది.

- కె. మధుసూదన్, టైలర్, నల్లకుంట

రోజుకూలీ గిట్టుబాటు కావడం లేదు..



రోజూ దాదాపు రూ.400 వరకు కూలీ సంపాదిస్తాం. ప్రతిరోజు ఇంటి నుంచి పనిచేసే ప్రాంతానికి రావాలంటే రూ.60 బస్సు చార్జీలు అవుతున్నాయి. మధ్యాహ్నం, సాయంత్రం చాయ్ తాగితే రూ. 30 ఖర్చవుతున్నాయి. ఇక మిగిలిన దానితో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి.. ?

- పర్వేజ్, టైలర్

సొంత ఇల్లు కూడా లేదు..



25 ఏళ్లుగా టైలరింగ్ వృత్తిలో కొనసాగుతున్నా.. సొంత ఇల్లు కూడా లేదు. రోజూ వచ్చే డబ్బులతో ఇంటి అద్దెలు చెల్లించడం, నిత్యావసర సరుకులకే వెచ్చించాల్సి వస్తోంది. పిల్లలను చదివించలేకపోతున్నా. కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. టైలర్లకు కార్మికశాఖ నుంచి ఇన్సూరెన్స్ వర్తించేలా చూడాలి.

- రమేష్, టైలర్



నల్లకుంట: టైలరింగ్‌తో జీవించే వేలాదిమంది కుటుంబాలు నేడు ఆ వృత్తి మానేసి వలస వెళ్తే.. మరికొందరు కూలీ పనులకు వెళ్తున్నారు. వచ్చే దినసరి కూలీతో కుటుంబాలు గడవక ఎంతో మంది దయనీయ స్థితిలో ఉన్నారు. టైలర్లు దుస్తులకు ఉపయోగించే జిప్పులు, గుండీలు, దారాలకు గతంలో 30 శాతం ఉన్న ధరలు ఇప్పుడు 70 శాతానికి పెరిగాయి. జతకు రూ.800 నుంచి రూ.1,100 చెల్లిస్తే తప్ప గిట్టుబాటుకాదు. దీంతో చాలామంది రెడీమేడ్ దుస్తులవైపు మొగ్గుచూపుతున్నారు. టైలర్ దుకాణాలు ఏర్పాటు చేయాలంటే అద్దెలు కూడా రూ.వేలల్లో ఉంటున్నాయి. అరకొరగా వచ్చే ఆదాయం దుకాణాల అద్దెలు, కరెంటు బిల్లులు, ముడి సరుకులకే సరిపోతుందని టైలర్ షాపుల యజమానులు వాపోతున్నారు.

అనారోగ్య సమస్యలతో సతమతం..

గంటల కొద్దీ సమయం కుట్టుమిషన్‌పై కూర్చోవడటంతో వృత్తిదారులకు కంటిచూపు పూర్తిగా దెబ్బతింటోంది. మిషన్ కాళ్లతో నిరంతరం తొక్కడంతో కాళ్లవాపులు, నొప్పుల బారిన పడుతున్నారు. టైలర్ల పట్ల ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కావడంలేదు. కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నామని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టైలర్ల వినతులివీ..

- బ్యాంకులు రుణాలు ఇవ్వాలి
- 45- 50 ఏళ్ల వయసు టైలర్లకు పెన్షన్లు మంజూరు చేయాలి. ప్రతి పేద టైలర్‌కు ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలి.
- టైలర్లను కార్మికులుగా గుర్తించి, ఇన్సూరెన్స్ ఇవ్వాలి. ఉచిత వైద్య సేవలు అందించాలి.

ఫిలింనగర్ పాఠశాలకు టీచర్లు కావలెను!

ఒకే బడిలోంచి 22 మంది టీచర్ల బదిలీపై అధికారుల ఆరా

ఫిలింనగర్: రాష్ట్రంలో ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ లేని సమస్యను ఫిలింనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుర్కొంటోంది. ఈ పాఠశాలకు చెందిన 22 మంది టీచర్లు ఒకేసారి బదిలీ కావడానికి గల కారణాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. మూడురోజుల క్రితం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ టీచర్ల మూకుమ్మడి బదిలీలపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 948 మంది విద్యార్థులున్న ఈ బడిలో ఇప్పుడు హెచ్ఎంతోపాటు ఇంకొక టీచర్ మాత్రమే మిగిలారు. కొత్తగా విద్యార్థులు చేరడం లేదు. బోధన సాగడంలేదు. ఇక్కడ తెలుగు మీడియం బోధనను పూర్తిగా తొలగించారు. పదో తరగతిలోని తెలుగు మీడియం విద్యార్థులను ఒక్కసారిగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడంతో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. ఈ పాఠశాలకు రావడానికి టీచర్లు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఒక్క ఈ పాఠశాలకే టీచర్లు ఎందుకు రావడం లేదు, ఉన్న టీచర్లు ఎందుకు వెళ్లారు.. అన్నదానిపై విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. చాలామంది విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్నారు. ఇదే జరిగితే స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది.

సబ్ జూనియర్ బ్యాడ్మింటన్‌లో సత్తా



సబ్ జూనియర్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–15 బాలుర సింగిల్స్ విభాగంలో రాష్ట్రానికి చెందిన వనమాల శశాంక్ విజేతగా నిలిచాడు. మియాపూర్‌లోని చేతన్ ఆనంద్ స్పోర్ట్స్ సెంటర్‌లో వారంపాటు జరిగిన ఈ టోర్నీ సోమవారం ముగిసింది. అండర్–15 బాలుర సింగిల్స్ ఫైనల్లో శశాంక్ టాప్ సీడ్ గిరివాసన్ శరవణ కుమార్(తెలంగాణ)పై విజయం సాధించాడు. అండర్–15 బాలికల సింగిల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి చదరం హంసిని రన్నరప్‌గా నిలిచింది. అండర్–17 బాలికల డబుల్స్ విభాగంలో దుర్గా ఇషా (ఆంధ్రప్రదేశ్)–మంచాల కీర్తి(తెలంగాణ) జోడీ టైటిల్ దక్కించుకుంది. అండర్–15 బాలుర డబుల్స్ విభాగంలో రాహుల్ కడపాకుల (ఆంధ్రప్రదేశ్)–వేదాంత్ (హరియాణా) జోడీ విజేతగా నిలిచింది. విజేతలకు భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ట్రోఫీలను అందజేశారు.

ఏపీ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలి

దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు కృష్ణస్వరూప్



మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను తిరిగి నిర్వహించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్లు సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో తప్పుడు పద్ధతిలో గెలిచిన ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్ ఎన్నికల కమిషన్, సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కృష్ణస్వరూప్ మాట్లాడుతూ గత మే 13న జరిగిన ఎన్నికల్లో ఓట్లన్నీ బీజేపీకి, టీడీపీకి, జనసేనకు వన్‌సైడ్‌గా ఓట్లు పడటంపట్ల శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు ఎన్నికల విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దళిత, బహుజనులు పోటీ చేసిన లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో సైతం అతి తక్కువ ఓట్లు వచ్చాయని, దీన్నిబట్టి ట్యాంపరింగ్ జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

'నీట్' రద్దు కోరుతూ నేడు విద్యార్థుల మార్చ్

లక్డీకాపూల్: వైద్య విద్యా ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ అక్రమాల పుట్టగా మారిందని, దానిని తక్షణమే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. నీట్ అక్రమాలకు నిరసనగా ఈ నెల 18న హిమాయత్‌నగర్ లిబర్టీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపాయి. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యుఐ నేత బల్మూర్ వెంకట్‌తోపాటు ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, ధర్మేంద్ర యాదవ్, అరుణ్ నీట్ అక్రమాలపై మండిపడ్డారు. ఈ అంశంపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని బల్మూరి డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేసే దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించకపోతే కేంద్రమంత్రులైన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

'అరుంధతి రాయ్‌పై ఉపా కేసు ఎత్తేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ముషీరాబాద్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామికవాదులను, హక్కుల కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. అరుంధతీరాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై పెట్టిన అన్ లాఫుల్ ప్రివెంటివ్ యాక్ట్(ఉపా) పేరుతో ప్రాసిక్యూషన్ చేయడాన్ని నిలిపివేయాలన్నారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల కిందట కశ్మీర్ సమస్యపై అరుంధతీరాయ్ మాట్లాడిన అంశాన్ని తిరగదోడి ఉపా కేసు పేరుతో వేధించడం తగదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ముఖ్యమంత్రులను, మేధావులను జైళ్లల్లో పెట్టి హింసించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. దీనిని దేశ ప్రజలు, పౌరులందరూ వ్యతిరేకించాలని కోరారు. వెంటనే అరుంధతీ రాయ్‌పై ఉపా కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రమ, కె.సూర్యం, ఎస్.ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామి, అమ్మవార్ల పల్లకీ సేవలో అర్చకులు

హిమాయత్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీడీపీ) హిమాయత్‌నగర్ లిబర్టీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి, చక్రత్తాళ్వార్ వారికి పుష్కరిణి ఎదురుగా స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు నవసంధి, మాడవీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 7.30 గంటల వరకు ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

జూలై 9 నుంచి ఇంజనీరింగ్ మేథమెటిక్స్‌పై సదస్సు

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ విజయవాడ క్యాంపస్‌లో జూలై 9 నుంచి 13వ తేదీ వరకు 'అడ్వాన్స్‌డ్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటేషనల్ ఇంజనీరింగ్ మేథమెటిక్స్'(ఏసీఏటీసీఈఎం–2024)పై నాల్గవ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరాలను వెల్లడించారు. విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్లు, పరిశ్రమ నిపుణులు పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత విద్యలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బీవీ అప్పారావు, కన్వీనర్ డాక్టర్ రేణుకా కొలందసామి, ఇతర అధ్యాపకులు, సిబ్బందితో కలిసి సదస్సు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

దురుసుగా ప్రవర్తించిన ఏసీపీని సస్పెండ్ చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అబిడ్స్: వ్యాపారులపట్ల దురుసుగా ప్రవర్తించిన ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆందోళనకు దిగారు. దీంతో గుడిమల్కాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. వివరాలు... ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఏసీపీ కిషన్‌కుమార్ పోలీసులతో కలిసి గుడిమల్కాపూర్ చౌరస్తాలోని దుకాణాలను మూసివేయిస్తున్నారు. అయితే పోలీసులు అమర్యాదగా మాట్లాడుతున్నారని స్థానిక వ్యాపారులు కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అమర్‌సింగ్ పోలీసుల వద్దకు వెళ్లి వ్యాపారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే సహించేదిలేదని, మెహిదీపట్నం ప్రాంతంలో ఒకవర్గం దుకాణాలను ఎందుకు మూసివేయడంలేదని అన్నారు. దీంతో ఏసీపీ కోపోద్రిక్తుడై అమర్‌సింగ్‌ను నెట్టివేశారు. సమాచారం తెలుసుకున్న వందలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు గుడిమల్కాపూర్ చౌరస్తాకు చేరుకున్నారు. గుడిమల్కాపూర్ పరిసర ప్రాంతాలు, పోలీసుస్టేషన్ వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకొని డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి వచ్చి అక్కడ ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌ను ఆరా తీశారు. ఏసీపీ ఆగ్రహంతో అమర్‌సింగ్‌ను నెట్టివేశారని కానిస్టేబుల్ చెప్పారు. ఏసీపీదే పొరపాటని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇవ్వడం, ఏసీపీ కిషన్ కుమార్ కూడా తన పొరపాటును అంగీకరించడంతో సమస్య సద్దుమనిగింది. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు బీజేపీ సీనియర్ నేత సునీల్ యాదవ్ ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

వారంరోజుల నుంచి రాత్రుళ్లు యువకుల గస్తీ

ధార్ ముఠా ప్రచారంతో బెంబేలెత్తుతున్న శివారువాసులు



బృందావన్ మెడోస్ కాలనీలో గస్తీ నిర్వహిస్తున్న యువకులు

వనస్థలిపురం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధార్ ముఠా దోపిడీలు చేసేందుకు నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తుండడంతో శివారు కాలనీల ప్రజలు ఉలిక్కి పడుతున్నారు. ఇప్పటికే ప లు కాలనీలలో చైన్‌స్నాచింగ్‌లు కొనసాగుతుండగా ఇప్పుడు ప్రాణాలు తీయడానికి సైతం వెనుకాడని ముఠాలు ఇళ్లల్లోకి చొరబడే అవకాశాలు ఉన్నాయని వస్తున్న వార్తలతో పలు కాలనీల ప్రజలు బెంబేలెత్తు తున్నారు. కొత్తగా వెలుస్తున్న పలు కాలనీలలో ఇంకా సీసీ కెమెరాలు ఏర్పాటు కాకపోవడం, మీరే గస్తీ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు పేర్కొంటున్న నేపథ్యంలో కాలనీలలోని యువకులు రాత్రిపూట మేలుకుని గస్తీ నిర్వహిస్తున్నారు.

బృందావన్ మెడోస్ కాలనీలో...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ మెడోస్ కాలనీలో కాలనీకి చెందిన యువకులు గత వారం రోజులుగా ఒక బృందంగా ఏర్పడి గస్తీ నిర్వహిస్తున్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో పోలీసుల సూచనల మేరకు స్వీయరక్షణ కోసం రాత్రివేళ తాము మేల్కొని గస్తీ తిరుగుతున్నామని యువకులు శశి, వెంకట్, కైలాష్, జగన్, సురేందర్, హరినాథ్‌బాబు, ప్రభాకర్ తెలిపారు. పోలీసులు కూడా రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని వారు తెలిపారు.

ఓట్లేసిన ప్రజలే నాకు వీఐపీలు: ఎంపీ ఈటల



ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్/వనస్థలిపురం: ఓట్లేసిన ప్రజలే తనకు వీఐపీలు అని, సామాన్యుడి క్షేమం, ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాయలంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో కృతజ్ఞతపూర్వక సభకు ఆయనతో పాటు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ పిలిస్తే పలికే మీ ఇంటి బిడ్డగా కాలుకు ముళ్లు గుచ్చితే పంటితో తీసేవిధంగా ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్‌లోనే బీజేపీకి 9851ఓట్ల మెజార్టీని ప్రజలు అందించారని, మల్కాజిగిరి ప్రజలు నన్ను అక్కున చేర్చుకున్నారన్నారు. మల్కాజిగిరి ప్రజలు తలెత్తుకునే విధంగా వ్యవహరించి స్వచ్ఛమైన పాలన అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, నాయకులు నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కదారియాదగిరి యాదవ్, హరీష్‌రెడ్డి, సాయిరాంగౌడ్, పోరెడ్డి కవితారెడ్డి, చిల్కూరి మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాయకుడిని కాదు.. సేవకుడిని...

ఎంపీ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఎంపీగా గెలిచిన ఈటలను ఆదివారం రాత్రి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యునిగా తనను భారీ మెజార్టీతో గెలిపించడంలో ఎల్‌బీనగర్ ప్రజలు కీలకపాత్ర వహించారని, వారికి తాను ఎంతో రుణపడి ఉన్నానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగా రెడ్డి, ఎల్‌బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవిందర్‌గౌడ్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కళ్లెం రవిందర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, టి.విజయ్‌కుమార్, పార్టీ నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



'సైన్స్ అండ్ టెక్నాలజీ' ఆవిష్కరణ

చిక్కడపల్లి: రాజ్యం ప్రజల సృష్టి అని, సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టి మారిపోయిందని తెలంగాణ జనసమితి అధినేత, టీజీపీఎస్సీ సిలబస్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం త్యాగరాయగానసభలో పి.మహేష్‌రెడ్డి రచించిన సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాన్ని ఛత్తీస్‌గఢ్ ఎస్పీ అక్షయ్‌కుమార్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ ఎం.బాలలత, టీజీ ఎస్పీ ఎక్సైజ్ డి.గాయిత్రిలతో కలసి ఆయన ఆవిష్కరించారు. కోదండరాం మాట్లాడుతూ లెక్కలు తెలియకుండా సమాజం గురించి తెలుసుకోవడం కష్టమన్నారు. పుస్తకాన్ని రాయడం మామూలు విషయం కాదని అన్నారు. రచయిత మహేష్‌రెడ్డి తన అనుభవాలను తను రాసిన 670 పేజీల సైన్స్ అండ్ టెక్నాలజీ బుక్ గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్స్ విద్యార్థులు పాల్గొని వారి అనుభవాలను వివరించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 18, జూన్, 2024



ఇది చైనీస్-జపనీస్ వంటకాల సమ్మేళనం. నూడుల్స్‌ను ఉడికించి, చల్లబరచి...ఆపై తురిమిన చికెన్, జూలియెన్డ్ దోసకాయ, క్యారెట్, టమాట, పాలకూర, పచ్చి ఉల్లిపాయలు, నోరి స్ట్రిప్స్, నువ్వుల గింజలతో తయారు చేస్తారు. సోయా సాస్, రైస్, వెనిగర్, చక్కెర, నీరు, నువ్వుల నూనె, తురిమిన అల్లంతో అలంకరించుకుని నేరుగా తినవచ్చు. ఈ పదార్థాలు శరీరంలో పోషకాలు, ఎలక్ట్రోలైట్‌లను తిరిగి నింపుతాయి.

→ హియాషి చూకా

రెస్టారెంట్లో తప్పనిసరి ట్రెండ్	కొత్త రుచులను ఆస్వాదిస్తున్న నగరవాసులు	రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం	ఇంట్లోనూ సులభంగా చేసుకోవచ్చు



ఓ 'సూపు' సూద్దామా..!

ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా మన చేతికిచ్చే మెనూలో మొదట కనిపించేది సూప్స్ అండ్ స్టార్టర్స్. ఎప్పటి నుంచో నగరంలో కొనసాగుతున్న ఈ ట్రెండ్. ప్రస్తుతం తప్పనిసరైంది. ఆరోగ్యాన్ని ప్రసాదించే సూప్స్ నగర జీవన శైలిలో భాగమయ్యాయి. ప్రస్తుతం ఆహార ప్రియులు రెస్టారెంట్లలో తమకు నచ్చిన సూపులను ఓ సూపు సూస్తున్నారు. విభిన్న ఫ్లేవర్స్ జిహ్వకు రుచితో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అనేక పోషక విలువలు కలిగిన సూప్స్ చక్కని ఆరోగ్య ఫలితాలనూ అందిస్తున్నాయి. –సాక్షి, సిటీ బ్యూరో

ఆకలి తీర్చడమే కాకుండా ఆకలిని పెంచడంలోనూ సూప్స్‌ది ప్రత్యేక స్థానం. వెజ్, నాన్‌వెజ్ రూపాల్లో లభించే సూప్స్‌లో విభిన్న రకాలున్నాయి. ప్రాంతం, ఆహారపు అలవాట్లను బట్టి వివిధ దేశాల్లో వివిధ రకాల సూప్స్ ప్రాచుర్యం పొందుతున్నాయి. ఇక నగరాల్లో అయితే అన్ని రకాల సూప్స్ అందుబాటులో ఉంటాయి. ఇండియన్, చైనీస్ సూప్‌లతో పాటు ఈ మధ్య కొరియన్ సూప్స్ సైతం నగరంలో ఆదరణ పొందుతున్నాయి. మిరియాలు, దోసకాయ, పాలు, నిమ్మరసం, పెరుగు, క్యారెట్, నువ్వులు, పాలకూర, అల్లం, రైస్ వెనిగర్ పదార్థాలతో తయారు చేసిన సూప్‌లు శరీరంలోని పోషకాలను, ఎలక్ట్రోలైట్ లను పెంపొందిస్తాయని ప్రముఖ చెఫ్ మంగ అశోక్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ వేదికగా తయారు చేసే సూప్స్‌లో సీజనల్‌గా ఆరోగ్యానికి సహకరించే మిరియాలు, అల్లం వంటి పదార్థాలను ఎక్కువగా వినియోగిస్తున్నామని అన్నారు. ఎండలో డీహైడ్రేషన్‌కు, చలికాలం గొంతు ఇన్ఫెక్షన్లకు సూప్స్ చక్కని ఉపశమనం. గుండె నరాలు, మధుమేహం నిర్వహణలోనూ మనకు సాయపడతాయని అశోక్ చెబుతున్నారు. అయితే ఇంట్లో తయారు చేసుకునేందుకు అనువైన కొన్ని సూప్స్ గురించి తెలుసుకుందాం.

హైడ్రేటింగ్ కోసం దోస–అవకాడో..

దోసకాయ, అవకాడో కలిపి చేసిన సూప్ హైడ్రేటింగ్ శక్తినిస్తుంది. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయి. ఈ సూప్ తయారీలో అవకాడోలు, దోసకాయలు, పెరుగు/కొబ్బరి పాలు, నిమ్మరసం, జీలకర్ర, మిరియాలు, పుదీనా కలపాలి. చల్లని సూప్‌లో కొత్తిమీర కూడా చేర్చాలి. ఇది కాస్త చేదుగా ఉన్నప్పటికీ ఆరోగ్య ప్రదాయిని.



క్యారెట్లు, దుంపలు, నిమ్మకాయ కలుపుకుంటే రుచి మారుతుంది.

జరు సోబా

జరు సోబా అనేది సంప్రదాయ సూప్‌ల మాదిరిగా కాకుండా..ఉడకబెట్టిన పులుసు ఆధారిత సూప్. చల్లబడిన బుక్‌వీట్ నూడుల్స్‌తో తయారు చేసే జపనీస్ వంటకం ఇది. సాస్‌తో వండే ఈ సూప్ సోయా, డాషి, మిరిన్ నుంచి తయారు చేస్తారు. ఈ చల్లని సూప్ తక్కువ కేలరీలతో హృదయనాళ ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా మధుమేహం నిర్వహణలో సహాయపడుతుంది. ఉడికించిన నూడుల్స్‌ను చల్లటి నీటితో శుభ్రం చేశాక అవి దృఢంగా మారతాయి.



తియ్యగా.. కారంగా.....

తియతియ్యగా, కారంగా నాలుకకు రుచినందించే వినూత్న సూప్..టమాట–మిరియాల సూప్. దక్షిణాదిలో ఎక్కువ ఆదరణ ఉన్న ఈ సూప్‌ను రసంగానూ వాడుకోవచ్చు. జలుబుకు నివారణగా నాలుకపై టేస్ట్ బడ్స్ మేల్కొల్పడానికి, చలిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. మిరియాల రసం, జీర రసం, టమాట రసం, మిలాగు రసం, తక్కలి రసం, టమాట మిరియాల చారు వంటి విభిన్న పేర్లతో పిలుస్తారు. ఇందులో మంచి రుచి కోసం వెల్లుల్లి, మిరియాలు, జీలకర్రను వినియోగిస్తారు. రుచుల సమ్మేళనాన్ని సమతుల్యం చేయడానికి కాస్త బెల్లంతో తీపి చేస్తారు. సీజనల్ ఇన్ఫెక్షన్‌లు తగ్గించడానికి ఇదొక చక్కని ఔషధంలా పనిచేస్తుంది.



ఆమె కోసమే కాఫీ: శర్వా

బంజారాహిల్స్: 'నేను పెళ్లి కాకముందు టీ, కాఫీలు తాగేవాడిని కాదు.. పెళ్లయ్యాక నా భార్యకు కాఫీ అంటే ఇష్టమని తనకోసమే కాఫీని ఎంజాయ్ చేస్తున్నాను' అని హీరో శర్వానంద్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో తన సోదరుడు ఏర్పాటు చేసిన బీన్జ్ కాఫీ షాప్‌ను వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మ, ఏపీ రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. 2008 సమయంలో తన కాఫీ షాప్‌లో అప్పట్లో హీరోలు రామ్‌చరణ్, అఖిల్‌తో పాటు చాలా మంది కలిసేవాళ్లమని, వారితో ఎన్నో మెమొరీలు ఉన్నాయన్నారు. ఫుడ్ మీద ఇంట్రెస్ట్ ఉన్నహీరోలు ఈ వ్యాపారంలోకొస్తే క్వాలిటీ ఫుడ్ ఇస్తారని, తనకు వంట రాదని, కానీ ఏం నచ్చినా వండించుకొని తినేస్తానంటూ చెప్పుకొచ్చారు. విభిన్న రుచులతో పాటు కాంటినెంటల్ రెసిపీలను అందిస్తున్నట్లు నిర్వాహకులు అర్జున్ మైనేని తెలిపారు. పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, డి.వంశీకృష్ణం రాజు, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.



సిటీ విత్ ఎంగేజ్

తెలుగు స్టాండప్ కామెడీ...

తెలుగు హాస్య ప్రియుల కోసం తెలుగు స్టాండప్ కామెడీ ప్రదర్శన నిర్వహిస్తున్నారు.
తేదీ: జూన్ 19, **వేదిక:** ది కామెడీ థియేటర్, ఇందిరానగర్, గచ్చిబౌలి
సమయం: సాయంత్రం 5గంటలు

ఏఆర్ రెహ్మాన్ ట్రిబ్యూట్ నైట్..

వైవిధ్యభరిత సంగీత సంచలనం, ఆస్కార్ విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతానికి పట్టం కడుతూ మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నారు. నగరానికి చెందిన సంగీత బృందం సిద్ధార్థ్ బెండి కలెక్టివ్..దీనిని వీనుల విందుగా రక్తి కట్టించనున్నారు.
తేదీ: జూన్ 21, **వేదిక:** గేట్ అండ్ ఎలిగ్జిర్ టవర్, లెవల 4, నాలెడ్జ్ సిటీ రోడ్ మాదాపూర్
సమయం రాత్రి 7.30గంటల నుంచి

ఇన్‌ఫ్యూజన్ లైవ్

ఫ్యూజన్ మ్యూజిక్‌కు పెద్ద పీట వేస్తూ సంగీతాభిమానుల్ని అలరించేందుకు ప్రముఖ రాక్ బ్యాండ్ ఇన్‌ఫ్యూజన్ లైవ్ మ్యూజిక్ సమర్పిస్తోంది.
తేదీ: జూన్ 20, **వేదిక:** గ్రీస్ మంకీ ఎంపైర్ స్క్వేర్ బిల్డింగ్, జూబ్లీహిల్స్ సమయం:రాత్రి 8గంటల నుంచి...

వావ్ కిచెన్..



పిండి కొద్దీ రొట్టె అన్నారు పెద్దలు.. ఇప్పుడు వంట గది విషయంలోనూ ఇదే తరహా ఒరవడి నడుస్తోంది. అత్యాధునిక కిచెన్ మాడ్యుల్స్ కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. లగ్జరీ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలో ఇళ్లు, అపార్ట్‌మెంట్, గ్రూప్ హౌస్, ఇండిపెండెంట్ హౌస్.. ఎలాంటి ఇల్లైనా... అందులో ఏర్పాటు చేసే కిచెన్ విషయంలో కొనుగోలుదారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నవాటి కంటే అత్యాధునిక సదుపాయాలున్న కిచెన్ కావాలి. అందరిలోనూ ప్రత్యేకంగా ఉండాలి. బ్రాండ్ విషయంలో అసలే రాజీ పడొద్దు. విశాలమైన గదికి ఇంద్ర భవనం లాంటి అలంకరణ తోడవ్వాలి. అందుకోసం ఎల్లలు దాటి మాడ్యుల్స్‌ను ఎంపిక చేస్తున్నారు. దీంతో ఇటలీ, జర్మనీ, కొరియా, ఇండియన్ మేడ్ కిచెన్ మాడ్యుల్స్ పట్ల ఆకర్షితులవుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

- అత్యాధునిక సౌకర్యాలు, పరికరాలు
- బ్రాండ్స్‌కి పెరుగుతున్న ప్రాధాన్యత
- జర్మన్, కొరియా, ఇటలీ, ఇండియన్ మాడ్యుల్స్ పట్ల ఆసక్తి
- సెన్సార్ వైపు వినియోగదారుల ఆసక్తి

ఐలాండ్ కిచెన్ ఎంపిక చేసుకున్నాం



బిల్డర్ ఇల్లు అప్పగించిన తరువాత కిచెన్ కోసం ప్రత్యేకంగా రూ.8 లక్షలు వెచ్చించాను. ఐలాండ్ కిచెన్ కావాలని పెట్టించుకున్నాం. అక్రిలిక్ ఫినిష్ మెటీరియల్, చిమ్ని జర్మన్ హార్డ్‌వేర్ వినియోగించాం. ఆర్కిటెక్ట్ సూచించిన డిజైన్, ఫంక్షనాలిటీ నచ్చింది. – **అఖిల్, సాన్సియా విల్లాస్**

ఇంపోర్టెడ్‌పై ఆసక్తి

ఇల్లు కొనుగోలు చేసే వ్యక్తి కిచెన్ మోడ్రన్‌గా ఉండాలని ఆలోచిస్తున్నారు. మార్కెట్‌లో కొత్త మోడల్స్‌ను కోరుకుంటున్నారు. ఇతర దేశాల నుంచి మోడల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. ఖర్చు కోసం ఎవరూ వెనుకాడటం లేదు. మోడల్ నచ్చితే చాలని అంటున్నారు. వారి అభిరుచికి అనువైన మోడల్స్ కోరుతున్నారు.
– **రాకేష్ వర్మ, మికాసా, ఇంటీరియర్స్, ఆర్కిటెక్ట్స్, మాదాపూర్.**



సౌకర్యాలు, సదుపాయాల విషయంలో వినియోగదారుల ఆలోచనా విధానం మారుతోంది. ఇంటి నిర్మాణంతో మొదలై.. కిచెన్ వరకూ ప్రతిదీ కొత్తగా, సౌకర్యవంతంగా ఉండేలా చూస్తున్నారు. దీని కోసం ఎంత ఖరీదైనా చెల్లించేందుకు



వెనుకాడటంలేదు. ముఖ్యంగా కిచెన్‌లో అల్మరాలు, చిమ్నీల విషయంలో సరికొత్తవే ఎంచుకుంటున్నారు. ఆర్కిటెక్ట్‌లు కూడా కొనుగోలుదారుల అభిరుచికి అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు.

ఖర్చుకు వెనుకాడం..

నగరం నలుదిక్కుల నివాస గృహాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. సాధారణంగా అపార్ట్‌మెంట్‌లో 3 పడక గదుల ఇల్లు రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటోంది. అదే సమయంలో విల్లాలు రూ.2 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకూ పలుకుతున్నాయి. అంత మొత్తం వెచ్చించి ఇల్లు కొనుగోలు చేసిన యజమానులు ఇంటీరియర్ డెకరేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. అందులోనూ కిచెన్ విషయంలో మరింత ఆధునికత కోరుకుంటున్నారు. మహిళల అభిరుచులకు అనుగుణంగా అడుగులేస్తున్నారు. మాడ్యులర్ కిచెన్ విషయంలో ఆర్కిటెక్ట్‌లను సంప్రదిస్తూనే అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి మోడల్స్ అందుబాటులో ఉన్నాయో ఇంటర్నెట్‌లో వెతుకుతున్నారు. ప్రధానంగా ఇటలీ, కొరియన్, జర్మన్, భారతదేశంలో తయారయ్యే మోడల్స్ పట్ల వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రధాన బ్రాండెడ్ కిచెన్‌లకు డిమాండ్ ఏర్పడింది. ఒక్కో కిచెన్ గదిని ఆధునీకీకరించడానికి రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక హంగులతో నిర్మాణ సంస్థలు నివాస సముదాయాలను అందుబాటులోకి తెస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు సైతం తమ కార్యకలాపాలను నడిపిస్తున్నాయి. విల్లా, అపార్ట్‌మెంట్, ఇండిపెండెంట్ హౌస్ ఇలా ఏదైనా నిర్మాణ ప్రాంతాన్ని బట్టి, సంస్థకున్న గుర్తింపు, వినియోగదారులకు ఇస్తున్న వసతులు, మరిన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరలు నిర్ణయిస్తున్నారు. ఇంటి నిర్మాణ సమయంలోనే కిచెన్‌కు ప్రత్యేక ఆకృతిని తెస్తున్నారు.

డిజైన్, లుక్, టెక్నాలజీ..

ఇన్నాళ్లు హాల్, పడక గదికి మాత్రమే ప్రత్యేక అలంకరణలు చేసేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. వంట గదిలో అత్యాధునిక డిజైన్లు కోరుకుంటున్నారు. కిచెన్ చూడగానే అదిరిపోయే అనుభూతి కావాలని ఆశిస్తున్నారు. అదే సమయంలో అద్భుతమైన టెక్నాలజీతో మాడ్యులర్ కిచెన్ తీర్చిదిద్దాలని ఆర్కిటెక్ట్‌లను ఆశ్రయిస్తున్నారు.

సెన్సార్ సిస్టం..

కిచెన్ గదిలోకి వ్యక్తి అడుగు పెట్టగానే గోడలకున్న సెన్సార్ వ్యవస్థ విద్యుత్తు దీపాలను వెలిగిస్తుంది. గ్యాస్ స్టవ్ దగ్గర సైతం ఇలాంటి వ్యవస్థే అందుబాటులోకి వచ్చింది. గదిలో ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా, చెదలు పట్టే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఫ్రీ మెయింటెనెన్స్ కోసం గ్రనైట్ వాడకుండా క్వాడ్జ్, కొరియన్ మెటీరియల్స్ వినియోగిస్తున్నారు. ఫ్రిజ్, మైక్రో ఒవెన్, నీటి శుద్ధి యంత్రం, ఇతర వస్తువులు బయటకు కనిపించకుండా ఉడ్ వర్క్ చేయిస్తున్నారు. వంట సమయంలో వచ్చే ఆవిర్లు, పొగను బయటకు పంపే చిమ్నీలు, గ్యాస్ స్టవ్ వద్ద పొగ రాకుండా కింది భాగంలోనే ఏర్పాటు చేసే మైక్రో ఫ్యాన్లు, వంట, తినేందుకు ఉపయోగించే సామాన్లు భద్రపరచుకోవడానికి ర్యాక్‌లు, బియ్యం, పప్పులు, ఉప్పులు, ఇతర ఆహార వస్తువులు నిల్వ చేసుకోవడానికి విడివిడిగా ప్రత్యేక గ్యాలరీల కోసం ప్రత్యేకంగా జర్మన్ టెక్నాలజీ హార్డ్ వేర్ వాడుతున్నారు.



మ్యూజిక్ ఫ్రెండ్లీ.. మెట్రో మెడ్లీ..





ప్రపంచ సంగీత దినోత్సవంలో భాగంగా మెట్రో స్టేషన్లు సంగీత ప్రదర్శనలకు వేదికలుగా మారనున్నాయి. ప్రయాణాలను ఆహ్లాదకరమైన అనుభవాలుగా మారుస్తూ... బుధవారం నుంచి శనివారం వరకూ విభిన్న సంగీత ప్రదర్శనలతో ప్రయాణికులను ఆకట్టుకోనుంది. 'మెట్రో మెడ్లీ' పేరిట గోథే–జెంత్రమ్ సహకారంతో మ్యూజికల్ ఫెస్ట్ బస్కింగ్ ఫార్మాట్‌లో ఉంటుంది. దీని కోసం 200 మంది ఔత్సాహిక సంగీతకారుల నుంచి అనుభవజ్ఞులైన నిపుణుల వరకూ 20 గ్రూపులుగా విభజించారు. ఈ కళాకారులు జాజ్ క్లాసికల్ నుండి బాలీవుడ్ హిట్‌ల వరకూ విభిన్న రకాల సంగీత శైలులను ప్రదర్శిస్తారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ, అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, పరేడ్ గ్రౌండ్, ఎంజీబీఎస్, ఉప్పల్ సహా ఏడు మెట్రో స్టేషన్లను ఎంపికచేశారు. సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఔత్సాహిక సంగీత కళాకారులకు బహిరంగ వేదికలను అందించడమే ఈ ప్రదర్శనల లక్ష్యం.

లేపాక్షిలో థీమాటిక్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–69లోని నందగిరిహిల్స్‌లోని లేపాక్షి హస్తకళా షోరూంలో థీమాటిక్ ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే ప్రదర్శనలో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్స్, పెన్ కలంకారీ చీరలు, ఏలూరు కార్పెట్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేస్తూ ఈ చేతి వృత్తులను ప్రోత్సహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ చేతులకు పనిచెబుతూ కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు.



లేపాక్షి హస్తకళా షోరూంలో ఆకట్టుకుంటున్న బొమ్మలు, కార్పెట్లు

జీవనాడి సాక్షిగా నిజాలు గోదాట్లోకి

పోలవరంపై పచ్చి అబద్ధాలు వల్లించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ● డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినడానికి ముమ్మాటికీ బాబు నిర్వాకాలే కారణం

పునాది స్థాయిలో బాబు వదిలేసిన స్పిల్‌వేను 48 గేట్లతో సహా పూర్తిచేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

- స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలట్ చానల్ పూర్తి చేసి 2021 జూన్ 11న వరద మళ్లింపు
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో ఇరువైపులా ఖాళీలు వదిలేసి పనులు ఆపేసిన చంద్రబాబు
- అదే అంశాన్ని తేల్చి చెప్పిన ఐఐటీ–హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీ నివేదికలు
- చంద్రబాబు ఆ చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే పోలవరం ఎప్పుడో పూర్తయ్యేది
- డయాఫ్రమ్‌వాల్‌పై తేల్చితే ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ 2022 నుంచి కేంద్రాన్ని కోరుతూ వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- 2013–14 ధరల ప్రకారం రూ.20,396 కోట్లకే పోలవరం పూర్తి చేస్తామని బాబు ఒప్పందం
- తాజా ధరల ప్రకారం నిధులిచ్చి సత్వరమే ప్రాజెక్టు పూర్తికి సహకరించాలని 2019 నుంచి కేంద్రాన్ని కోరిన వైఎస్ జగన్
- తొలిదశ పూర్తికి రూ.12,157 కోట్ల మంజూరుకు ఈ ఏడాది మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు జల్ శక్తి శాఖ ప్రతిపాదన
- అప్పటికే బీజేపీతో జతకట్టిన బాబు.. రాజకీయంగా తమకు ఇబ్బంది తప్పదని అడ్డుపుల్ల
- ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున కనీసం ఇప్పుడైనా ఆమోదముద్ర వేయించాలని సూచిస్తున్న సాగునీటి నిపుణులు



సాక్షి, అమరావతి: పోలవరం సాక్షిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వాస్తవాలను గోదాట్లో కలిపేశారు! 2014–19 మధ్య అధికారంలో ఉండగా కమీషన్లకు ఆశ పడి తాను చేసిన తప్పిదాల వల్ల ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం.. ఫలితంగా పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెడుతూ నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లించారు. చంద్రబాబు సర్కార్ చేసిన తప్పులను సరిదిద్దుతూ.. కరోనా లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలట్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా 6.1 కిమీల పొడవున వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లించింది. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండా ఎర్త్ కమ్ రాక్ ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో 1,396 మీటర్ల పొడవున డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించడం ద్వారా చంద్రబాబు సర్కార్ చారిత్రక తప్పిదానికి పాల్పడిందని.. ఆ తప్పు జరిగి ఉండకపోతే 2022 నాటికే అప్పటి సీఎం వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని సాగునీటిరంగ నిపుణులు, అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక చంద్రబాబు తొలిసారిగా పోలవరం పనులను సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

చారిత్రక తప్పిదంతో కోతకు గురైన డయాఫ్రమ్‌వాల్..

- విభజన చట్టం ప్రకారం కేంద్రమే నిర్మించాల్సిన పోలవరాన్ని కమీషన్లకు ఆశ పడి దక్కించుకున్న చంద్రబాబు సర్కార్ ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కింది. సులభంగా చేయగలిగి, కాంట్రాక్టర్లకు అధికంగా లాభాలు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చింది.
- ప్రపంచంలో ఎక్కడైనా సరే వరదను మళ్లించేలా స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌లు కట్టాకే ప్రధాన డ్యామ్ పనులు చేపడతారు. 2014–19 మధ్య పోలవరంలో చంద్రబాబు సర్కార్ అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. గోదావరి వరదను మళ్లించే స్పిల్‌వే పునాది స్థాయి కూడా దాటలేదు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను ప్రారంభించనే లేదు. కానీ.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్ పనులను 2017లో ప్రారంభించి 2018 జూన్ 11 నాటికి పూర్తి చేశారు. 35 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామంటూ హామీ ఇచ్చి 2018 నవంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులను ప్రారంభించారు. ఇదే ప్రధాన డ్యామ్‌గా చిత్రీకరించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నించారు.
- 2019 ఫిబ్రవరి నాటికి కూడా నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడంతో పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ), సీడబ్ల్యూసీ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ కాఫర్ డ్యామ్‌ల పనులు చేయాలని ఆదేశించింది. అయితే పునరావాసం కల్పించలేక ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి పనులు ఆపేశారు.
- 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో అదే ఏడాది మే 30న సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టారు. అయితే జూన్ రెండో వారంలోనే గోదావరికి వరద ప్రారంభమైంది. అంటే.. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి, గోదావరి వరద ప్రారంభం కావడానికి మధ్య కేవలం 10 నుంచి 12 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ వ్యవధిలో కాఫర్ డ్యామ్‌లలో ఖాళీ ప్రదేశాలను భర్తీ చేయడం ఎలా సాధ్యమన్నది చంద్రబాబే చెప్పాలి.
- గోదావరికి 2019లో భారీగా వరదలు వచ్చాయి. పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 2.4 కి.మీ. వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి వరద.. కాఫర్ డ్యామ్‌లు వదిలిన 800 మీటర్ల ఖాళీ ప్రదేశానికి కుచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో వరద ఉధృతి పెరిగి డయాఫ్రమ్‌వాల్‌లో నాలుగు చోట్ల కోత గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై గ్యాప్–1లో 35 మీటర్ల లోతు, గ్యాప్–2లో 26 నుంచి 36.50 మీటర్ల లోతుతో కూడిన అగాధాలు ఏర్పడ్డాయి.
- వీటిన్నింటినీ అధ్యయనం చేసిన ఐఐటీ–హైదరాబాద్, ఎన్‌హెచ్‌పీసీ(నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) సంస్థలు మానవ తప్పిదం వల్లే పోలవరంలో విధ్వంసం చోటుచేసుకుందని తేల్చి చెప్పాయి. అంటే ఆ తప్పిదం చేసింది చంద్రబాబేనని తేల్చి చెప్పాయని అధికారులు, సాగునీటిరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

విధ్వంసం వల్లే పనుల్లో జాప్యం..

నాడు చంద్రబాబు చారిత్రక తప్పిదాన్ని వైఎస్ జగన్ అధికారంలో ఉండగా సరిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర జల్ శక్తి శాఖ, పీపీఏ, సీడబ్ల్యూసీ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ చంద్రబాబు సర్కార్ నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ పద్ధతిలో నవయుగకు అప్పగించిన రూ.2,917 కోట్ల విలువైన కాంట్రాక్టు ఒప్పందాన్ని 2019 జూలైలో వైఎస్ జగన్ రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. తద్వారా ఖజానాకు రూ.783.44 కోట్లు ఆదా చేశారు. గోదావరి వరద తగ్గాక 2019 నవంబర్‌లో వడివడిగా పనులు ప్రారంభించారు. అయితే 2020 మార్చి నుంచి 2021 చివరి వరకూ కరోనా మహమ్మారి విజృంభించడంతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించారు. అలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ గోదావరి వరదను మళ్లించేలా స్పిల్‌వేను 48 గేట్లు బిగించడంతోసహా పూర్తి చేసి ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. అప్రోచ్ చానల్, స్పిల్ చానల్, పైలట్ చానల్‌ను పూర్తి చేశారు. 2021 జూన్ 11న గోదావరి వరదను స్పిల్‌వే మీదుగా 6.1 కి.మీ.ల పొడవున మళ్లించారు. దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు చేపట్టి పూర్తి చేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి కావడంతో ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో చేరిన నీటిని తోడివేసి వరదల ఉధృతి వల్ల ఏర్పడిన అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్‌వాల్ నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించి అనుసంధానం చేయాలా? అనే విషయాన్ని సీడబ్ల్యూసీ తేల్చలేదు. సాంకేతికపరమైన ఈ అంశాన్ని తేల్చితే పనులు చేపట్టి వేగవంతంగా ఈసీఆర్ఎఫ్ పనులు పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి గత ప్రభుత్వం కేంద్ర జల్ శక్తి శాఖ, సీడబ్ల్యూసీని కోరుతూ వచ్చింది. డయాఫ్రమ్ వాల్‌సహా ప్రాజెక్టు డిజైన్లపై కాంట్రాక్టు సంస్థ ఒక అంతర్జాతీయ ఏజెన్సీ సహకారం తీసుకోవాలని, తాము కూడా ఒక అంతర్జాతీయ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని.. రెండు సంస్థలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన డిజైన్‌ను ఆమోదించి పనులు చేయాలని సీడబ్ల్యూసీకి చెబుతూ వచ్చింది. నాడు చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే విధ్వంసం జరిగేదే కాదని.. ఇప్పుడు పనుల్లో జాప్యానికి అదే కారణమవుతోందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.12,157.53 కోట్లకు మోకాలడ్డు

పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేస్తానని 2016 సెప్టెంబరు 7న చంద్రబాబు కేంద్రానికి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఒప్పందం చేసుకున్నారు. 2013–14 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లే. ఇందులో 2014 ఏప్రిల్ 1 వరకూ చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లుపోనూ మిగతా రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయితే 2017–18 ధరల ప్రకారం పునరావాసం, భూసేకరణ వ్యయమే రూ.33,168.23 కోట్లు ఉంది. అందువల్ల రూ.20,398.61 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని, తాజా ధరల మేరకు నిధులిచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని 2019 మే 30 నుంచి పలుదఫాలు ప్రధాని మోదీని అప్పటి సీఎం వైఎస్ జగన్ కోరుతూ వచ్చారు. దానికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు అవసరమని కేంద్ర జల్ శక్తి శాఖ తేల్చింది. ఆ మేరకు నిధులు విడుదల చేయాలని మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అప్పటికే బీజేపీతో పొత్తు కుదరడంతో పోలవరానికి నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ముందు పెట్టవద్దని, తమకు రాజకీయంగా ఇబ్బందులు వస్తాయంటూ చంద్రబాబు అడ్డుపుల్ల వేశారు. దీంతో అప్పట్లో కేంద్ర కేబినెట్ ఆ ప్రతిపాదనపై ఆమోదముద్ర వేయలేదు. ప్రస్తుతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న ఆ ప్రతిపాదనపై కేంద్ర కేబినెట్‌తో ఆమోదముద్ర వేయిస్తే నిధుల సమస్య తీరుతుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. సాంకేతిక సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం సీడబ్ల్యూసీ ద్వారా ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ఆ ప్రణాళికను అమలు చేయడం ద్వారా ప్రాజెక్టు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సాగునీటిరంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఇక 2029 నాటికే..

గోదావరి వరదల ప్రభావం వల్ల నవంబర్ వరకూ పోలవరం పనులు చేపట్టడానికి సాధ్యం కాదు. డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని సీడబ్ల్యూసీ తేల్చితే నాలుగు సీజన్లలో పోలవరాన్ని పూర్తి చేయవచ్చని అధికారులు చెబుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నాటి టీడీపీ సర్కారు తప్పిదాలను వైఎస్ జగన్ చక్కదిద్దినప్పటికీ పోలవరాన్ని 2029 నాటికి గానీ పూర్తి చేయలేమని చంద్రబాబు అంగీకరించారని సాగునీటిరంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

కాఫర్ డ్యామ్‌ల లీకేజీల పాపం బాబు సర్కార్‌దే

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను చేపట్టడానికి వీలుగా లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి జెట్ గ్రౌటింగ్ చేయాలి. అయితే నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం గోదావరి నదిలో ఇసుక పర్మియబులిటీ విలువను 2018లో అప్పటి కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ తప్పుగా మదింపు చేసింది. దాన్నే పరిగణనలోకి తీసుకుని 30 నుంచి 35 మీటర్ల లోతువరకూ స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేయకుండా కేవలం 20 మీటర్ల లోతు వరకూ జెట్ గ్రౌటింగ్ చేసేలా డిజైన్‌లు రూపొందించింది. నవయుగ సంస్థ ఆ మేరకే జెట్ గ్రౌటింగ్ చేసి కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. జెట్ గ్రౌటింగ్ నిబంధనల మేరకు చేసి ఉంటే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీ సమస్య ఉత్పన్నమయ్యేది కాదని సాగునీటిరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తన హయాంలో జరిగిన ఈ తప్పిదాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెట్టేందుకు సీఎం చంద్రబాబు యత్నించడం గమనార్హం.

అద్భుత భవనాలపై 'అగ్లీ' ఏడుపు

రూ.700 కోట్లతో నాసిరకంగా తాత్కాలిక సచివాలయం నిర్మించిన నాటి టీడీపీ ప్రభుత్వం

రూ.400 కోట్లతోనే ఐకానిక్ భవనాలు నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలివి
- శిథిలమైన హరిత రిసార్ట్స్ స్థానంలో నూతన భవనాల నిర్మాణం
- ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం
- 61 ఎకరాలకు గాను 9.88 ఎకరాల్లోనే నిర్మాణాలు
- 2021లోనే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సమగ్ర వివరాలిచ్చిన ప్రభుత్వం
- విశాఖ ఖ్యాతిని మరింతగా ఇనుమడించేలా, రాష్ట్రానికే తలమానికంగా భవనాలు
- ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఫైవ్ స్టార్ వసతులతో నిర్మాణం
- విశాఖ నుంచి పరిపాలనకు ఈ భవనాలు అనువైనవని తేల్చిన అధికారుల కమిటీ
- దీంతో ఈ భవనాల్లో సీఎం నివాసం, కార్యాలయానికి అనుకూలంగా కొన్ని మార్పులు
- అయినా సొంత భవనాలంటూ టీడీపీ నేతల గగ్గోలు
- మంచి చేయడమే కాదు.. మంచిని అంగీకరించడమూ చేతకాని టీడీపీ



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి చేయడం అనేది తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ ప్రభుత్వానికి చేతకాదు. విభజిత రాష్ట్రానికి 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ.. ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని సాగదీసి, స్వలాభం చూసుకోవడమే తప్ప, రాష్ట్రానికి చేసిన మంచి ఒక్కటీ లేదు. రాజధాని పేరుతో చేసిన విధ్వంసం, తాత్కాలిక సచివాలయాల పేరుతో నిర్మించిన నాసి రకం భవనాలు, పోలవరం ప్రాజెక్టులో తప్పులు.. ఇలా అన్నీ రాష్ట్రానికి తలవంపులు తెచ్చే పనులే. ఇప్పుడూ అదే చేస్తోంది టీడీపీ. రుషికొండపైన అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా, విశాఖ ఖ్యాతిని మరింతగా పెంచేలా అద్భుత భవనాలను నిర్మిస్తే, దానిపై వికృత రాజకీయం చేస్తోంది. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ భవనాలను నిర్మిస్తే వాటిపై చేస్తున్న విష ప్రచారం ఆ పార్టీ సంస్కృతికి నిదర్శనం. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు చేస్తున్న కపట నాటకం. రూ.700 కోట్లతో తమ ప్రభుత్వం నిర్మించిన తాత్కాలిక సచివాలయం చిన్న వర్షానికే లీకైపోయి, నీరంతా గదుల్లో ప్రవహించగా.. ఇప్పుడు కేవలం రూ. 400 కోట్లతో రుషికొండపై విశాఖకే కాక యావత్ రాష్ట్రానికే తలమానికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఈ ఐకానిక్ భవనాలను చూసి తల ఎక్కడ పెట్టుకోవాలో టీడీపీ అధినేతలకే తెలియడంలేదు. అందుకే ఈ అగ్లీ (చెత్త)ఏడుపు.

విశాఖపట్నంలోని బీచ్‌కి ఆనుకొని రుషికొండపై రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన హరిత రిసార్ట్స్ భవనాలు చాలా కాలం క్రితం నిర్మించినవి. అవి శిథిలమై ప్రమాదకరంగా మారడంతో వాటిని తొలగించి, కొత్త భవనాలు కట్టాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరిపింది. ప్రపంచ స్థాయిలో, 5 స్టార్ వసతులతో అత్యాధునికంగా, విశాఖ నగర ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేసేలా డిజైన్లు రూపొందింది. అనంతరం సీఆర్‌జెడ్ పరిమితులకు లోబడి నిర్మాణాలు ప్రారంభించింది. రుషికొండపై ఏ భవనాలు, ఎందుకు నిర్మిస్తున్నారో సమగ్ర వివరాల్ని 2021లోనే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో ఫైవ్ స్టార్ పర్యాటక విడిది కేంద్రంగా మొత్తం రూ.412 కోట్లుతో 7 బ్లాకుల్ని నిర్మించింది. రుషికొండ మొత్తం 61 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 9.88 ఎకరాల విస్తీర్ణంలోనే ఈ భవనాలు నిర్మించింది. గతంలో హరిత రిసార్టు 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుత భవనాలు 19,968 చ.మీ విస్తీర్ణంలో ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు వీలుగా నిర్మించారు. ప్రెసిడెన్షియల్ సూట్, సూట్ రూమ్, బాంక్వెట్ హాల్‌తో విజయనగర బ్లాకు, ప్రెసిడెన్షియల్ సూట్ రూమ్స్, సూట్ రూమ్స్, డీలక్స్ గదులు, బాంక్వెట్ హాల్‌తో కళింగ బ్లాక్ నిర్మించింది. సూట్ రూమ్‌లు, కాన్ఫరెన్స్ హాల్‌తో పల్లవ బ్లాక్, సమావేశ మందిరాలతో చోళ బ్లాక్, రిక్రియేషన్ లాంజ్, బిజినెస్ సెంటర్‌తో గజపతి బ్లాక్, ప్రైవేట్ సూట్ రూమ్‌లతో వేంగిబ్లాక్, రెస్టారెంట్స్, లాంజ్, కిచెన్, పార్కింగ్ సౌకర్యాలతో ఈస్టర్న్ గంగా బ్లాక్‌లని నిర్మించింది.


విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తే..

విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేస్తే, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తలంచింది. ఇందుకు ఏర్పాట్లూ ప్రారంభించింది. విశాఖలో పాలన ప్రారంభించడానికి అనువైన భవనాల పరిశీలనకు ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ విశాఖలోని పలు భవనాలను పరిశీలించింది. వీటిలో రుషికొండపై నిర్మించిన భవనాలు ప్రభుత్వ కార్యకలాపాలకు అనువైనవని తేల్చింది. ఇక్కడ ముఖ్యమంత్రి నివాసం, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఇవి అనువుగా ఉంటాయని వెల్లడించింది. అప్పట్నుంచి ఈ భవనాల్లో సీఎం నివాసం, కార్యాలయానికి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. వాటిని నిర్మించింది ప్రభుత్వం. పనులు జరిగింది ఏపీటీడీసీ ఆధ్వర్యంలో. ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమాలు, అంతర్జాతీయ సదస్సులు ఇక్కడే నిర్వహించేందుకు వీలుగా అత్యద్భుతంగా ఫైవ్‌స్టార్ హోటల్స్‌ని తలదన్నేలా వీటి నిర్మాణం జరిగింది. సుందర విశాఖ సాగర తీరంలో అద్భుతంగా, రాష్ట్రానికి అంతర్జాతీయంగా పేరు తెచ్చేలా నిర్మించిన ఈ భవనాలను చూసి గర్వపడాలి కానీ.., ఎవరో సొంతగా భవనాలు కట్టేసుకొన్నట్లుగా టీడీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతల ఏడుపులు, పెడబొబ్బలు, వికృత రాజకీయాలు ఎందుకు? అవి ప్రభుత్వం నిర్మించిన భవనాలు. అనుమతి ఉన్న వారు ఎవరైనా వెళ్లొచ్చు. అయినా, టీడీపీ నేతలు ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రభుత్వం భవనం లోపలికి వెళ్లి, ఫొటోలు దిగి, వీడియోలు తీసి చెడు ప్రచారం చేయడం నీచత్వానికి పరాకాష్ఠ. మంచి చేయడమే కాదు.. మరొకరు చేసిన మంచిని అంగీకరించడం కూడా చేతకాదని వారికి వారే నిరూపించుకోవడమే.

పోలవరం మరో నాలుగేళ్లకే

అది కూడా అంతా సవ్యంగా జరిగితేనే పూర్తి: సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం పూర్తి కావాలంటే మరో నాలుగు సీజన్లు అంటే నాలుగు సంవత్సరాలు పడుతుందని అధికారులు చెబుతున్నారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అది కూడా అన్నీ సవ్యంగా జరిగితేనే నాలుగేళ్లు పడుతుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాలు ప్రాజెక్టుకు శాపాలుగా మారాయని ఆరోపించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం చంద్రబాబు ఎంపిక చేసిన మీడియాతో మాట్లాడారు. తొలుత స్పిల్‌వే బ్లాక్–26 వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. గైడ్ బండ్, గ్యాప్ 1, 2, 3, డీఎస్ఈడీ పవర్ హౌస్ డౌన్ స్ట్రీమ్, అప్ స్ట్రీమ్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.



చంద్రబాబుకు ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

రివర్స్ టెండరింగ్‌తో ఆగిపోయింది..

గతంలోనే తమ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతానికి పైగా పూర్తి చేసిందని, అదే వేగంతో పనులు కొనసాగి ఉంటే 2020 చివరి నాటికే పూర్తయ్యేదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేసిందన్నారు. ఇరిగేషన్ కేటాయింపులు రూ.7,100 కోట్లకు తగ్గించి అది కూడా కాంట్రాక్టర్లకు అడ్వాన్సులుగా చెల్లించారన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మించామని చెప్పారు. గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేయనివ్వకుండా కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ సిబ్బందిని మార్చడం లాంటి చర్యలకు పాల్పడిందన్నారు. కేంద్ర జలసంఘం అధికారులు వారించినా పెడచెవిన పెట్టిందన్నారు. 2019, 2020లో అధిక వర్షాల కారణంగా డయాఫ్రమ్ వాల్‌కు నాలుగు చోట్ల నష్టం వాటిల్లడంతో 35 శాతం దెబ్బతిందని చెప్పారు. దెబ్బతిన్న డయా ఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేయాలంటే రూ.447 కోట్లు ఖర్చవుతుందని, దానికి సమాంతరంగా మళ్లీ కొత్తగా నిర్మించాలంటే రూ.996 కోట్ల వ్యయం అవుతుందని చెప్పారు.

'సాక్షి'కి నో ఎంట్రీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం వద్ద అధికారికంగా నిర్వహించిన విలేకరుల సమావేశానికి 'సాక్షి'తో పాటు మరో మూడు ఛానళ్లకు అనుమతి లేదని ఐ అండ్ పీఆర్ అధికారి స్పష్టం చేశారు. ఈ మేరకు ఉన్నత స్థాయి నుంచి తమకు ఆదేశాలు అందాయని, జాబితా ప్రకారం సాక్షి మీడియా, 10 టీవీ, ఎన్ టీవీ, టీవీ 9లకు అనుమతులు లేవని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ దళిత నేత వినూత్న నిరసన

కూల్చివేసిన తన భవనం ఎదుట శిరోముండనం.. టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తీరుపై ఆగ్రహం

పాయకాపురం (విజయవాడ రూరల్): విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా కక్షసాధింపు చర్యలకు పాల్పడటాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ దళిత నేత, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు నందెపు జగదీష్ సోమవారం శిరోముండనం చేయించుకుని అర్ధనగ్న ప్రదర్శన చేశారు. రెండు రోజుల క్రితం విజయవాడ ప్రకాశ్‌నగర్‌లో జగదీశ్‌కు చెందిన భవనాన్ని ఆక్రమిత స్థలమంటూ మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆ భవనం ఎదుట జగదీశ్ తన కుటుంబ సభ్యుల సమక్షంలో గుండు గీయించుకుని బొండా ఉమా తీరు పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగదీశ్ తాను కొనుగోలు చేసిన స్థలంలో 2014లో ఎమ్మెల్యేగా ఉన్న బొండా ఉమా చేతుల మీదుగానే భూమి పూజ చేయించానని తెలిపారు. అప్పుడు లేని ఆక్రమణలు ఇప్పుడెలా వచ్చాయని ప్రశ్నించారు. గతంలో తాను టీడీపీలో ఉన్నానని, కార్పొరేటర్‌గా గెలుపొందానని గుర్తుచేశారు. నాడు బొండా ఉమా ఎమ్మెల్యేగా గెలుపొందడానికి కూడా ఎంతో కృషి చేశానన్నారు. తిరువూరులో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పగా 'నా కింద పనిచేసే దళితుడవు.. ఎమ్మెల్యేగా పోటీ చేస్తావా' అంటూ బొండా తనపై కోపం పెంచుకున్నారని ఆరోపించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తాను వైఎస్సార్‌సీపీకి పనిచేశానని, ఆ కక్షతో ఎమ్మెల్యే బొండా ఉమా తన భవనం అక్రమ కట్టడమని అధికారులతో కూల్చివేయించారని మండిపడ్డారు. తాను, తన భార్య ఆయన కాళ్లు పట్టుకోవాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఒక దళితుడిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, కాళ్లమీద పడితే వదిలేస్తానని చెప్పడం నీతిమాలిన చర్య అని దుయ్యబట్టారు. తాను బొండా ఉమా మాదిరిగా స్వాతంత్ర్య సమరయోధుల స్థలాలను ఆక్రమించుకోలేదన్నారు. భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో ఆయనకు అక్రమ కట్టడాలు ఉన్నాయన్నారు. తాను కాట్రగడ్డ హరిబాబు అనే వ్యక్తి నుంచి 224 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి అన్ని అనుమతులు తీసుకొని భవనం నిర్మించుకున్నానని జగదీశ్ స్పష్టం చేశారు. టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తనపై చేస్తున్న కక్షసాధింపు చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కాగా తన భార్యకు కూడా శిరోముండనం చేయించేందుకు జగదీశ్ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.



టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తీరుకు నిరసనగా శిరోముండనం చేయించుకుంటున్న నందెపు జగదీశ్

13 రోజుల్లో మూడుసార్లు

ఆమె ఎవరెస్ట్‌ను జయించింది!



పూర్ణిమా శ్రేష్ఠ

పదమూడు రోజుల్లో మూడుసార్లు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి ప్రపంచంలోనే మొదటి మహిళగా పూర్ణిమా శ్రేష్ఠ గుర్తింపు పొందింది. నేపాల్‌లో వృత్తి రీత్యా ఫొటో జర్నలిస్ట్ అయిన 33 ఏళ్ల పూర్ణిమ, సాటి మహిళలను ప్రోత్సహించడానికి సవాళ్లనే సోపానాలుగా చేసుకుంటున్నాను అంటోంది.

‘ప్రపంచంలో ఒకే సీజన్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని మూడుసార్లు అధిరోహించిన మొదటి మహిళగా గుర్తింపు రావడం ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. పర్వతారోహణలో పాల్గొంటున్న మహిళలను ఇప్పటికీ వేళ్లమీద లెక్కించవచ్చు. వారికి ఆసక్తి ఉంటుంది. కానీ, భయంతో వెనకంజ వేస్తుంటారు. ఇప్పుడు చాలామంది యువతులు పర్వతారోహణ గురించి నన్ను కలుస్తుంటారు. వారిలో ప్రభావంతమైన మార్పును తీసుకు రాగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది. రాబోయే రెండేళ్లలో 14 మంది మహిళలను ఎవరెస్ట్ అధిరోహణకు తీసుకెళ్లగలనని నమ్మకం ఉంది.

మూస పద్ధతికి స్వస్తి...

ఎప్పుడూ ఒక విధమైన జీవనంలో మూసపద్ధతిలో కొనసాగడం నాకు ఇష్టం ఉండదు. అలాగని నేనేమీ సంపన్నుల ఇంట్లో పుట్టలేదు. మా అమ్మానాన్నలు నేపాల్‌లోని గోర్ఖా ప్రాంతంలోని మారుమూల గ్రామంలో నివసిస్తున్న రైతులు. నా చిన్నప్పుడు ఇంట్లో ఎప్పుడూ నీటి కొరత ఉండేది. రాగిబిందెతో కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు మోసుకొచ్చేదాన్ని. ఆ కష్టం నాలో సవాళ్లకు మార్గం చూపింది. ఇప్పటివరకు ఎనిమిది శిఖరాలను అధిరోహించాను. నా సవాళ్ల సాధన కోసం నా స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల నుండి డబ్బు తీసుకున్నాను. గైడింగ్ కంపెనీ నుండి కొంత లోన్ తీసుకున్నాను. తిరిగి ఈ అప్పు తీర్చడానికి మౌంటనీయర్ గైడ్‌గా చేయాలనుకుంటున్నాను. రికార్డ్ సాధించి, పర్వతారోహణలో మహిళలు పాల్గొనడానికి ఉన్న అడ్డంకులను తొలగించాలన్నది నా లక్ష్యం. చాలామంది అడ్డు చెప్పారు. కానీ, 8,000 కిలోమీటర్ల రికార్డ్‌ను సాధించాను. ‘ఒక సాధారణ అమ్మాయి రికార్డ్ బ్రేక్ చేసింది’ అనే మాటలు విన్నప్పుడు, ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉన్నాను.

అలసట కలిగినా..

ఈ వసంత కాలంలో ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు సులువుగానే అధిరోహించాను. తర్వాత మూడవసారి కొంచెం అలసటతో కిందటి నెల 25వ తేదీని అధిరోహణ ప్రారంభమైంది. నా గైడ్, నేను ఈ అధిరోహణకు బయల్దేరాం. అలసటతో నా అడుగులు భారంగా అనిపించాయి. శిఖ



రాగ్రానికి చేరుకోవడానికి మధ్యలోనే అలసటతో కొంతసేపు నిద్రలోకి జారుకున్నాను. నిద్రలేపడానికి గైడ్ నా ముఖంపైకి మంచుగడ్డలను విసరాల్సి వచ్చింది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో త్వరగానే తేరుకున్నాను. ఒక్కో అడుగు వేయడంపై దృష్టి పెట్టి మధ్యాహ్నం ఒంటి గంటకు శిఖరాగ్రానికి చేరుకుని రికార్డ్ సృష్టించాను. దాదాపు ఒక గంటపాటు పై భాగంలోనే ఉన్నాం. నేను చాలా ఉద్వేగానికి లోనయ్యాను.

కలల సాధనకు కృషి

స్కూల్ చదువు పూర్తయ్యాక ఫొటో జర్నలిజం చేశాను. 2017లో ఎవరెస్ట్ మారథాన్ కవర్ చేసే ఫొటోగ్రఫీ అసైన్‌మెంట్ సమయంలో పర్వతారోహణ ప్రపంచానికి పరిచయం అయ్యాను. పర్వతాలను కలుసుకోవడానికి అంత సమయం పట్టిందే అని చాలా బాధపడ్డాను. శిఖరపు అంచున నిలబడి, అక్కడినుంచి ప్రపంచాన్ని చూడటంలోని కష్టాన్ని అర్థం చేసుకోవాలనుకున్నాను. చాలా మంది స్త్రీలు ఇంటిపని కోసం మాత్రమే పుట్టారని అనుకుంటారు. గ్రామాల్లో చాలామంది అమ్మాయిలు మధ్యలోనే చదువు మానేస్తుంటారు. పెళ్ళే జీవనసాఫల్యంగా ఉంటారు. ఆ తర్వాత వెంటనే మాతృత్వం. ఇంటిపనులతో జీవితం. ఇలా ఉండకూడదు నా జీవనం అనుకున్నాను. 2018లో నా పర్వతారోహణ ప్రక్రియను ప్రారంభించాను. 2022లో కాంచన్ జంగా, లోత్సే, మకాలును అధిరోహించాను. అదే నెలలో అతి తక్కువ రోజుల్లో మూడుసార్లు ఎవరెస్ట్‌ను అధిరోహించగలననే నమ్మకం కలిగింది. ఎవరెస్ట్ పైనుంచి కొత్తగా లేదా గొప్ప పనిచేస్తే ప్రజలు ముఖ్యంగా మహిళల్లో మార్పు వస్తుంది అనుకున్నాను. వాళ్లు కూడా తమ పట్ల శ్రద్ధ వహిస్తారని నా నమ్మకం. ప్రజలలో మహిళల పట్ల ఉన్న అభిప్రాయాన్ని మార్చడమే నా ఉద్దేశ్యం. తమ సామర్థ్యాలను విశ్వసించ లేనివారు కలలను సాకారం చేసుకోలేరు.. మనం ఏం సాధించాలని అనుకుంటున్నామో దానిని మనలోనే అన్వేషించాలి. అప్పుడు మనలోని అంకిత భావం, ధైర్యంతో ముందడుగు వేస్తే ఆ ఆశయమే అత్యున్నత శిఖరాలను చేర్చుతుంది’’ అని వివరించే పూర్ణిమ మాటలు యువతకు స్ఫూర్తిని కలిగిస్తాయి.

బీ గుడ్ డూ గుడ్



ఖుష్బూ గాంధీ

మనదేశంలో ఏడాదికి 9,400 టన్నుల ప్లాస్టిక్ వేస్ట్ కాలువలు, నదుల్లోకి చేరుతోంది. ఇందులో ఎక్కువ భాగం ప్యాకింగ్‌కు ఉపయోగించినదే ఉంటోంది. ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నాం. ఓ చిన్న హెయిర్ ఆయిల్ బాటిల్‌ని ప్యాక్ చేయడానికి దానికంటే నాలుగురెట్లు బరువున్న ప్యాకింగ్ మెటీరియల్‌ని ఉపయోగిస్తారు. అందులో కాగితంతో చేసిన అట్టపెట్టె ఉంటుంది. బాటిల్ పగలకుండా ప్లాస్టిక్ బబుల్ రేపర్ ఉంటుంది. కాగితం ఇట్టే మట్టిలో కలిసిపోతుంది. దాంతో ఇబ్బంది ఉండదు. మరి ప్లాస్టిక్ బబుల్ ర్యాపర్ ఎన్నేళ్లకు మట్టిలో కలుస్తుంది. ‘వస్తువులు రవాణాలో పగలకుండా ఉండాలంటే బబుల్ ర్యాపర్ ప్లాస్టిక్‌తోనే చేయాలా? కొబ్బరిపీచుతో బబుల్ ర్యాప్ చేసాను చూడండి’ అంటూ కుషన్‌ను పోలిన కాయిర్ పౌచ్‌ను చూపించింది ఖుష్బూ గాంధీ. అలాగే కాయిర్ బోర్డ్‌లో ఒక పొరలోకి గాలిని చొప్పించి బుడగలు తెప్పించింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఖుష్బూ గాంధీ నిఫ్ట్‌లో మెటీరియల్ డెవలప్‌మెంట్ కోర్సు చేసింది. ‘గో డూ గుడ్’ స్టార్టప్ ద్వారా ఎకో ఫ్రెండ్లీ ప్యాకింగ్ మెటీరియల్‌ని తయారు చేస్తోంది. ప్లాస్టిక్‌కి వ్యతిరేకంగా తనదైన శైలిలో ఉద్యమిస్తోన్న ఖుష్బూ... ‘ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి’ అని మైకులో గొంతుచించుకుంటే సరిపోదు, ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయం చూపిస్తే ఆటోమేటిగ్గా ప్లాస్టిక్‌ని దూరం పెట్టేస్తారు’ అంటోంది. ఇంకా...‘నా ప్రయోగాలు నాకు లాభాలను తెచ్చిపెడతాయో లేదో తెలియదు, కానీ సస్టెయినబుల్ లైఫ్ స్టయిల్ వైపు సమాజాన్ని నడిపించడంలో మాత్రం విజయవంతం అవుతాను’ అంటోంది ఖుష్బూ గాంధీ.

ఎకో ఫ్రెండ్లీ సిరా!

‘‘ప్లాస్టిక్ బబుల్ ర్యాపరే కాదు, పేపర్ మీద ప్రింటింగ్ కోసం ఉపయోగించే ఇంక్ కూడా అంత త్వరగా నేలలో ఇంకదు. పైగా మట్టిని కలుషితం చేస్తుంది. సీ వీడ్ (సముద్ర నాచు), నాచురల్ కలర్ పిగ్మెంట్స్‌తో ఇంకు తయారు చేశాం. ఒకసారి ఉపయోగించి పారేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్‌కు బదులు వ్యవసాయ వ్యర్థాలతో ప్లేట్లు తయారు చేస్తున్నాం. ఇక్కడ మరో విషయం చెప్పాలి.





ఒకసారి వాడిపారేసే పేపర్ ప్లేట్‌లు, గ్లాసులకు ల్యామినేషన్‌తో కోటింగ్ వేస్తుంటారు. నేను దానికి కూడా ప్రత్యామ్నాయం కనుక్కున్నాను. ఎకో ఫ్రెండ్లీ కోటింగ్ చేస్తున్నాం. ‘గో డూ గుడ్’ ద్వారా మేము పది టన్నుల ప్లాస్టిక్ వాడకాన్ని నివారించగలిగాం. అలాగే ఎకో ఫ్రెండ్లీ ఇంక్‌తో ఒకటిన్నర లక్షల ఉత్పత్తులు అక్షరాలద్దుకున్నాయి. ఏడు టన్నుల బయో డీగ్రేడబుల్ బబుల్ ర్యాపర్‌లను వాడుకలోకి తెచ్చాం. ఈ ప్రయత్నంలో ఐదు టన్నుల వ్యవసాయ వ్యర్థాలు వినియోగంలోకి వచ్చాయి.

లధాక్‌లో ప్లాస్టిక్ వేస్ట్!

నేను ఈ రంగంలోకి అడుగు పెట్టడానికి కారణం పదేళ్ల కిందటి లధాక్ పర్యటన. మారుమూల ప్రదేశాలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి ఉన్నాయి. షాంపూ సాషే నుంచి లేస్ ర్యాపర్ వరకు అవీ ఇవీ అనే తేడా లేకుండా ప్రతి పదార్థమూ ప్లాస్టిక్‌లోనే ప్యాక్ అవుతోందని నాకు తెలిసిందప్పుడే. ఆ చెత్త కాలువల్లోకి చేరకుండా అంతటినీ ఒకచోట పోగు చేసి తగలబెడుతున్నారు. వాళ్లకు చేతనైన పరిష్కారం అది. ఇంతకంటే పెద్ద పరిష్కారమార్గాన్ని కనుక్కోవాలని అప్పుడు అనిపించింది. ఆ తర్వాత నేను మెటీరియల్ డెవలప్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం స్పెయిన్‌కెళ్లాను. కోర్సు పూర్తయ్యేలోపు నా ఆలోచనకు ఒక స్పష్టమైన రూపం వచ్చింది. బయోడీగ్రేడబుల్ వస్తువులతో ప్లాస్టిక్‌కి సమాధానం చెప్పవచ్చనే ధైర్యం వచ్చింది. పీజీ పూర్తయి తిరిగి ఇండియాకి రాగానే మా తమ్ముడు, మా వారితో కలిసి పూణేలో నా డ్రీమ్ ప్రాజెక్ట్ ‘గో డూ గుడ్’కు శ్రీకారం చుట్టాను. ఇది విజయవంతంగా నడుస్తోంది’’ అని వివరించిందామె. ఖుష్బూ పేరుకు తగినట్లు పరిమళభరితంగా తన విజయ ప్రస్థానాన్ని రాసుకుంటోంది. మరి... మనం మన చరిత్రను ఏ సిరాతో రాసుకుందాం... మట్టిని కలుషితం చేసే ఇంకుతోనా లేక మట్టిలో కలిసిపోయే ఇంకుతోనా. మనమే నిర్ణయించుకోవాలి.

కాబి ఉచిత డిజిటల్ టూల్స్

అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ‘సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్’ (సిఎబిఐ – కాబి) రైతులకు అవసరమైన ప్రామాణికమైన శాస్త్రీయ సమాచారాన్ని తన వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా తెలుగులో కూడా అందుబాటులోకి తెచ్చింది. గత 110 సంవత్సరాల నుంచి పురుగులు, తెగుళ్ల యాజమాన్యంపై పరిశోధనలు చేస్తున్న ‘కాబి’తో 48 దేశాలకు చెందిన వ్యవసాయ సంస్థలు కలసి పనిచేస్తున్నాయి. మన ఐసిఎఆర్ కూడా ఇందులో మెంబరే. ఈ నేపథ్యంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం తోడ్పాటుతో ‘ప్లాంట్ వైస్ ప్లస్ టూల్ కిట్’ పేరుతో డిజిటల్ టూల్స్‌ని ‘కాబి’ ఇటీవల తెలుగు, హిందీల్లోనూ అందుబాటులోకి తెచ్చింది. రైతులకు, విస్తరణ అధికారులకు, డీలర్లకు, విద్యార్థులకు, పరిశోధకులకు ఇవి ఉపయోగకరం.



వెబ్‌సైట్, అనేక యాప్‌ల ద్వారా రైతులకు శాస్త్రీయంగా సరైన సలహాలు పొందొచ్చు. ఇందులో నాలెడ్జ్ బ్యాంక్ పోస్టర్లు, కరపత్రాలు, రైతుల కోసం ఫ్యాక్ట్‌షీట్‌లు, వీడియో ఫ్యాక్ట్‌షీట్లు అందుబాటులో ఉన్నాయి. పంట ఆరోగ్యంపై సమాచారం తెలుసుకోవటం, పురుగుమందుల మోతాదులను లెక్కించటం, ఎరువుల అవసరాలను నిర్ణయించటం, పంట సమస్యను గుర్తించటం, చీడపీడల నియంత్రణకు పురుగుమందులను కనుగొనటం, పురుగులను– తెగుళ్లను గుర్తించే నైపుణ్యాలను మెరుగుపరచుకోవటం, చీడపీడల నియంత్రణ పద్ధతులను సిఫారసు చేయటం, తెగుళ్ల నిర్వహణపై శిక్షణ.. తదితర సమాచారం / నైపుణ్యాలను కాబి వెబ్‌సైట్, డిజిటల్ టూల్స్ అందిస్తాయి. ఇవన్నీ తెలుగులో ఉచితంగా అందుబాటులో ఉండటం వల్ల మహిళా రైతులు కూడా సులువుగా వాడుకునేందుకు వీలవుతుంది. ఈ వనరులను ఉపయోగించుకోవడానికి మనకు ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్ లేదా కంప్యూటర్ /ల్యాప్‌టాప్‌తో ఇంటర్నెట్ సదుపాయం ఉంటే చాలు.

మొక్కల ఆరోగ్య సమాచారం విభాగంలో.. మన దేశానికి సంబంధించిన పంటల ఆరోగ్యం, తెగుళ్ల నిర్వహణపై సమాచారం ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ‘ప్లాంట్‌వైజ్ ఫ్యాక్ట్‌షీట్ లైబ్రరీ’ అనే ఉచిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తెగుళ్ల నిర్ధారణ, సురక్షిత నిర్వహణకు ఉపయోగపడే తాజా సమాచారం తెలుసుకోవచ్చు. మొక్కల రక్షణ మద్దతు విభాగంలో.. ‘క్రాప్ స్ప్రేయర్ యాప్’ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సురక్షితమైన పురుగుమందులు, వాటి మోతాదును లెక్కించడానికి సహాయపడుతుంది. ‘కాబి బయోప్రొటెక్షన్ పోర్టల్’ అనే ఉచిత వెబ్‌సైట్ పంట తెగుళ్లను నయం చేయటానికి స్థానికంగా నమోదైన బయో పెస్టిసైడ్స్‌ను కనుగొనటంలో, ఉపయోగించటంలో సహాయపడుతుంది. రైతులకు లోతైన అవగాహన కలిగించడం కోసం డిజిటల్ లెర్నింగ్ కోర్సులు కూడా ఉన్నాయి. పంట తెగులు నిర్ధారణ కోర్సు, పంటల చీడపీడల యాజమాన్య కోర్సు, బయోప్రొటెక్షన్ ప్రొడక్ట్స్ కోర్సు అందుబాటులో ఉంది.

● కాబి బయోప్రొటెక్షన్ పోర్టల్ యాప్ కోసం ఈ క్యుఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

● కాబి క్రాప్ స్ప్రేయర్ యాప్ కోసం ఈ క్యుఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

26న ‘బయోచార్ కార్బన్ క్రెడిట్స్’పై సదస్సు

బయోచార్ (కట్టె బొగ్గు)ను పంట వ్యర్థాలు, తదితర బయోమాస్‌తో భారీ ఎత్తున యంత్రాలతో ఉత్పత్తి చేస్తూ ‘కార్బన్ క్రెడిట్స్’ పొందుతున్న వాణిజ్య సంస్థల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటువంటి సంస్థలకు మార్గదర్శకత్వం నెరిపేందుకు హైదరాబాద్ కేంద్రంగా ‘ప్రొగ్రెసివ్ బయోచార్ సొసైటీ’ ఇటీవల ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో ‘బయోచార్ ఉత్పత్తి పరికరాలు–కార్బన్ క్రెడిట్స్’ అనే అంశంపై జూన్ 26న ఉ. 9.30 గం. నుంచి హైదరాబాద్ యూసఫ్‌గూడలోని నిమ్స్‌మే ఆడిటోరియంలో జాతీయ సదస్సు జరగనుంది. ‘మేనేజ్’ డైరెక్టర్ జనరల్ డా. పి. చంద్రశేఖర ముఖ్య అతిథి. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 63051 71362.

సాగుబడి
ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

వరి విత్తనాలు వేసే డ్రోన్ వచ్చేసింది!



● పొలంలో వరి విత్తనాలు వేస్తున్న డ్రోన్


- **వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై పిజెటిఎస్ఎయు, నాబార్డ్ తోడ్పాటుతో మారుత్ డ్రోన్స్ పరిశోధనలు**
- **వరి రైతులకు పంట అన్ని దశల్లోనూ డ్రోన్ల తోడ్పాటు**
- **ఒకే డ్రోన్‌తోనే ఎరువులు, విత్తనాలు, ఆ తర్వాత పురుగుమందులు కూడా చల్లుకోవచ్చు..**
- **ఇప్పటికే 700 మంది రైతులు, డ్వాక్రా మహిళలకు డ్రోన్ పైలట్ శిక్షణ**

డ్రోన్లతో వరి సహా అనేక పంటలపై పురుగుమందులు, ఎరువులు చల్లటం ద్వారా కూలీల ఖర్చును, సమయాన్ని రైతులు ఆదా చేసుకుంటూ ఉండటం మనకు తెలుసు. వరి విత్తనాలను వెద పెట్టడానికి ఉపయోగపడే డ్రోన్ కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ మారుత్ డ్రోన్స్ ఇతర రంగాల్లో డ్రోన్ల వినియోగంతో పాటు వ్యవసాయంలో డ్రోన్ సేవలపైనా విశేషమైన ప్రగతి సాధించింది. తాజాగా వరి విత్తనాలు వేసే డ్రోన్‌ను రూపొందించింది. పేటెంట్ హక్కులు కూడా పొందింది. పిజెటిఎస్ఎయు, నాబార్డ్ తోడ్పాటుతో క్షేత్రస్థాయి ప్రయోగాలను పూర్తి చేసుకొని వెద పద్ధతిలో వరి విత్తనాలను వరుసల్లో విత్తే డ్రోన్లను ఇఫ్కో తోడ్పాటుతో రైతులకు అందుబాటులోకి తెస్తోంది. డిజిసిఎ ధృవీకరణ పొందిన ఈ డ్రోన్ల కొనుగోలుకు బ్యాంకు రుణాలతో పాటు సబ్సిడీ ఉండటం విశేషం.

గాలిలో ఎగిరే చిన్న యంత్రం డ్రోన్. అన్‌మాన్డ్ ఏరియల్ వెహికల్. అంటే, మనిషి పొలంలోకి దిగకుండా గట్టుమీదే ఉండి వ్యవసాయ పనులను సమర్థవంతంగా చేసుకోవడానికి ఉపయోగపడే అధునాతన యంత్రం.

ఇప్పుడు వ్యవసాయంలోని అనేక పంటల సాగులో, ముఖ్యంగా వరి సాగులో, కీలకమైన అనేక పనులకు డ్రోన్ ఉపయోగపడుతోంది. రైతులకు ఖర్చులు తగ్గించటం, కూలీల అవసరాన్ని తగ్గించటం వంటి పనుల ద్వారా ఉత్పాదకతను, నికరాదాయాన్ని పెంపొందించేందుకు డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. దోమల నిర్మూలన, ఔషధాల రవాణా వంటి అనేక ఇతర రంగాలతో పాటు వ్యవసాయంలో ఉపయోగపడే ప్రత్యేక డ్రోన్లను అభివృద్ధి చేయటంలో మారుత్ డ్రోన్స్ విశేష కృషి చేస్తోంది. ప్రేమ్ కుమార్ విస్లావత్, సాయి కుమార్ చింతల, ఐఐటి గౌహతి పూర్వవిద్యార్థి సూరజ్ పెద్ది అనే ముగ్గురు తెలుగు యువకులు 2019లో మారుత్ డ్రోన్స్ స్టార్టప్‌ను ప్రారంభించారు. డేటా ఎనలిటిక్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలతో వ్యవసాయ డ్రోన్లను రూపొందించటంపై ఈ కంపెనీ దృష్టి సారించింది.

ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు), అగ్రిహబ్, నాబార్డ్ తోడ్పాటుతో రైతుల కోసం ప్రత్యేక డ్రోన్లను రూపుకల్పన చేస్తోంది. నల్గొండ జిల్లా కంపసాగర్‌లోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో 50 ఎకరాల్లో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో గత రెండున్నరేళ్లుగా మారుత్ డ్రోన్లను ప్రయోగాత్మకంగా పరీక్షించింది. స్థానిక రైతులు పండించే పంటలకు అనువైన రీతిలో ఉండేలా ఈ డ్రోన్లను అభివృద్ధి చేశారు. వరి పంటపై డ్రోన్ల ద్వారా పురుగుమందులు చల్లటానికి సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొటోకాల్స్(ఎస్.ఓ.పి.ల)ను గతంలోనే ఖరారు చేశారు. ప్రస్తుతం వెద వరి పద్ధతిలో ఆరుతడి పంటగా వరి విత్తనాలను నేరుగా బురద పదును నేలలో విత్తుకోవడానికి ఉపయోగపడేలా డ్రోన్‌ను రూపొందించారు. ఇప్పటికే నాలుగైదు డ్రోన్ ప్రొటోటైప్‌ల ద్వారా వరి విత్తనాలను వరుసల్లో వెద పెట్టడానికి సంబంధించిన ప్రయోగాలు తుది దశకు చేరుకున్నాయి. ఒకటి, రెండు నెలల్లో దీనికి సంబంధించిన ఎస్.ఓ.పి.లు పూర్తవుతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



● వరి పంటపై పురుగుల మందు పిచికారీ

డ్రోన్ విత్తనాలు వెద పెట్టేది ఇలా..

వరి నారు పోసి, నాట్లు వేసే సంప్రదాయ పద్ధతితో పోల్చితే విత్తనాలు వెదజల్లే పద్ధతి అనేక విధాలుగా మెరుగైన ఫలితాలను ఇస్తున్న విషయం తెలిసిందే. వెద వరిలో అనేక పద్ధతులు ఉన్నాయి. పొలాన్ని దుక్కి చేసిన తర్వాత పొడి దుక్కిలోనే ట్రాక్టర్ సహాయంతో సీడ్ డ్రిల్‌తో విత్తనాలు వేసుకోవటం ఒక పద్ధతి. బురద పదును నేలలో ఎక్కువ నీరు లేకుండా డ్రమ్ సీడర్‌ను లాగుతూ మండ కట్టిన వరి విత్తనాలను చేనంతా వేసుకోవటం రెండో పద్ధతి. ఈ రెండు పద్ధతుల కన్నా.. బురద పదును నేలలో డ్రోన్ ద్వారా వరి విత్తనాలను జారవిడవటం మరింత మేలైన పద్ధతి. తక్కువ శ్రమ, తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో పని పూర్తవుతుందని మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకులు చెబుతున్నారు.

డ్రోన్ల సేద్యానిదే భవిష్యత్తు!



తక్కువ నీరు ఖర్చయ్యే వెద పద్ధతిలోనే భవిష్యత్తులో వరి సాగు ఎక్కువగా చేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. వెద వరిలో విత్తనాలు వేయటం, ఎరువులు చల్లటం, చీడపీడలను ముందుగానే గుర్తించటం, పురుగుమందులు చల్లటం వంటి అనేక పనులకు డ్రోన్లు ఉపయోగపడతాయి. డ్రోన్ ధర రూ. పది లక్షలు. ఒక్క డ్రోన్‌తోనే పంట వివిధ దశల్లో ఈ పనులన్నీ చేసుకోవచ్చు. డిజిసిఎ ధృవీకరణ ఉండటం వల్ల డ్రోన్ కొనుగోలుకు వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద 6% వడ్డీకే అనేక పథకాల కింద బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. రైతుకు 50% సబ్సిడీ వస్తుంది. ఎఫ్‌పిఓ లేదా కస్టమ్ హైరింగ్ సెంటర్లకైతే 75% వరకు సబ్సిడీ వస్తుంది. పది డ్రోన్లు కొని అద్దె సేవలందించే వ్యాపారవేత్తలకైతే రూ. 2 కోట్ల వరకు రుణం కూడా దొరుకుతోంది. గ్రామీణ యువతకు డ్రోన్ సేవలు ఏడాది పొడవునా మంచి ఉపాధి మార్గం చూపనున్నాయి.

– ప్రేమ్ కుమార్ విస్లావత్,
వ్యవస్థాపకుడు, సీఈఓ, మారుత్ డ్రోన్స్
https://marutdrones.com

ఎకరంలో వరి విత్తటానికి 20 నిమిషాలు..

ఈ విధానంలో వరి నారుకు బదులు దమ్ము చేసిన పొలంలో డ్రోన్ సాయంతో వరి విత్తనాలను క్రమ పద్ధతిలో జారవిడుస్తారు. ఇందుకోసం ఆ డ్రోన్‌కు ప్రత్యేకంగా రూపొందించిన పైప్‌లాంటి సీడ్ డిస్పెన్సింగ్ డివైస్‌ను అమర్చుతారు. ఆ డివైస్‌కు డ్రోన్‌కు నడుమ వరి విత్తనాలు నిల్వ వుండేలా బాక్స్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా 5 వరుసల్లో వరి విత్తనాలు బురద పదునుగా దమ్ము చేసిన పొలంలో విత్తుతారు. వరి మొక్కల మధ్య 10 సెం.మీ.లు, వరుసల మధ్య 15 సెం.మీ.ల దూరంలో విత్తుతారు. సాధారణంగా నాట్లు వేసే పద్ధతిలో ఎకరానికి 20–25 కిలో విత్తనం అవసరమైతే ఈ పద్ధతిలో 8–12 కిలోల విత్తనం సరిపోతుంది. సన్న రకాలైతే 10–11 కిలోల విత్తనం చాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 20 నిమిషాలకు ఒక ఎకరం చొప్పున రోజుకు ఒక డ్రోన్ ద్వారా 20 ఎకరాల్లో విత్తనాలు వెదపెట్టవచ్చు. సాళ్లు వంకర్లు లేకుండా ఉండటం వల్ల కలుపు నివారణ సులువు అవుతుందని, గాలి బాగా సోకటం వల్ల చీడపీడల ఉధృతి కూడా తగ్గుతుందని చెబుతున్నారు. వెదపద్ధతి వల్ల తక్కువ నీటితోనే వరి సాగు చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

హెక్టారుకు రూ.5 వేలు ఆదా

వెద వరి (డైరెక్ట్ సీడింగ్ రైస్– డిఎస్ఆర్) సాగు పద్ధతిలో డ్రోన్లను వాడటం ద్వారా కూలీల బాధ లేకుండా చప్పున పని పూర్తవ్వటమే కాకుండా సాగు ఖర్చు సీజన్‌కు హెక్టారుకు రూ. 5 వేలు తగ్గుతుందని మారుత్ డ్రోన్స్ సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ అంచనా. డ్రోన్ సాయంతో సకాలంలో పురుగుమందులు సకాలంలో చల్లటం వల్ల చీడపీడల నియంత్రణ జరిగి హెక్టారుకు 880 కిలోల ధాన్యం అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతుకు హెక్టారుకు రూ.21,720 ఆదనపు ఆదాయం వస్తుందని ఆయన చెబుతున్నారు.

700 మందికి డ్రోన్ పైలట్ శిక్షణ

మారుత్ డ్రోన్స్ పిజెటిఎస్ఎయుతో కలసి ఏర్పాటు చేసిన అకాడమీ ద్వారా డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇస్తోంది. రైతులు, స్వయం సహాయక బృందాల మహిళలకు, ఎఫ్‌పిఓ సభ్యులకు, వ్యవసాయ పట్టభద్రులకు, పదో తరగతి పాసైన యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులు. ఈ అకాడమీ ద్వారా ఇప్పటికే 700 మంది శిక్షణ పొందారు. అందులో 150 మంది స్వయం సహాయక బృందాల మహిళలు కూడా ఉన్నారు. డీజీసీఏ ఆమోదం వున్న ఈ వారం రోజుల శిక్షణ పొందిన వారికి పదేళ్ల పైలట్ లైసెన్స్ వస్తుంది.

వ్యవసాయ సీజన్‌లో డ్రోన్ పైలట్‌కు కనీసం రూ. 60–70 వేల ఆదాయం వస్తుందని ప్రేమ్ వివరించారు. ఈ డ్రోన్ పైలట్ శిక్షణ పొందిన వారు వ్యవసాయంతో పాటు మరో 9 రంగాల్లో డ్రోన్లను వినియోగించవచ్చు. ఏడాది పొడవునా ఉపాధి పొందడానికి అవకాశం ఉంది.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



ఇంగ్లండ్‌ను గెలిపించిన జూడ్ బెలింగమ్

'యూరో' కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఇంగ్లండ్ జట్టు శుభారంభం చేసింది. జర్మనీలోని గెల్‌సెన్‌కిర్చెన్ పట్టణంలో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1-0 గోల్ తేడాతో సెర్బియాపై నెగ్గింది. ఆట 13వ నిమిషంలో జూడ్ బెలింగమ్ ఇంగ్లండ్‌కు గోల్ అందించాడు. మరోవైపు రొమేనియా జట్టు 24 ఏళ్ల తర్వాత 'యూరో' టోర్నీలో తొలి విజయం అందుకుంది. మ్యూనిక్‌లో జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌లో రొమేనియా 3-0తో ఉక్రెయిన్‌పై గెలిచింది. ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన గ్రూప్ 'ఇ' మరో మ్యాచ్‌లో స్లొవేకియా 1-0తో ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియంను బోల్తా కొట్టించింది.

హెప్టాథ్లాన్‌లో శ్రీతేజకు కాంస్య పతకం



జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి థోలెం శ్రీతేజ కాంస్య పతకం సాధించింది. ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం ముగిసిన ఈ టోర్నీలో శ్రీతేజ ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, 1000 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో మూడో స్థానంలో నిలిచింది. శ్రీతేజ ఓవరాల్‌గా 4136 పాయింట్లు సాధించింది. రినీ ఖాతూన్ (పశ్చిమ బెంగాల్; 4357 పాయింట్లు) స్వర్ణ పతకం సొంతం చేసుకుంది.

రన్నరప్ సుమిత్ నగాల్

కెరీర్ బెస్ట్ 71వ ర్యాంక్‌కు భారత ప్లేయర్



న్యూఢిల్లీ: పెరూగియా ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ రన్నరప్‌గా నిలిచాడు. ఇటలీలో జరిగిన ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 77వ ర్యాంకర్ సుమిత్ 1-6, 2-6తో ప్రపంచ 41వ ర్యాంకర్ లూసియానో దర్దెరి (ఇటలీ) చేతిలో ఓడిపోయాడు. 62 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయాడు. సుమిత్‌కు 11,955 యూరోల (రూ. 10 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 64 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా ఫలితం సుమిత్ ర్యాంక్‌ను మరింత మెరుగుపర్చింది. గతవారం 77వ ర్యాంక్‌లో ఉన్న సుమిత్ ఈ ప్రదర్శనతో ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 71వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

స్నేహిత్‌కు కాంస్యం



సాక్షి, హైదరాబాద్: బ్రిక్స్ గేమ్స్‌లో భారత టేబుల్ టెన్నిస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ కాంస్య పతకాన్ని సాధించాడు. రష్యాలోని కజాన్ పట్టణంలో జరుగుతున్న ఈ క్రీడల్లో స్నేహిత్ పురుషుల సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్లో ఓడిపోయాడు. కిరిల్ స్కచ్‌కోవ్ (రష్యా)తో జరిగిన సెమీఫైనల్లో స్నేహిత్ 9-11, 8-11, 6-11తో ఓటమి చవిచూశాడు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

క్రికెట్ కూనలే కదా అని తక్కువ అంచనా వేస్తే.. మొదటికే మోసం వస్తుందని... తదుపరి దశకు అర్హత పొందే అవకాశాలు గల్లంతవుతాయని తాజా టి20 ప్రపంచకప్ నిరూపించింది. అసలు ఊహించుకోవడానికే విడ్డూరంగా కొన్ని అనూహ్య ఫలితాలు వచ్చాయి. మాజీ చాంపియన్లు, రన్నరప్‌లు ఇలా గట్టి జట్లకు పెద్ద షాక్‌లే తగిలాయి. తొలి ప్రపంచకప్ ఆడుతున్న అమెరికా గ్రూప్ 'ఎ'లో పాక్‌ను వెనక్కినెట్టి ఏకంగా సూపర్-8లోకి ప్రవేశించడం అద్భుతం! అద్భుతం కాకపోయినా... బంగ్లాదేశ్ గ్రూప్ 'డి' నుంచి శ్రీలంకను తోసి ముందడుగు వేసింది.



తంజిమ్

- టి20 ప్రపంచకప్‌లో 'సూపర్-8' దశకు అర్హత
- చివరి లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌పై 21 పరుగులతో గెలుపు
- 7 పరుగులిచ్చి 4 వికెట్లు తీసిన బంగ్లాదేశ్ బౌలర్ తంజిమ్

కింగ్స్‌టౌన్: ఇదివరకే భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఇప్పటికే తదుపరి 'సూపర్-8' దశకు చేరుకున్నాయి. మిగిలిన ఏకైక బెర్త్‌ను గ్రూప్ 'డి' నుంచి బంగ్లాదేశ్‌కు ఖరారైంది. ఇతర సమీకరణాలతో దక్కే బెర్త్ కాకుండా గెలిచి సగర్వంగా సాధించాలని బంగ్లాదేశ్ కూన నేపాల్‌పై పెద్ద పోరాటమే చేసింది. సోమవారం ఉదయం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సీమర్లు తంజిమ్ హసన్ సకిబ్ (4-2-7-4), ముస్తఫిజుర్ రెహ్మాన్ (4-1-7-3) నిప్పులు చెరిగే బౌలింగ్ స్పెల్‌తో బంగ్లాదేశ్ 21 పరుగుల తేడాతో నేపాల్‌పై గెలిచింది. టాస్ నెగ్గిన నేపాల్ ఫీల్డింగ్‌కు మొగ్గుచూపడంతో మొదట బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. షకీబుల్ హసన్ (22 బంతుల్లో 17; 2 ఫోర్లు) చేసిందే ఇన్నింగ్స్ టాప్ స్కోరు! మహ్ముదుల్లా (13), రిషద్ (13), జాకీర్ అలీ (12), టస్కిన్ అహ్మద్ (12), లిటన్ దాస్ (10) రెండంకెల స్కోరు చేశారు. పెద్దగా అనుభవం లేని నేపాల్ బౌలర్లు సోంపాల్ కామి, దీపేంద్ర సింగ్, రోహిత్ పౌడెల్, సందీప్ లమిచానె తలా 2 వికెట్లతో బంగ్లాకు ముచ్చెమటలు పట్టించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన నేపాల్ 19.2 ఓవర్లలో 85 పరుగులకు కుప్పకూలింది. టాప్-5 బ్యాటర్లు కుశాల్ (4), ఆసిఫ్ (14 బంతుల్లో 17; 4 ఫోర్లు), అనిల్ (0), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (1), సందీప్ జొరా (1) బంగ్లా పేస్‌కు దాసోహమయ్యారు. 26/5 స్కోరు వద్ద... ఇంకెముందిలే బంగ్లా గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ కుశాల్ మల్లా (40 బంతుల్లో 27; 1 ఫోర్, 1 సిక్స్), దీపేంద్ర సింగ్ (31 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడటంతో నేపాల్ స్కోరు 78/5 వరకూ వెళ్లింది. ఆ స్కోరు వద్దే కుశాల్‌ను ముస్తఫిజుర్‌ను అవుట్ చేయడంతో మరో 7 పరుగుల వ్యవధిలోనే నేపాల్ ఆలౌటైంది. స్పిన్నర్ షకీబుల్ హసన్ 2 వికెట్లు తీయగా, టస్కిన్ అహ్మద్‌కు ఒక వికెట్ దక్కింది. తంజిమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X అఫ్గానిస్తాన్

వేదిక: గ్రాస్‌ఐలెట్; ఉదయం గం. 6 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

రేపటి నుంచి 'సూపర్-8' పోరు


టి20 ప్రపంచకప్‌లో లీగ్ దశ మ్యాచ్‌లు నేటితో ముగియనున్నాయి. రేపటి నుంచి 'సూపర్-8' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి. 'సూపర్-8'కు చేరిన ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్... గ్రూప్-2 లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, అమెరికా జట్లు ఉన్నాయి. 'సూపర్-8' మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు చేరుతాయి.

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
జూన్ 19	దక్షిణాఫ్రికా X అమెరికా	నార్త్ సౌండ్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 20	వెస్టిండీస్ X ఇంగ్లండ్	గ్రాస్ ఐలెట్	ఉ. గం. 6 నుంచి
జూన్ 20	భారత్ X అఫ్గానిస్తాన్	బ్రిడ్జ్‌టౌన్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 21	ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్	నార్త్ సౌండ్	ఉ. గం. 6 నుంచి
జూన్ 21	ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా	గ్రాస్ ఐలెట్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 22	వెస్టిండీస్ X అమెరికా	బ్రిడ్జ్‌టౌన్	ఉ. గం. 6 నుంచి
జూన్ 22	భారత్ X బంగ్లాదేశ్	నార్త్ సౌండ్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 23	ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్	కింగ్స్‌టౌన్	ఉ. గం. 6 నుంచి
జూన్ 23	ఇంగ్లండ్ X అమెరికా	బ్రిడ్జ్‌టౌన్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 24	వెస్టిండీస్ X దక్షిణాఫ్రికా	నార్త్ సౌండ్	ఉ. గం. 6 నుంచి
జూన్ 24	భారత్ X ఆస్ట్రేలియా	గ్రాస్ ఐలెట్	రాత్రి గం. 8 నుంచి
జూన్ 25	అఫ్గానిస్తాన్ X బంగ్లాదేశ్	కింగ్స్‌టౌన్	ఉ. గం. 6 నుంచి
జూన్ 27	తొలి సెమీఫైనల్	ట్రినిడాడ్	ఉ. గం. 6 నుంచి
జూన్ 27	రెండో సెమీఫైనల్	గయానా	రాత్రి గం. 8 నుంచి
జూన్ 29	ఫైనల్	బ్రిడ్జ్‌టౌన్	రాత్రి గం. 7:30 నుంచి

శ్రీలంకకు ఊరట

గ్రాస్ ఐలెట్: మాజీ చాంపియన్ శ్రీలంక ఎట్టకేలకు ఈ టి20 ప్రపంచకప్‌లో విజయం సాధించి టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్ 'డి'లో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ చేతిలో ఓడిన లంకకు నేపాల్‌తో మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. సోమవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక 83 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (29 బంతుల్లో 46; 5 ఫోర్లు), అసలంక (21 బంతుల్లో 46; 1 ఫోర్, 5 సిక్స్‌లు), మాథ్యూస్ (15 బంతుల్లో 30 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం నెదర్లాండ్స్ 16.4 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లెవిట్ (23 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (24 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. నువాన్ తుషార 3, హసరంగ, పతిరణ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

భారత ఫుట్‌బాల్ హెడ్ కోచ్ స్టిమాక్‌పై వేటు



న్యూఢిల్లీ: భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ ఇగోర్ స్టిమాక్‌కు ఉద్వాసన పలికారు. 2026 ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో టీమిండియా మూడో రౌండ్‌కు అర్హత సాధించలేకపోవడంతో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) స్టిమాక్ సేవలకు మంగళం పాడింది. క్రొయేషియాకు చెందిన ఈ మాజీ ఫుట్‌బాలర్‌ను 2019లో కోచ్‌గా నియమించారు. ఆయన శిక్షణలో భారత జట్టు నాలుగు మేజర్ ట్రోఫీలను సాధించింది. ఇందులో రెండు 'శాఫ్' చాంపియన్‌షిప్ టైటిళ్లు కాగా, ఇంటర్‌కాంటినెంటల్ కప్, ముక్కోణపు సిరీస్ ఉన్నాయి. దీంతో గత అక్టోబర్‌లో ఆయనకు 2026 వరకు పొడిగింపు ఇచ్చారు. అయితే సునీల్ ఛెత్రి (ప్రస్తుతం రిటైరయ్యాడు) నేతృత్వంలోని భారత్ క్వాలిఫయర్స్‌లో ఎప్పటిలాగే రెండో రౌండ్‌ను దాటలేకపోయింది. దీంతో జట్టు ప్రదర్శన సరిగాలేని కారణంతో గడువుకు ముందే స్టిమాక్‌ను తొలగించారు. ఒప్పందం ప్రకారం ఇలా అర్ధంతరంగా సాగనంపితే స్టిమాక్‌కు 3,60,000 డాలర్లు (రూ. 3 కోట్లు) ఏఐఎఫ్ఎఫ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆ మొత్తం చెల్లించేందుకు సమాఖ్య సిద్ధమైంది.

ఫెర్గూసన్ 4-4-0-3



ఫెర్గూసన్

తరుబా: న్యూజిలాండ్ టి20 ప్రపంచకప్ నుంచి ఇదివరకే నిష్క్రమించింది. అయితే గ్రూప్ 'సి'లో తమ ఆఖరి పోరులో విజయంతో పాటు పేస్ బౌలర్ ఫెర్గూసన్ (4-4-0-3) పుటలకెక్కిన రికార్డు గణాంకాలతో కివీస్ శిబిరం సంతృప్తి చెందింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో పపువా న్యూగినీపై నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూగినీ జట్టు 19.4 ఓవర్లలో 78 పరుగులకే ఆలౌటైంది. చార్లెస్ అమిని (17; 2 ఫోర్లు), నార్మాన్ వనువా (14; 1 ఫోర్, 1 సిక్స్), సెసె బవు (12; 1 ఫోర్) రెండంకెల స్కోర్లు చేశారు. పరుగివ్వకుండా అన్ని మెయిడిన్లే వేసిన ఫెర్గూసన్ 3 వికెట్లు తీశాడు. తద్వారా కెనడా బౌలర్ సాద్ బిన్ జఫర్ 2021లో పనామాపై వేసిన 4-4-0-2 రికార్డు స్పెల్ తుడిచిపెట్టుకుపోయింది. అనంతరం సులువైన లక్ష్యాన్ని న్యూజిలాండ్ 12.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (35; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ విలియమ్సన్ (18 నాటౌట్; 2 ఫోర్లు), మిచెల్ (12 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు) రాణించారు.

27 బంతుల్లోనే...


టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఎస్తోనియా బ్యాటర్ సాహిల్

41 బంతుల్లో 6 ఫోర్లు, 18 సిక్స్‌లతో 144 నాటౌట్



ఎపిస్కోపి (సైప్రస్): ఆకాశమే హద్దుగా చెలరేగిన ఎస్తోనియా బ్యాటర్ సాహిల్ చౌహాన్ అంతర్జాతీయ టి20ల్లోనే కాకుండా టి20 ఫార్మాట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సైప్రస్ జట్టుతో సోమవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో సాహిల్ ఈ ఘనత సాధించాడు. సైప్రస్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్యాన్ని ఎస్తోనియా కేవలం 13 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత సంతతికి చెందిన 32 ఏళ్ల సాహిల్ 41 బంతుల్లో 6 ఫోర్లు, 18 సిక్స్‌లతో 144 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో సాహిల్ 27 బంతుల్లో సెంచరీని (5 ఫోర్లు, 13 సిక్స్‌లు) పూర్తి చేసుకున్నాడు. దాంతో అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా నమీబియా బ్యాటర్ జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ (33 బంతుల్లో; ఈ ఏడాది ఫిబ్రవరి 27న నేపాల్‌పై) నెలకొల్పిన ప్రపంచ రికార్డు బద్దలైంది. సాహిల్ ధాటికి టి20ల్లో క్రిస్ గేల్ (30 బంతుల్లో; ఆర్‌సీబీ తరఫున 2013లో పుణే వారియర్స్‌పై) పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు కూడా తెరమరుగైంది. అంతేకాకుండా అంతర్జాతీయ టి20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన ప్లేయర్‌గా కూడా సాహిల్ రికార్డు నెలకొల్పాడు. 2019లో ఐర్లాండ్‌తో జరిగిన టి20 మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ బ్యాటర్ హజ్రతుల్లా జజాయ్ అత్యధికంగా 16 సిక్స్‌లు కొట్టాడు.

సినిమా



● రవితేజ

మాస్ బచ్చన్

శత్రువులు చుట్టుముట్టారు... అయినా బచ్చన్ కంగారుపడలేదు. కంగారు అంటే ఏంటో అతనికి తెలియదు. ధైర్యానికి చిరునామా లాంటివాడు. వచ్చినవాళ్లను వచ్చినట్లు ఇరగదీశాడు బచ్చన్. ఏ రేంజ్‌లో రఫ్ఫాడించాడో తెలియాలంటే 'మిస్టర్ బచ్చన్' చిత్రం చూడాల్సిందే. రవితేజ టైటిల్ రోల్‌లో హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం షో రీల్ వీడియోను సోమవారం విడుదల చేశారు. ఈ వీడియోలో రవితేజ చేసిన మాస్ ఫైట్, ఆగ్రహంతో జగపతిబాబు, అమితాబ్ బచ్చన్‌ని రవితేజ అనుకరించడం తదితర విజువల్స్ కనిపించాయి. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సచిన్ ఖేడేకర్ కీలక పాత్ర చేశారు. ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటించనుంది చిత్రబృందం. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయాంకా బోస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



● ఎన్టీఆర్

చలో థాయ్‌లాండ్

హీరో ఎన్టీఆర్ థాయ్‌లాండ్‌కి పయనమయ్యారు. 'దేవర' మూవీ తాజా షెడ్యూల్ చిత్రీకరణలో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు ఎన్టీఆర్. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ సినిమా నిర్మిస్తున్నారు. 'దేవర' కీలక షెడ్యూల్‌ను గోవాలో పూర్తి చేసుకుని ఇటీవల హైదరాబాద్ చేరుకుంది చిత్రబృందం. తర్వాతి షెడ్యూల్ కోసం సోమవారం ఎన్టీఆర్ హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్ ప్రయాణం అయ్యారు. ఆయనతోపాటు భార్య లక్ష్మీ ప్రణతి, పిల్లలు అభయ్, భార్గవ్ కూడా ఉన్నారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి వెళుతున్న ఎన్టీఆర్ ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'దేవర' షూటింగ్‌లో పాల్గొనేందుకు జాన్వీ కపూర్ కూడా ఆదివారం సాయంత్రం థాయ్‌లాండ్‌కు బయలుదేరారు. అక్కడ ఎన్టీఆర్, జాన్వీలపై ఓ పాటతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారట కొరటాల శివ. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' తొలి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల కానుంది.

అద్భుతమైన అనుభూతినివ్వడానికే వాయిదా



● అల్లు అర్జున్

''మీకు (ప్రేక్షకులు) అద్భుతమైన అనుభూతిని ఇవ్వాలన్నదే మా సంకల్పం. అందుకే మీరు మరికొంత సమయం వేచి ఉండాలి'' అంటూ 'పుష్ప' మూవీ టీమ్ సోమవారం ఓ నోట్‌ని విడుదల చేసింది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలైంది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్'ని అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలోనే నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే షూటింగ్ పూర్తి కానందున, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు ఎక్కువ సమయమే పడుతున్నందువల్ల విడుదలను వాయిదా వేశారు. ''ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 6న 'పుష్ప: ది రూల్'ని రిలీజ్ చేయనున్నాం. 'పుష్ప: ది రైజ్' విజయం మా బాధ్యతని పెంచింది. మీకు ది బెస్ట్ ఇవ్వడానికి హార్డ్‌వర్క్ చేస్తున్నాం. కచ్చితంగా మీరు సిల్వర్ స్క్రీన్‌పై ది బెస్ట్ చూస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

నింద మైలురాయిగా నిలవాలి - నిఖిల్ సిద్ధార్థ్



● రాజేశ్, నిఖిల్ సిద్ధార్థ్, వరుణ్ సందేశ్

''నింద' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. మంచి కథతో పాటు చాలా క్వాలిటీతో తెరకెక్కించారు. నా కెరీర్‌లో 'స్వామి రారా, కార్తికేయ' సినిమాల్లా వరుణ్ సందేశ్ కెరీర్‌లో 'నింద' ఓ మైలురాయిగా నిలవాలి. ఈ చిత్రానికి ప్రేక్షకులు పెద్ద విజయం అందించాలి'' అని హీరో నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'నింద'. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''నింద' నా మనసుకు ఎంతో దగ్గరైన చిత్రం. రాజేశ్‌గారు ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా నిర్మించి, దర్శకత్వం వహించారు. మా చిత్రాన్ని మైత్రీ మూవీస్ వారు రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. నా కెరీర్‌లో 'హ్యాపీ డేస్, కొత్త బంగారు లోకం, ఏమైంది ఈవేళ' చిత్రాల తర్వాత 'నింద' నిలుస్తుందని గర్వంగా చెప్పుకోగలను'' అన్నారు. ''నింద' మూవీ అవుట్‌పుట్ నాకు చాలా సంతృప్తి ఇచ్చింది. మా సినిమాతో వరుణ్ మంచి కమ్ బ్యాక్ ఇస్తాడు'' అన్నారు రాజేశ్ జగన్నాథం.

అప్పుడు భయం వేసింది - విజయ్ సేతుపతి



● నితిలన్, విజయ్ సేతుపతి

''మహారాజ' విడుదలకి ముందు హైదరాబాద్‌కి వచ్చాను. ఇక్కడ తెలుగు ప్రేక్షకులు నాపై చూపించిన ప్రేమాభిమానాలు చూసి కొంచెం భయం వేసింది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకున్నా. తెలుగు ప్రేక్షకులు అది నెరవేర్చడం ఆనందాన్నిచ్చింది. తెలుగు వారు నాపై చూపిన ప్రేమ చూస్తుంటే.. ఇది నా హోమ్‌టౌన్‌లానే అనిపిస్తోంది. నాకు ఈ అనుభూతిని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని హీరో విజయ్ సేతుపతి అన్నారు. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించిన చిత్రం 'మహారాజ'. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రంలో మమతా మోహన్‌దాస్, అనురాగ్ కశ్యప్ ఇతర లీడ్ రోల్స్ చేశారు. సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించారు. ఈ మూవీని తెలుగులో ఎస్వీఆర్ సినిమా ఈ నెల 14న రిలీజ్ చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మహారాజ' మూవీ థ్యాంక్స్ మీట్‌లో నితిలన్ సామినాథన్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకుల నుంచి మా 'మహారాజ'కి లభిస్తున్న ఆదరణ చాలా ఆనందాన్నిచ్చింది'' అన్నారు ''మహారాజ'ని కుటుంబంతో కలసి చూడండి.. చాలా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ మారుతి. ''ఈ మధ్య కాలంలో నేను చూసిన మంచి సినిమా 'మహారాజ'' అన్నారు మరో అతిథి గోపీచంద్ మలినేని. ''ఈ సినిమా హిట్ ఏ రేంజ్‌కి వెళ్లి ఆగుతుందో చెప్పలేం'' అన్నారు ఇంకో అతిథి బుచ్చిబాబు సాన. డైరెక్టర్ అనీల్ కన్నెగంటి, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలే అయినా మర్చిపోను



● హనీ రోజ్

'చీకట్లో నేను చూసిన ఆ ఎరుపెక్కిన కళ్లు' అనే డైలాగ్‌తో 'రేచెల్' మూవీ టీజర్ విడుదలైంది. హీరోయిన్ హనీ రోజ్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'రేచెల్'. ఆనందిని బాలా దర్శకత్వం వహించారు. బాదుషా ప్రొడక్షన్స్‌పై బాదుషా ఎన్ఎమ్, రాజన్ చిరాయిల్, అబ్రిడ్ షైన్ నిర్మించారు. ఈ చిత్రాన్ని మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం 'రేచెల్' మూవీ టీజర్‌ని విడుదల చేసింది యూనిట్. 'కలైతే కాదు.. అది కలే అయినా వాటిని నేను మర్చిపోను', 'ఎవరై ఉంటారు.. తెలీదు. వెతకాలి.. చంపాలి' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: స్వరూప్ ఫిలిప్, సంగీతం, నేపథ్య సంగీతం: ఇషాన్ ఛబ్రా.

సినిమాపై ఇష్టంతో....



● అభిరామ్, వెన్నెల

అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల, ప్రదీప్, అమ్మ రమేశ్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. హరీష్ చావా దర్శకత్వంలో నోరి నాగప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, దర్శక-నిర్మాత నాగబాల సురేష్, దర్శకులు రేలంగి నరసింహారావు, సముద్ర, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, టి. ప్రసన్నకుమార్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ''నలుగురు యువకులు సినిమాపై ఇష్టంతో ఈ రంగంలోకి వస్తారు. వాళ్లు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అనే కథాంశంతో ఈ మూవీ రూపొందింది'' అన్నారు హరీష్ చావా. ''లవ్, కామెడీ, సెంటిమెంట్.. ఇలా అన్నీ ఉన్న చిత్రమిది'' అన్నారు నోరి నాగప్రసాద్.

హైదరాబాద్ ఘటనతో సినిమా



● కరీనా కపూర్
● ఆయుష్మాన్ ఖురానా

నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ శివార్లలో జరిగిన ఒక హత్యాచార ఘటన వెండితెరపైకి రానుందని టాక్. హిందీలో ఈ ఘటన నేపథ్యంలో సినిమా తీయడానికి దర్శకురాలు మేఘనా గుల్జార్ సన్నాహాలు మొదలుపెట్టారట. పోలీసులు బాధితురాలి పేరుని వెల్లడించకుండా 'దిశ' అని పేర్కొన్న ఆ ఘటన చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి ముఖ్య తారలుగా కరీనా కపూర్, ఆయుష్మాన్ ఖురానాలను ఎంపిక చేశారట మేఘన. కరీనా, ఆయుష్ స్క్రిప్ట్ చదివి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. 'తల్వార్, రాజీ, చపాక్, సామ్ బహదూర్' వంటి చిత్రాలతో మంచి దర్శకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు మేఘన. దిశ ఘటనపై ఆమె తెరకెక్కించనున్న చిత్రం గురించి త్వరలో అధికారక ప్రకటన రానుందట.

సివిల్ ఇంజనీర్ అమిష్ట



● దర్శన

అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత లీడ్ రోల్స్‌లో నటించిన తాజా చిత్రం 'పరదా'. 'సినిమా బండి' మూవీ ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించిన రెండో చిత్రం ఇది. శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించారు. సోమవారం (జూన్ 17) దర్శనా రాజేంద్రన్ బర్త్ డే సందర్భంగా 'పరదా'లో ఆమె చేస్తున్న సివిల్ ఇంజనీర్ అమిష్ట పాత్ర ఫస్ట్ లుక్‌ని, ఓ వీడియోను విడుదల చేశారు. 'అబ్బాయిలు చేయలేనిది, అమ్మాయిలు చేయగలిగేది పిల్లల్ని కనడం' అంటూ దర్శన చెప్పిన డైలాగ్ వీడియోలో ఉంది. ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ– ''లేడీ ఓరియంటెడ్ కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పరదా'' అన్నారు. ''ప్యాషన్‌తో ఈ సినిమా చేశాం. మేం సృష్టించిన ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించడం కోసం ఎదురు చూస్తున్నాం'' అన్నారు విజయ్ డొంకాడ.

సాక్షి
బిజినెస్
మంగళవారం
18-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 182	76,993
నిఫ్టీ ▲ 50	23,466


విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,840	▲ 151
డోజోన్స్	36,689	▲ 100
ఎఫ్‌టీఎస్ఈ 100	8,142	▽ 5
డాక్స్	18,068	▲ 66
షాంఘై	3,016	▽ 17
నికాయ్	38,102	▽ 712

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.73	85.41
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	103.45	108.40
€	యూరో	భారతీయ	87.34	91.83
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	42.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.78	57.63
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.44	64.14
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.86	23.65
¥	చైనా యువాన్	భారతీయ	10.40	12.47

బడా ఐపీఓల బొనాంజా!



- జాబితాలో హ్యుందాయ్, అఫ్కాన్స్, ఓలా ఎలక్ట్రిక్, స్విగ్గీ, ఎన్ఎస్‌డీఎల్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఎమ్‌క్యూర్
- రూ. 60,000 కోట్ల సమీకరణ బాట

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో కూడా పబ్లిక్ ఇష్యూల హవా కొనసాగనుంది. అయితే ఈ ఏడాది ప్రత్యేకతేమిటంటే దిగ్గజ కంపెనీలు భారీస్థాయిలో నిధుల సమీకరణకు క్యూ కడుతున్నాయి. ఈ జాబితాలో ఆటో దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా సహా.. స్విగ్గీ, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితరాలు చేరాయి. రూ.60,000 కోట్లకు పైగా నిధులను సమీకరించేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తున్నాయి.



ముంబై: కొద్ది రోజులుగా సెకండరీ మార్కెట్లు మళ్లీ దూకుడు చూపుతున్నాయి. రోజుకో కొత్త గరిష్టాలను తాకుతున్నాయి. ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 77,000 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 23,500కు చేరాయి. ఈ నేపథ్యంలో పలు అన్‌లిస్టెడ్ దిగ్గజాలు పబ్లిక్ ఇష్యూలవైపు దృష్టి పెట్టాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు సెబీ తలుపుతడుతున్నాయి. తద్వారా భారీస్థాయిలో నిధుల సమీకరణకు తెరతీయనున్నాయి. వెరసి ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ సరికొత్త రికార్డుకు వేదికకానున్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతేడాది (2023-24) పలు చిన్న, మధ్యతరహా కంపెనీలు ఆసక్తి చూపడంతో సగటున ఐపీవో ఇష్యూ పరిమాణం రూ. 815 కోట్లుగా నమోదైంది. ఇక 2022-23లో ఒక్కో ఇష్యూ సగటు పరిమాణం రూ. 1,409 కోట్లుకాగా.. 2021-22లో రూ. 2,105 కోట్లు. అయితే ఈ ఏడాది వీటికి మించి అంటే రెట్టింపు అంతకంటే ఎక్కువ సగటు పరిమాణం నమోదుకానున్నట్లు స్టాక్ మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఎల్ఐసీ రికార్డుకు చెక్!

దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ దేశీ విభాగం ఐపీవో అనుమతి కోసం సెబీకి తాజాగా దరఖాస్తు చేసింది. తద్వారా 15-20 శాతం వాటా విక్రయించే వ్యూహంలో ఉంది. దీంతో 3.3-5.6 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 25,000 కోట్లు) అందుకునే వీలున్నట్లు అంచనా. ఫలితంగా 2022-23లో రూ. 21,000 కోట్లు సమీకరించిన ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ ఇష్యూని అధిగమించనుంది. దేశీయంగా అతిపెద్ద ఐపీవోగా సరికొత్త రికార్డు నెలకొల్పే అవకాశముంది.

నిధులకు క్యూ... (రూ. కోట్లలో)

కంపెనీ పేరు	ఇష్యూ
హ్యుందాయ్	25,000
స్విగ్గీ	8,000
బజాజ్ హౌసింగ్	7,000
అఫ్కాన్స్ ఇన్‌ఫ్రా	7,000
ఓలా ఎలక్ట్రిక్	5,500
ఎన్ఎస్‌డీఎల్	4,500
వరీ ఎనర్జీస్	3,000


లిస్టింగ్‌వైపు చూపు...

రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు అనుగుణంగా బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్ బాటలో సాగుతోంది. సెబీ అనుమతితో రూ. 7,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సైతం ఐపీవో ద్వారా రూ. 7,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇక ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ రూ. 8,000 కోట్ల నిధులను సమకూర్చుకోవాలని చూస్తోంది. ఈ బాటలో ఈవీ స్కూటర్ల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ. 5,500 కోట్లు, ఎన్ఎస్‌డీఎల్ రూ. 4,500 కోట్లు, వరీ ఎనర్జీస్ రూ. 3,000 కోట్లు, ఎమ్‌క్యూర్ రూ. 2,300 కోట్లు చొప్పున సమీకరించనున్నట్లు మార్కెట్ వర్గాలు తెలియజేశాయి. కాగా.. ఈ ఏడాది ఇప్పటికే 8 కంపెనీలు ఐపీవోల ద్వారా మొత్తం రూ. 14,600 కోట్లు అందుకున్నాయి.

హ్యుందాయ్ క్రెటా ఈవీ వచ్చేస్తోంది!

మార్చిలోగా రయ్ రయ్...

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా క్రెటా ఎలక్ట్రిక్ వెహికల్‌ను తీసుకొస్తోంది. 2025 జనవరి-మార్చి మధ్య ఈ మోడల్ దేశీ రోడ్లపై పరుగులు తీస్తుందని కంపెనీ ప్రకటించింది. ఒకసారి చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యంతో క్రెటా ఈవీ రూపుదిద్దుకుంటోందని సమాచారం. ధర రూ. 22-26 లక్షల మధ్య ఉంటుంది. హ్యుందాయ్ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వస్తున్న సంగతి తెలిసిందే. సెబీకి దాఖలు చేసిన పత్రాల ప్రకారం భారత్‌లో నాలుగు ఈవీలను ప్రవేశపెట్టాలన్నది సంస్థ ప్రణాళిక. వీటిలో మాస్ మార్కెట్ మోడల్‌తో పాటు హైఎండ్, ప్రీమియం ఈవీలు సైతం ఉన్నాయి. ఈవీ విభాగంలో కంపెనీ ప్రస్తుతం దేశంలో అయానిక్ 5, కోనా ఎలక్ట్రిక్ విక్రయిస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 17.5 శాతం వాటా విక్రయించాలన్నది సంస్థ లక్ష్యం. తద్వారా రూ.25,000 కోట్లు సమీకరించనుంది. దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్.. బ్యాటరీ ఈవీ, హైబ్రిడ్ ఈవీ, ప్లగ్-ఇన్ హైబ్రిడ్ ఈవీ, మైల్డ్ హైబ్రిడ్ ఈవీ, ఫ్యూయల్ సెల్ ఈవీలను తయారు చేస్తోంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ వ్యాపారం కోసం కంపెనీ గతేడాది తమిళనాడులో రూ.20,000 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. చెన్నై ప్లాంటును ఈవీలు, ఎస్‌యూవీల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు.



హైదరాబాద్‌లో 1ఎం1బీ అకాడమీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 1ఎం1బీ (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ఫౌండేషన్ తాజాగా హైదరాబాద్‌లో గ్రీన్ స్కిల్స్ అకాడమీని ఏర్పాటు చేయనుంది. ఇందుకు అంతర్జాతీయ సీఆర్ఎం (కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్) సాఫ్ట్‌వేర్ దిగ్గజం సేల్స్‌ఫోర్స్‌తో జట్టుకట్టింది. పర్యావరణానుకూల కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా యువతకు శిక్షణనిచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. హైబ్రిడ్ విధానంలో ఈ అకాడమీ 2030 నాటికి తెలంగాణలో లక్ష మంది యువతకు శిక్షణనివ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మానవ్ సుబోధ్ తెలిపారు. కృత్రిమ మేధతో పర్యావరణహిత సొల్యూషన్స్‌ను రూపొందించేందుకు అవసరమైన అధునాతన సాధనాలను సంస్థ అందించనుంది. టాప్-10లో నిల్చిన వారికి ప్రతి ఏటా తాము రూపొందించిన వాటిని ఐక్యరాజ్యసమితిలో ఏటా నిర్వహించే 1ఎం1బీ సదస్సులో ప్రదర్శించే అవకాశం లభిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-6-2024	
విశాఖ	500-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

ఈసారి 15 శాతం రుణ వృద్ధి

ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక వృద్ధి రేటును బట్టి చూస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో (2024-25) రుణాల వృద్ధి 14-15 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. 'సాధారణంగా జీడీపీ వృద్ధి రేటుకు ద్రవ్యోల్బణాన్ని కలిపి, దానికి 2-3 శాతం అదనంగా రుణ వృద్ధి ఉండగలదని అంచనా వేస్తుంటాం. దానికి అనుగుణంగా ప్రస్తుత పరిస్థితుల్లో అవకాశాలను బట్టి ఇది 14-15 శాతం ఉండొచ్చు' అని ఆయన పేర్కొన్నారు. ఇక డిపాజిట్ల విషయానికొస్తే గతేడాది 11 శాతం వృద్ధి నమోదైనట్లు చెప్పారు. ఈసారి 12-13 శాతం స్థాయిలో ఉండగలదని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ చట్టబద్ధ లిక్విడిటీ నిష్పత్తి (ఎస్ఎల్ఆర్) నిర్దేశిత స్థాయికన్నా అధికంగానే ఉన్నందున డిపాజిట్ల రేట్లను పెంచి మరీ నిధులు సమీకరించాల్సిన ఒత్తిళ్లేమీ లేవని ఖారా వివరించారు.



డిఫెన్స్ ఎగుమతులు @ 5 బిలియన్ డాలర్లు!

తయారీ సామర్థ్యాల పెంపు కీలకం ● ఎఫ్‌డీఐలను క్రమబద్ధీకరించాలి ● నెక్స్‌జెన్ నివేదిక

న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) క్రమబద్ధీకరించడం, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలను, తయారీ సామర్థ్యాలను పటిష్టం చేసుకోవడం తదితర అంశాలు ఈ ఆర్థిక సంవత్సరంలో 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.42,000 కోట్లు) డిఫెన్స్ ఎగుమతుల లక్ష్యాన్ని సాధించేందుకు తోడ్పడగలవని ఒక అధ్యయన నివేదిక వెల్లడించింది. ఇంటర్నేషనల్ పోలీస్ ఎక్స్‌పో నిర్వాహక సంస్థ నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం ఆర్అండ్‌డీ, తయారీ సామర్థ్యాలను మెరుగుపర్చుకుంటే దేశీ డిఫెన్స్ రంగం అంతర్జాతీయ తయారీ హబ్‌గా ఎదిగేందుకు అవకాశం ఉందని వివరించింది. ప్రస్తుతం 75 పైచిలుకు దేశాలకు భారత్ రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోంది. మరోవైపు, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతికతలను, డేటా అనలిటిక్స్ మొదలైనవి ఉపయోగించి అంతర్గత భద్రత విభాగాన్ని మరింత పటిష్టం చేసుకోవడం ముఖ్యమని నివేదిక తెలిపింది. భారీ విపత్తు నిర్వహణ వ్యవస్థలను రూపొందించుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సత్వరం చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని వివరించింది. దేశవ్యాప్తంగా 15 నగరాల్లో నిర్వహించిన ఈ సర్వేలో 130 పైచిలుకు దేశ, విదేశ రక్షణ పరికరాల తయారీ సంస్థలు, ఎగుమతిదార్లు, స్టార్టప్‌లు పాల్గొన్నాయి.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎఫ్ఎల్, నోయిడాలో 164 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 164
» పోస్టుల వివరాలు:మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్)-56,మేనేజ్‌మెంట్ ట్రైనీ(మెకానికల్)-18, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎలక్ట్రికల్)-21, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్‌స్ట్రుమెంటేషన్)-17, మేనేజ్‌మెంట్ ట్రైనీ(కెమికల్ ల్యాబ్)-12, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్)-03, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఫైర్ అండ్ సేఫ్టీ)-05,మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)-05, మేనేజ్‌మెంట్ ట్రైనీ (మెటీరియల్స్)-11, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హెచ్ఆర్)-16.
» అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీ డిగ్రీ, పీజీ డిప్లొమా (పీజీడీఎం/పీజీడీబీఎం)/ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.07.2024
» దరఖాస్తు సవరణ తేదీలు: 04.07.2024 నుంచి 05.07.2024 వరకు.
» వెబ్‌సైట్: www.nationalfertilizers.com

ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్శిటీ(ఏపీఎఫ్‌యూ), దాని పరిధిలోని కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు.
» వ్యవధి: రెండేళ్లు. బోధనా మాధ్యమం: ఇంగ్లిష్.
» అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 31.08.2024 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయసు 22 ఏళ్లు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:26.06.2024
» సర్టిఫికెట్ల ఎడిట్ ఆప్షన్: 2.07.2024,3.07.2024
» వెబ్ ఆప్షన్ తేది: 06.07.2024.
» వెబ్‌సైట్: https://apfu.ap.gov.in

» ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ-13 నోటిఫికేషన్
» మొత్తం 9,995 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» ఆఫీసర్స్(స్కేల్-1,2,3), ఆఫీస్ అసిస్టెంట్స్ పోస్టులు
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఆంధ్రప్రదేశ్‌లో 450, తెలంగాణలో 700 పోస్టులు

పల్లె బ్యాంకుల్లో.. వేస్తారా పాగా!

బ్యాంకు ఉద్యోగార్థులకు శుభవార్త! ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. ఆర్ఆర్‌బీల్లో మొత్తం 9,995 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా స్కేల్-1,2,3లతో గ్రూప్-ఎ ఆఫీసర్స్ ; గ్రూప్-బీ ఆఫీస్ అసిస్టెంట్స్ ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. బ్యాచిలర్ డిగ్రీ మొదలు బీటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణుల వరకూ.. అన్ని నేపథ్యాల వారు పోటీ పడే అవకాశం ఉంది! ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ-13 పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకాలకు ఉమ్మడి వ్యవస్థ.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. ఆయా రాష్ట్రాల్లోని గ్రామీణ బ్యాంకుల్లో పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీస్-13 పేరుతో మల్టీపర్పస్ ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1, స్కేల్-2, స్కేల్-3 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం పోస్టులు 9,995

- ఐబీపీఎస్ సీఆర్‌పీ ఆర్ఆర్‌బీ ప్రక్రియ ద్వారా గ్రామీణ బ్యాంకుల్లో వివిధ విభాగాల్లో 9,995 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్): 5,585 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-1: 3,499 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2 (అగ్రికల్చర్ ఆఫీసర్): 70 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(చార్టర్డ్ అకౌంటెంట్): 60 పోస్టులు; ఆఫీసర్(మేనేజర్-జనరల్ బ్యాంకింగ్) స్కేల్-2: 496 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): 94 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(లా): 30 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2 (మార్కెటింగ్): 11 పోస్టులు; ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): 21 పోస్టులు; -ఆఫీసర్ స్కేల్-3(సీనియర్ ఆఫీసర్): 129 పోస్టులు ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 450 పోస్టులు, తెలంగాణలో 700 ఖాళీలను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్, లా, ఎంబీఏ, సీఏ తదితర అర్హతలు ఉండాలి. సంబంధిత కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. వీరు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ నాటికి సంబంధిత సర్టిఫికెట్లు పొందాలి.
- వయసు: 01.06.2024 నాటికి గ్రూప్ బీ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల(మల్టీపర్పస్)కు 18-28 ఏళ్ల మధ్య ఉండాలి. అదేవిధంగా గ్రూప్ ఏ ఆఫీసర్ స్కేల్ 1 (అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు 18-30 ఏళ్ల మధ్య; ఆఫీసర్ స్కేల్ 2 (మేనేజర్) పోస్టులకు 21-32 ఏళ్ల మధ్య; ఆఫీసర్‌స్కేల్ 2 (సీనియర్ మేనేజర్) పోస్టులకు 21-40 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. ఎస్సీ/ఎస్టీలు ఐదేళ్లు, ఓబీసీలు మూడేళ్లు వయో సడలింపు పొందొచ్చు.

ఎంపిక వేర్వేరుగా

ఐబీపీఎస్ ఆయా పోస్టులను అనుసరించి వేర్వేరు ఎంపిక విధానాలను అనుసరిస్తోంది. ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్-1 పోస్టులకు రెండు దశల రాత పరీక్ష (ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్)తో పాటు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆఫీసర్ స్కేల్-2, స్కేల్-3 పోస్టులకు మాత్రం ఒక దశ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

ఆఫీస్ అసిస్టెంట్.. ప్రిలిమినరీ పరీక్ష

- ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్) ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో 80 ప్రశ్నలు-80 మార్కులకు జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు-40 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తే మెయిన్ రాసేందుకు అనుమతి లభిస్తుంది.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** ఆఫీస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. రీజనింగ్40 ప్రశ్నలు-50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు,ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు-50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్-1.. ప్రిలిమినరీ

ఆఫీసర్ స్కేల్-1 ప్రిలిమినరీ పరీక్ష.. ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో మొత్తం 80 ప్రశ్నలు-80 మార్కులకు ఉంటుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు చొప్పున ఉంటాయి. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్స్‌కు అనుమతిస్తారు.

- **మెయిన్ ఎగ్జామినేషన్:** ప్రిలిమినరీ పరీక్షలో నిర్దిష్ట కటాఫ్ సాధించిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో రీజనింగ్ 40 ప్రశ్నలు- 50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్40 ప్రశ్నలు-20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ 40 ప్రశ్నలు-40 మార్కులు,క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. మొత్తం 200 మార్కులకు రెండు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీ లాంగ్వేజ్‌లకు సంబంధించి ఏదో ఒక దాన్నే ఎంచుకోవాలి. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్ నుంచే ఆ విభాగం ప్రశ్నలు ఉంటాయి.
- మెయిన్ ఎగ్జామ్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున తుది దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్- 2,3.. ఒకే రాత పరీక్ష

- ఆఫీసర్ స్కేల్-2(జనరలిస్ట్, స్పెషలిస్ట్), ఆఫీసర్ స్కేల్-3 పోస్టులకు సింగిల్ లెవెల్ పరీక్ష పేరుతో ఒకే రాత పరీక్ష నిర్వహిస్తారు.
- ఆఫీసర్(జనరల్ బ్యాంకింగ్)పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు-50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు,ఇంగ్లిష్ లాంగ్వేజ్/హిందీ లాంగ్వేజ్ 40ప్రశ్నలు-40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు-50 మార్కులకు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- ఆఫీసర్ స్కేల్-2(స్పెషలిస్ట్ కేటగిరీ) పోస్టులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40ప్రశ్నలు-40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-20 మార్కులు,కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40ప్రశ్నలు-40మార్కులకు చొప్పున మొత్తం 200మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- ఆఫీసర్ స్కేల్-3 పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు-50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు-50 మార్కులకు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- అన్ని పోస్టులకు సంబంధించి పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతాయి.
- రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 1:3 నిష్పత్తిలో (ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున) చివరి దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 27.
- ప్రిలిమ్స్ హాల్ టికెట్ డౌన్‌లోడ్: జూలై/ఆగస్టు.
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: ఆగస్టులో .
- మెయిన్ ఎగ్జామ్: సెప్టెంబర్/అక్టోబర్‌లో .
- ఇంటర్వ్యూల నిర్వహణ: నవంబర్‌లో.
- ప్రాథమిక నియామకాల ఖరారు:జనవరి 2025లో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ibps.in
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: www.ibps.in/index.php/ruralbankxiii

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్

ఇందులో రాణించడానికి కోడింగ్, డీకోడింగ్,సీటింగ్ అరేంజ్‌మెంట్స్, పజిల్స్, ఇన్-ఈక్వాలిటీస్, ఆల్ఫాబెటికల్ సీక్వెన్సెస్, సిలాజిజమ్స్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్స్, ఇన్‌పుట్-అవుట్‌పుట్స్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి. అధ్యయనంతోపాటు నిత్యం ప్రాక్టీస్‌కు సమయం కేటాయించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉన్న విభాగం.. ఇంగ్లిష్ లాంగ్వేజ్. ఇందులో గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్, సెంటెన్స్ కరెక్షన్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా తెలుగు విద్యార్థులు ఏదైనా ఇంగ్లిష్ పత్రికను రోజూ చదువుతూ రీడింగ్ వేగం పెంచుకోవడంతోపాటు వొకాబ్యులరీని మెరుగుపరచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో రాణించడానికి కరెంట్ అఫైర్స్, దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగంలో పరిణామాలు, మానిటరీ పాలసీ, రుణాలు, వడ్డీ రేట్లు, ఫైనాన్స్ రంగ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దాంతోపాటు జాతీయ, అంతర్జాయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన ఘటనలు, తేదీలు, వ్యక్తుల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్

రెండు దశల రాత పరీక్షల్లోనూ ఉండే ఈ విభాగంలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలు, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి. చదవడంతోపాటు వేగంగా సమాధానం గుర్తించేలా ప్రాక్టీస్ చేయాలి. వేగం, కచ్చితత్వంతోనే ఇందులో మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ఆఫీసర్ స్కేల్-2 పోస్టులకు నిర్వహించే ఈ విభాగంలో మంచి మార్కుల కోసం అభ్యర్థులు తమ అకడమిక్ అర్హతలకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాటిని సమకాలీన పరిస్థితులతో బేరీజు వేస్తూ అధ్యయనం చేయాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించడానికి కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్(కీ బోర్డ్ షార్ట్ కట్స్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తదితర అంశాలు)పై అవగాహన పెంచుకోవాలి.

ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఆఫీసర్ స్కేల్-2, ఆఫీసర్ స్కేల్-3 పోస్టులకు ఉండే ఈ విభాగంలో స్కోర్ కోసం తాజా బ్యాంకింగ్ రంగ పరిణామాలు, బ్యాంకింగ్ వ్యవస్థ విధానాలు, ఆర్థిక రంగంలో జరుగుతున్న తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

క్లుప్తంగా...

నేటి నుంచి కాళేశ్వరం ఆలయ దర్శన వేళల్లో మార్పు

కాళేశ్వరం (జయశంకర్ భూపాలపల్లి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం దర్శన వేళల్ని యథావిధిగా పునరుద్ధరించారు. ఇంతకు ముందు ఎండల తీవ్రత కారణంగా భక్తులు, అర్చకులు, సిబ్బంది సౌకర్యార్థం సమయాలను మార్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో పాత దర్శన వేళలను పునరుద్ధరించినట్లు ఈఓ మారుతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 1.30, తిరిగి సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని వివిధ పూజలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'సీతాకల్యాణ వైభోగమే' సినిమా విజయం సాధించాలి

సీఎం రేవంత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'సీతా కల్యాణ వైభోగమే' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయని, ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సుమన్ తేజ్, గరీమా చౌహాన్ హీరో హీరోయిన్లుగా సతీశ్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి చిత్ర యూనిట్ టీజర్, ట్రైలర్‌ను చూపించింది. వీక్షించిన అనంతరం యూనిట్‌కి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నిర్మాత రాచాల యుగంధర్, డైరెక్టర్ సతీశ్, నీరూస్ ప్రతినిధి అసీమ్, నటీనటులు సుమన్ తేజ్, గరీమా చౌహాన్, గగన్ విహారి తదితరులు ఉన్నారు.

వారికి సీఎం అభినందనలు

విధి నిర్వహణలో మానవత్వం చాటిన ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ నిర్వహణతో పాటు తోటి మనిషికి సకాలంలో సాయం చేయడం గొప్ప విషయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రెండు సంఘటనలను పేర్కొంటూ ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కరీంనగర్ బస్ స్టేషన్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న గర్భిణికి సకాలంలో కాన్పు చేసి మానవత్వం చాటుకున్న టీజీఎస్ఆర్‌టీసీ మహిళా సిబ్బందిని సీఎం అభినందించారు. ఆర్టీసీ మహిళా సిబ్బంది సకాలంలో స్పందించడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని కొనియాడారు. 'విధి నిర్వహణలో కూడా మీరు ఇలాగే మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. అలాగే, యూపీఎస్సీ పరీక్ష రాసేందుకు బస్టాప్‌లో వేచి చూస్తున్న ఓ యువతిని ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్ సకాలంలో పరీక్ష కేంద్రం వద్దకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడాన్ని కూడా సీఎం అభినందించారు. 'వాహనాల నియంత్రణ మాత్రమేం తన డ్యూటీ అనుకోకుండాం... సాటి మనిషికి సాయం చేయడం తన బాధ్యత అని భావించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌కుం నా అభినందనలు' అని పేర్కొన్నారు. 'సురేష్ సహకారంతోం సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్న సోదరిం యూపీఎస్సీ పరీక్షల్లోం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నా. ఆల్ ది బెస్ట్' అని రేవంత్ చెప్పారు.

పద్మావతీ అమ్మవారి తెప్పోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే తెప్పోత్సవాల్లో తొలిరోజు రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత శ్రీకృష్ణ స్వామిని సుప్రభాతంతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నాలుగు గంటల వరకు స్వామి వారి ముఖ మండపంలో వేదపారాయణం, మంగళవాయిద్యాల నడుమ ఉభయదేవేర్లతో సహా స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఉభయదేవేర్లతో సహా స్వామి వారిని వేంచేపుగా ఆలయం నుంచి అమ్మవారి పుష్కరిణికి తీసుకొచ్చి తెప్పపై కొలువుదీర్చారు. అనంతరం 6.30 గంటలకు సర్వాంగ శోభితుడైన స్వామి వారు ఉభయదేవేర్లతో సహా మూడు పర్యాయాలు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. రాత్రి 7.30 గంటలకు స్వామి వారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కాగా, తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసుందరరాజస్వామికి స్నపన తిరుమంజనం జరుగనుంది. సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు.

ఏఐకే మస్కా



రెక్కల్లో తలదాచుకున్న ఈ ఫ్లెమింగో చిత్రం అద్భుతంగా ఉంది కదూ. ప్రతిష్టాత్మక '1839 ఫొటోగ్రఫీ అవార్డ్స్' జ్యూరీ కూడా ఇదే ఫీలైంది. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'(ఏఐ) చిత్రాల కోసం నిర్వహించిన ఈ పోటీలో ఏకంగా మూడో బహుమతి దక్కించుకుంది. అయితే.. ఇక్కడే ఉంది ట్విస్టు.. తీరా చూస్తే.. ఇది కృత్రిమ మేధ (ఏఐ)తో సృష్టించిన ఫొటో కాదట. రియల్ చిత్రమేనట. 38 ఏళ్ల మైల్స్ ఆస్ట్రే అనే ఫొటోగ్రాఫర్ 'ఫ్లెమింగోన్' పేరుతో తీసిన ఈ చిత్రాన్ని అవార్డుల పోటీకి పంపారు. దీన్ని చూసి అబ్బురపడిన జడ్జీలు ఉత్తమ చిత్రాల్లో ఒకటిగా నిర్ణయించారు. తర్వాత ఇది కృత్రిమ మేధ చిత్రం కాదని తెలిసి నాలుక్కరుచుకున్నారు. ఆ ఫొటోగ్రాఫర్‌పై అనర్హత వేటువేశారు. 'ఏఐ రూపొందించిన చిత్రాలు వాస్తవ ఫొటోల కంటే మెరిసిపోతుండటాన్ని గమనించాను. అందువల్ల ఏఐ పోటీలో రియల్ ఫొటోను సమర్పించడం ద్వారా మానవుడు మాత్రమే అద్భుతాలను సృష్టించగలడు అనే సందేశాన్ని ఇవ్వడానికే ఈ చిత్రాన్ని ఏఐ పోటీకి పంపాను' అని ఫొటోగ్రాఫర్ ఆస్ట్రే తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

- సాక్షి సెంట్రల్ డెస్క్

6 పాలసీలు ఆలస్యమే!

పారిశ్రామిక అనుబంధ పాలసీలపై కొలిక్కిరాని కసరత్తు

మందకొడిగా సాగుతున్న రూపకల్పన ప్రక్రియ

- గత ప్రభుత్వ విధానాల లోటుపాట్లపై సమీక్ష
- టీజీ ఐపాస్‌కు మెరుగులు దిద్దడంపై అధికారుల మల్లగుల్లాలు
- టీ ప్రైడ్, టీ ఐడియా ప్రోత్సాహకాల విధివిధానాలు మార్చే యోచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో వివిధ రంగాలకు సంబంధించి కొత్తగా ఆరు పాలసీలు రూపొందిస్తామన్న ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. నూతన విధానాలను శరవేగంగా అమలు చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినప్పటికీ ఇప్పట్లో అమల్లోకి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఆరు పాలసీల రూపకల్పన మరింత ఆలస్యమయ్యే అవకాశముందని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక పాలసీ టీజీ ఐపాస్‌కు అనుబంధంగా కొత్తగా ఎంఎస్ఎంఈ, ఎగుమతులు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, మెడికల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో గతంలో రూపొందించిన లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల పాలసీలో మార్పులు చేర్పులు చేస్తామని చెప్పింది. పాలసీల రూపకల్పన బాధ్యతలను కొందరు సీనియర్ అధికారులకు అప్పగించగా, వీటికి సంబంధించిన సమాచార సేకరణ ఇంకా పూర్తికాలేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయా రంగాలకు సంబంధించిన విధానాలపై అధ్యయనం జరుగుతున్నట్లు పరిశ్రమల శాఖ వర్గాలు వెల్లడించాయి. తాము కోరిన సమాచారం అందిన తర్వాత ఆయా రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ఇతర భాగస్వాములతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం 'ఇండస్ట్రియల్ పాలసీ ఫ్రేమ్‌వర్క్'లో భాగంగా సులభతర అనుమతుల కోసం 'టీజీ ఐపాస్'చట్టాన్ని రూపొందించింది. పెట్టుబడులతో వచ్చే వారికి ప్రోత్సాహకాల కోసం టీ ఐడియా, టీ ప్రైడ్‌ను అమలు చేసింది. మరికొన్ని అనుబంధ పాలసీలు ప్రకటించినా వాటిలో కొన్నింటికి మార్గదర్శకాలు విడుదల కాలేదు. మరోవైపు టీజీ ఐపాస్ గడువు 2019లో ముగిసినా పాత విధానాన్నే కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీజీ ఐపాస్, అనుబంధ పాలసీల లోటు పాట్లపై సమీక్ష చేస్తున్నట్లు సమాచారం. కొత్త పారిశ్రామిక విధానంలో మెరుగైన ప్రోత్సాహకాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పరిశ్రమలకు కేటాయించే భూముల ధరలు ఎక్కువగా ఉండటం, రాయితీలు తక్కువగా ఉండటం వంటి అంశాలను సరిదిద్దాలనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందుతున్నాయి. టీజీ ఐపాస్‌కు మెరుగులు దిద్ది కొత్త పారిశ్రామిక విధానం ప్రకటించేందుకు 6 నెలలకు పైనే సమయం పట్టే అవకాశముందని భావిస్తున్నారు.

గత ప్రభుత్వ పాలసీలపై సమీక్ష



ప్రోత్సాహకాల విధివిధానాల్లో మార్పులు..

పెట్టుబడులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం టీ ఐడియా, టీ ప్రైడ్ పేరిట జనరల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు చెందిన వారికి పలు ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రకటించింది. విద్యుత్, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, వడ్డీపై రాయితీ తదితరాలను అమలు చేసింది. అయితే ప్రస్తుతం రాయితీలు, ప్రోత్సాహకాలకు సంబంధించి రూ.3,700 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. కొత్త పాలసీలు, బకాయిల చెల్లింపుపైనా స్పష్టత ఇవ్వడంతో పాటు ప్రోత్సాహకాలకు సంబంధించిన విధి విధానాల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

కారుపై పులి దాడి



- వాహనం ఢీకొనడంతో దాడి చేసిన పెద్దపులి..
- గాయాలతో అటవీ ప్రాంతానికి వెళ్లిపోయిన పులి
- ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఘటన

మర్రిపాడు/ఆత్మకూరు రూరల్: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా పెద్ద పులి రావడం కలకలం రేగింది. ఆ పులిని ఓ కారు ఢీకొనడం.. ఆగ్రహంతో పెద్దపులి తిరిగి ఆ కారుపై దాడి చేయడం సంచలనం సృష్టించింది. ఈ ఆకస్మిక ఘటనతో కారులో ప్రయాణిస్తున్నవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కారులో ఉన్న వ్యక్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బద్వేల్ నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఓ కారుకు కదిరినాయుడుపల్లి సమీపంలో వెలిగొండ అటవీ ప్రాంతం వద్ద ఒక్కసారిగా పెద్దపులి అడ్డు వచ్చింది. పెద్దపులిని కారు ఢీకొని కొద్దిదూరం ముందుకు దూసుకువెళ్లింది. దీంతో పెద్దపులికి కోపం వచ్చి వాహనం ముందు భాగంపై తన పంజాతో దాడి చేసింది. అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. కారు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో లోపల ఉన్నవారికి ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం ధ్వంసమైంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. పెద్దపులి కాలి ముద్రలు, కారు ఢీకొనడం వల్ల పులి గాయపడినట్లుగా ఆనవాలు కనుగొని ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించారు. అటవీశాఖ అధికారులు కదిరినాయుడుపల్లి సమీపంలోని అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దపులి సంచారంతో కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతం సమీపంలోని పడమటినాయుడుపల్లి, చుంచులూరు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

శేషాచలం వరకు చేరిన పెద్దపులి!

→ శ్రీశైలం–శేషాచలం మధ్య పెద్దపులుల కారిడార్ ఉంది. శ్రీశైలం–నాగార్జున సాగర్ అభయారణ్యం నుంచి శేషాచలం వరకు పులుల విస్తరణ కోసం అధికారులు పలు చర్యలు చేపట్టారు. అయితే, శేషాచలం వరకు పెద్దపులి వెళ్లిందా.. లేదా.. అని ఇప్పటికీ సంశయంగానే ఉండేది. ఆ అనుమానాలకు తెరదించుతూ శేషాచలం అటవీ ప్రాంతం వరకు పెద్దపులి చేరిందని కదిరి నాయునిపల్లె సమీపంలో సోమవారం జరిగిన ఘటనతో స్పష్టమైంది.

పెద్దపులి పిల్లలకు వేట నేర్పేందుకు..

- నల్లమలలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటుచేసిన ఏపీ అటవీశాఖ
- వేట కోసం కాకినాడ నుంచి చారల దుప్పులు, సాంబార్‌ల తరలింపు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో తల్లి నుంచి విడిపోయి తిరుపతి జూపార్కులో పెరుగుతున్న పెద్దపులి పిల్లలను త్వరలోనే తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ముందుగా పులిపిల్లలకు తమ ఆహారాన్ని తామే సమకూర్చుకునేలా వేటాడటాన్ని నేర్పించేందుకు చర్యలు చేపట్టింది. సుమారు 14 నెలల కిందట నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలోని అభయారణ్యంలో తల్లి నుంచి నాలుగు పులి పిల్లలు విడిపోయాయి. వాటిని తిరుపతి జూ పార్కుకు తరలించి సంరక్షిస్తుండగా, ఒకటి మరణించింది. మూడు పెద్ద పులి పిల్లలు పెరిగి పెద్దవుతుండటంతో వాటిని తిరిగి నల్లమల అభయారణ్యంలో వదిలేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ముందుగా వాటికి తమ ఆహారాన్ని తాము సమకూర్చుకునేలా వేటాడటం నేర్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా పెద్దపులి పిల్లల సంరక్షణ కోసం నల్లమల అభయారణ్యం కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్దపెంట వద్ద 15 హెక్టార్లలో ప్రత్యేక ఎన్‌క్లోజర్లను సిద్ధం చేశారు. కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్స్, కెమికల్స్ జూ పార్కు నుంచి గతంలో కొన్ని చారల దుప్పులను తీసుకువచ్చి ఎన్‌క్లోజర్లలో సంరక్షిస్తున్నారు. మళ్లీ ఆదివారం కాకినాడ నుంచి సుమారు 15 చారల దుప్పులు, మరో 28 సాంబార్‌లను నల్లమలకు తరలించారు. వీటిలో పెద్దదోర్నాల రేంజి పరిధిలోని తెట్టగుండం వద్ద ఎన్‌క్లోజర్‌కు 15 చారల దుప్పులు, నెక్కంటి రేంజి పరిధిలోని ఆరపెంటకు 16 సాంబార్‌లు, కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్దపెంటకు 6 సాంబార్లు, నంద్యాల రేంజి పరిధిలోని పచ్చర్లకు 6 సాంబార్లను ప్రత్యేక వాహనాల్లో తరలించారు. వీటిని కొన్నిరోజులు ఎన్‌క్లోజర్లలో ఉంచిన తర్వాత పెద్దపులి పిల్లలను తీసుకువచ్చి వదులుతారు. పెద్దపులి పిల్లలు వ్యక్తిగతంగా 50 వన్యప్రాణులను వేటాడిన తర్వాత వాటి శక్తియుక్తులను గుర్తించిన అనంతరం నల్లమల అభయారణ్యంలో వదిలేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.



నల్లమలలోని తెట్టగుండం ఎన్‌క్లోజర్‌కు చేరిన చారల దుప్పులు

ఆర్టీసీ ఆసుపత్రిలో సీటీ స్కాన్

- ఆర్థికభారం లేకుండా 'ప్రైవేటు' సేవలు
- ఎట్టకేలకు రిఫరల్ భారం నుంచి బయటపడ్డ సంస్థ.. బయటి రోగులకు చార్జీలు వసూలు చేసుకునేలా అనుమతి

సాక్షి, హైదరాబాద్: తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో రోగుల కోసం ఎట్టకేలకు సీటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఇంతకాలం ఆసుపత్రికి వచ్చే ఆర్టీసీ ఉద్యోగులకు సీటీ స్కాన్ చేయాలంటే ప్రైవేటు ఆసుపత్రులకో, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకో పంపాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ లేకుండా, ఆర్టీసీ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది.

ప్రైవేటు సంస్థ చొరవతో...

ఆర్టీసీకి సొంతంగా తార్నాకలో విశాలమైన ఆసుపత్రి అందుబాటులో ఉంది. కానీ, ఇటీవలి వరకు అందులో కనీస సౌకర్యాలు ఉండేవి కాదు. అయితే సంస్థ ఎండీ సజ్జనార్ ప్రత్యేక దృష్టి సారించి దాన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్థాయికి అభివృద్ధి చేశారు. ఆసుపత్రికి సొంత ఆర్థిక వనరులు కూడా ఉండాలన్న ఉద్దేశంతో, గతేడాది ఆర్టీసీ ఉద్యోగులకే కాకుండా సాధారణ ప్రజలకు కూడా చికిత్సలు ప్రారంభించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉండగా, సాధారణ ప్రజలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఆసుపత్రికి ఆదాయం సమకూరుతుందన్నది ఉద్దేశం. అయితే ఇప్పటివరకు ఆస్పత్రిలో సీటీ స్కాన్ యంత్రం అందుబాటులో లేదు. నిత్యం సగటున ముగ్గురికి ఆ ఆసుపత్రిలో సీటీ స్కాన్ అవసరం ఏర్పడుతోంది. దీంతో రిఫరల్ కేసులుగా వారిని ప్రైవేటు కేంద్రాలకు పంపుతున్నారు. ఆ రూపంలో ఆర్టీసీ ఆర్థికంగా నష్టపోతోంది. సొంతంగా సీటీ స్కానింగ్ యంత్రం కొనే ఆర్థిక పరిస్థితి లేకపోవటంతో సంవత్సరాలుగా అలాగే నెట్టుకొస్తూ వచ్చారు. ఇప్పుడు ఓ ప్రైవేటు స్కానింగ్ కేంద్రం చొరవతో ఆసుపత్రిలో సీటీ స్కానింగ్ యంత్రం ఏర్పాటైంది. ఆ సంస్థ లాభాపేక్షతో దాన్ని ఏర్పాటు చేయటం విశేషం. ఆర్టీసీ ఉద్యోగులకు ఉచితంగా స్కానింగ్ చేస్తూనే, బయట రోగులకు మాత్రం ఫీజు వసూలు చేసుకుంటుంది. ఆ సంస్థకు ఆర్టీసీ ఏమీ చెల్లించనవసరం లేదు. దీంతో ఆర్టీసీకి ఆర్థిక భారం లేకుండానే సీటీ స్కాన్ యంత్రం సమకూరినట్టయింది. ఇది అందుబాటులోకి రావటంతో ఆర్టీసీ ఉద్యోగులను రిఫరల్ కేసులుగా ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు పంపటం ఆపేశారు.



తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీస్కాన్

మెడికల్ షాపుతోనూ ఆదాయం..

ఇక త్వరలో తార్నాక ఆసుపత్రిలో ఫిజియోథెరపీ కేంద్రాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఉద్యోగులే కాకుండా ప్రైవేట్ వ్యక్తులు కూడా మందులు కొనటం ద్వారా ఆదాయం సమకూరుతుందన్న ఉద్దేశంతో లోపల ఉన్న మందుల దుకాణాన్ని తార్నాక ప్రధాన రోడ్డు వైపు తెరిచారు. త్వరలో అధికారికంగా వీటిని ప్రారంభించనున్నారు.

రెండ్రోజులు మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రెండ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు చెప్పింది. మరోవైపు రాష్ట్రానికి నైరుతి దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నాయని తెలిపింది. సోమవారం పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కాగా, మిగతా ప్రాంతాల్లో కూడా మోస్తరు వర్షాలు నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో 7.35 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శంకర్‌పల్లిలో 7.10 సెం.మీ. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 6.25 సెం.మీ., మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 6.10 సెం.మీ., హైదరాబాద్ జిల్లా గోల్కొండలో 5.8 సెం.మీ., ఆసిఫ్‌నగర్‌లో 5.7 సెం.మీ., ఖైరతాబాద్‌లో 5.25 సెం.మీ, చొప్పున వర్షపాతం నమోదైంది. హైదరాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, జనగామ జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదయ్యాయి. మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

నేడు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ నెల కోటా విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సెప్టెంబర్ నెల కోటాను మంగళవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందాక ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు, అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను ఉదయం 11 గంటలకు, వయో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో ఆగస్టు నెల గదుల కోటాను ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు, తిరుమల–తిరుపతి శ్రీవారి సేవ కోటాను ఈ నెల 27న ఉదయం 11 గంటలకు, నవనీత సేవ టికెట్లు మధ్యాహ్నం 12 గంటలకు, పరకామణి సేవ టికెట్లు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. https://ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ బాట గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 69,870 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి స్వామివారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

19 నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి, శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. మొదటిరోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచం అలంకరించి పుర వీధుల్లో ఊరేగిస్తారు. రెండో రోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడో రోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు బంగారు కవచంతోనే ఉంటారు. జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్ 21వ తేదీ కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.



రూ.150 టికెట్ దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ

యాదాద్రికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట: వరుస సెలవులు రావడంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం శ్రీస్వామివారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ టిక్కెట్ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, మెట్లమార్గం నిండుగా కనిపించాయి. శ్రీస్వామిని 45 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.66,21,151 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

రూ.150 క్యూలైన్‌లో ఫ్యాన్లులేవు..: భక్తులు అధికంగా రూ.150 వీఐపీ టికెట్ కొనుగోలు చేసి దర్శనానికి వెళ్తారు. అయితే ఈ క్యూలైన్‌లో ఫ్యాన్లు లేకపోవడంతో మధ్యాహ్నం ఉక్కపోతతో భక్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. క్యూలైన్‌లో భక్తులకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో అధికారుల తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, అధిక రద్దీ కారణంగా కొండపైకి, కిందకి తిరిగే బస్సుల్లో భక్తులు ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ కనిపించారు.

పంట చేనులో 12 కేజీల చేప



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం ఖండ్రిగ గ్రామంలో రైతు బొక్కా రామ్మూర్తి పంట చేనులో సోమవారం భారీ చేప దొరికింది. సాధారణంగా నాలుగు కేజీల వరకు బరువు ఉండే 'అలుగు' జాతికి చెందిన ఈ చేప మూడు అడుగుల పొడవు, 12 కేజీల బరువు ఉండటం విశేషం. – కొత్తపేట

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.